ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 25, మార్చి 2025

పాఠకుల పండుగ

ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్

అక్షరమే ఆయుధంగా పునఃప్రారంభమైన ఆంధ్రజ్యోతి జనాదరణే ఊపిరిగా 22 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్ల ప్రస్థానంలో చురకలంటించే కథనాలతోపాటు ఆదరాభిమానం చూపుతున్న పాఠకులకు ఎన్నో బహుమతులు అందజేస్తోంది. అందులో భాగంగా 22వ వార్షికోత్సవం సందర్భంగా 'కార్ అండ్ బైక్ రేస్' పేరిట పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు సంస్థ కార్యాలయానికి పంపారు. ఇలా వేలాదిగా వచ్చిన కూపన్లలో విజేతలను సోమవారం సాయంత్రం ఒంగోలు సమీపంలోని త్రోవగుంట వద్ద ఉన్న యూనిట్ కార్యాలయంలో ఎంపిక చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల డ్రాను తీశారు. వంద కన్సొలేషన్ బహుమతుల విజేతలను కూడా ప్రకటించారు.



మొదటి బహుమతి విజేత ఎంపిక కోసం డ్రా తీస్తున్న ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు ఆంధ్రజ్యోతి కార్యాలయంలో కారు, బైక్ రేస్ స్కీం డ్రా నిర్వహణ

- భారీగా బహుమతుల గెలుపు
- ముఖ్యఅతిథులుగా హాజరైన కార్పొరేషన్ కమిషనర్, డ్వామా పీడీ, ఒంగోలు డీఎస్పీ
- ఉత్సాహంగా సాగిన కార్యక్రమం
- అద్దంకి వాసికి ప్రథమ, ఒంగోలు వాసికి ద్వితీయ అద్దంకికే చెందిన మహిళకు తృతీయ బహుమతి
- వంద మందికి కన్సొలేషన్

7

మొదటి బహుమతి : బైక్
విజేత : పుష్పగిరి ఆంజనేయులు బ్రహ్మనందం కాలనీ రోడ్డు, అద్దంకి

రెండో బహుమతి : ఫ్రిజ్
విజేత : కె. సుబ్రహ్మణ్యం రామాలయం వద్ద, గద్దలగుంట ఒంగోలు

మూడో బహుమతి : ఎల్ఈడీ టీవీ
విజేత : కరేటి భవ్య ఇందిరానగర్, అద్దంకి





మొదటి బహుమతి విజేతను ఫోన్‌లో అభినందిస్తున్న వెంకటేశ్వరరావు



రెండో బహుమతి విజేతకు ఫోన్‌లో సమాచారం ఇస్తున్న జోసఫ్‌కుమార్




మూడో బహుమతి విజేతతో ఫోన్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

1న చంద్రబాబు.. 2న లోకేష్

ఒక రోజు వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు అగ్రనేతల పర్యటన

- పెదగంజాంలో పింఛన్లు పంపిణీ చేయనున్న సీఎం
- పీసీపల్లి మండలంలో బయోగ్యాస్ ప్లాంట్‌కు విద్యాశాఖ మంత్రి శంకుస్థాపన
- భారీ ఏర్పాట్లలో అటు ఏలూరి, ఇటు ఉగ్ర నరసింహారెడ్డి

ఒంగోలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఒక రోజు వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వంలో అలాగే తెలుగుదేశం పార్టీలో అగ్రనేతలైన ఇరువురు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. టీడీపీ అధినేతలుగా కాకుండా ప్రభుత్వ కీలక ప్రతినిధులుగా ఇద్దరూ వస్తున్నారు. ఏప్రిల్ 1న



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్చూరు నియోజకవర్గానికి వస్తుండగా.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 2న కనిగిరి నియోజకవర్గంలో పర్యటించను న్నారు. ప్రజల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం వస్తున్నారు. ఏప్రిల్ 1న చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ గొల్లపాలెంలో కార్యక్రమం జరగనుంది. అనంతరం గ్రామస్థులతో సీఎం ముఖాముఖి నిర్వహిస్తారు. కాగా ఉమ్మడి జిల్లాకు నెలన్నర రోజుల్లో ముఖ్యమంత్రి రావడం ఇది మూడోసారి. ఫిబ్రవరి 15న కందుకూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసారి పెదగంజాంకు కూడా రాష్ట్రస్థాయి కార్యక్రమమైన పింఛన్ల పంపిణీకి వస్తున్నారు.



బయోగ్యాస్ ప్లాంట్‌కు విద్యాశాఖ మంత్రి భూమిపూజ

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏప్రిల్ 2న కనిగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న మెగా బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తారు. రాష్ట్రంలో రూ.65వేల కోట్లతో రిలయన్స్ సంస్థ 500 ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అందులో తొలిగా జిల్లాలోని కనిగిరి ప్రాంతంలో ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. జిల్లాలో నాలుగు ప్లాంట్ల ఏర్పాటుకు

మిగతా 6వ పేజీలో



ఎర్రమట్టితో చదును చేసిన పార్కు

ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభం



ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 37వ డివిజన్‌లో ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇటీవల 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో స్థానిక సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందులో పార్కు కూడా ఉంది. దీంతో పార్కులో మౌలిక సౌకర్యాలు, గ్రౌండ్ లెవలింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. గతంలో రెండు అడుగులు దిగువకు ఉండటంతో వర్షం కారణంగా పార్కు ఆవరణ చెరువులా మారేది. ఈ విషయాన్ని పార్కు కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కమిషనర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. 37వ డివిజన్‌లోని సమస్యల పరిష్కారంలో భాగంగా మొదటగా పార్కును అందంగా తీర్చిదిద్దే పనులను ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. వాటిని వేగవంతంగా చేయిస్తున్నారు.

పది పరీక్షలపై ప్రత్యేక దృష్టి

- నిద్రపోతున్న చీఫ్‌పై చర్యలు
- అదనపు డైరెక్టర్, ఆర్‌జేడీ కేంద్రాల సందర్శన
- అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్
- తప్పు జరిగితే సహించేది లేదని హెచ్చరిక



తాళ్లూరులో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఒంగోలు విద్య, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో కొన్ని కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయన్న ప్రచారం నేపథ్యంలో కలెక్టర్ అప్రమత్తమై సోమవారం జిల్లా అధికారులు, పోలీసు, విద్యాశాఖ, మునిసిపల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో చిన్న తప్పు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. విద్యాశాఖ 25/97 యాక్టు ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనేపథ్యంలో అధికారులంతా కేంద్రాలను తనిఖీ చేయడంతోపాటు పరీక్షల నిర్వహణను గంటగంటకూ పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులు కేంద్రాలను సందర్శించారు. విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఏపీ సుబ్బారెడ్డి, గుంటూరు ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్‌లు సోమవారం కేంద్రాలను సందర్శించారు. పరీక్షలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రస్తుతం ఉన్న 25 సిట్టింగ్ స్క్వాడ్లకు అదనంగా మరో ఎనిమిది, అలాగే ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు.

అధికారుల తనిఖీలు

విద్యాశాఖ ఉన్నతాధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఏపీ సుబ్బారెడ్డి తాళ్లూరు, తూర్పుగంగవరం, చీమకుర్తిలోని కేంద్రాలను సందర్శించగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, మద్దిపాడు, తెల్లబాడు, చీమకుర్తిలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. డీఈవో కిరణ్‌కుమార్, ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి మర్రి శ్రీనివాసులు కూడా అధికారులతో కలిసి కేంద్రాలను సందర్శించారు.

444 మంది గైర్హాజరు

సోమవారం జరిగిన గణితం పరీక్షకు 444 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 29,612 మందికి 29,168 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 37 మందికి 18మంది హాజరు కాగా 19మంది గైర్హాజరయ్యారు. ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ గణితం పరీక్షకు 1,378 మందికి 889 మంది హాజరయ్యారు.

కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణలో చిన్న తప్పు జరిగినా సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. పరీక్షల నిర్వహణపై ఆమె సోమవారం ఉదయం జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేషు, ఏఎస్పీ, ఆర్డీవోలు, డీఎస్పీలు, సీఐలు, తహసీల్దార్లు, డీఈవో, ఎంఈవోలు, పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డీవోలు, ఇతర అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎటువంటి అక్రమాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు విస్తృతంగా ఏర్పాటు చేయమన్నారు. చీఫ్‌లు, డీవోలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా తప్పు జరిగితే విద్యాశాఖ యాక్టు ప్రకారం ఆరు నెలల నుంచి మూడేళ్ల కఠినశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా

మిగతా 6వ పేజీలో

చీమకుర్తిలో చీఫ్‌పై చర్యలు

చీమకుర్తిలోని ఒక పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ గురకపెట్టి నిద్రపోతున్న ఒక హెచ్ఎంపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆ పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకులు సుబ్బారెడ్డి, ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్‌లు ఒకేసారి సందర్శించారు. ఆ సమయంలో డిపార్ట్‌మెంట్ అధికారి వారి వెంట ఉండి అన్ని గదులు చూపించారు. చీఫ్ సూపరింటెండెంట్ కనిపించకపోవడంతో ఆయన గురించి అధికారులు వాకబు చేశారు. ఆ తర్వాత ఒక గదిలో పరిశీలించగా చీఫ్ బల్లపై పడుకొని నిద్రపోతుండటాన్ని గమనించిన అధికారులు విస్తుపోయారు. ఆయన్ను నిద్రలేపి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో పడుకున్నానని చీఫ్ చెప్పారు. అలాగైతే సెలవు పెట్టి విశ్రాంతి తీసుకోవాలని, పరీక్షల విధుల్లో నిద్రపోవడం ఏమిటని మండిపడ్డారు. చీఫ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని పరిశీలకులు సుబ్బారెడ్డి, ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి డీఈవోను ఆదేశించారు. ప్రాథమికంగా ఆయన్ను చీఫ్ డ్యూటీ నుంచి తొలగించి సంజాయిషీ నోటీసు జారీచేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ఎయిడెడ్ నియామకాలకు 28,29 తేదీల్లో కంప్యూటర్ పరీక్ష 6

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట



- జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు విడుదల
- విశ్రాంత ఉద్యోగుల బిల్లులు కూడా క్లియర్
- జిల్లావ్యాప్తంగా వందలాది మందికి లబ్ధి
- రూ.500 కోట్లకుపైగా జమయ్యే అవకాశం
- మూడు రోజుల్లో చెల్లింపు ప్రక్రియ పూర్తి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదిన్నర నుంచి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక బకాయిలను చెల్లించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.6,200 కోట్లను విడుదల చేయాలని సీఎం ఇటీవల ఆదేశించారు. తదనుగుణంగా సోమవారం నుంచి పెండింగ్ బకాయిలను ఆర్థికశాఖ విడుదల చేస్తోంది. అవి ఉద్యోగుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సుమారు రూ.500 కోట్లకుపైగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఈ ఆర్థిక బకాయిలు జమకానున్నట్లు సమాచారం. ఈ మొత్తం మూడు రోజుల్లో పూర్తిగా చెల్లింపులు జరగనున్నట్లు తెలిసింది.

ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఉన్న జీపీఐ, ఏపీజీఎల్ఐ బకాయిలతోపాటు రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బిల్లులను కూడా ఆర్థిక శాఖ నుంచి

మిగతా 6వ పేజీలో

మాజీ ఎంపీపీ ఆళ్లకు 14 రోజుల రిమాండ్

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మాజీ ఎంపీపీ, జి.ఉమ్మడివరం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల ఆంజనేయరెడ్డికి కోర్టు రిమాండ్ విధించింది. ఆయనపై ఆదివారం ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం విదితమే. ఈనేపథ్యంలో సోమవారం మార్కాపురం కోర్టులో ఆయన్ను పోలీసులు హాజరుపరిచారు. 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి 14రోజులు రిమాండ్ విధించారు. దీంతో ఆంజనేయరెడ్డిని ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించినట్లు ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు తెలిపారు.



ఒంగోలులో రైల్వే అండర్‌పాస్ కోసం ఇళ్ల ముందు మెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఇంటి మెట్లు తొలగించవద్దని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- మేడపైకి వెళ్లి కిందికి దూకుతానని బెదిరింపు
- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
- ఒంగోలులో ఘటన

6

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.27 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 4.49 (బుధవారం ఉదయం)

చీరాలలో జోరందుకున్న క్రికెట్ బెట్టింగ్

- అత్యాశకు లోనై.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న యువత
- రెండు నెలల్లో రూ. కోట్లల్లో పందేలు జరిగే అవకాశం!
- పోలీసులు దృష్టి సారించకుంటే ప్రమాదమే

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఊపందుకున్నాయి. దాదాపుగా రెండు మాసాలు ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లను కొందరు వినోదం కోసం చూస్తుంటే.. మరి కొందరు సులభంగా డబ్బు సంపాదించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈక్రమంలో క్రికెట్ మ్యాచ్‌లను వేదికగా మలుచుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అయితే అమాయకు ల ఆశలను ఆసరాగా చేసుకుని బుకీలు డబ్బులు దండుకుని సామాన్యులను మోసగిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే ఈ రెండు మాసాల్లో చీరాల నియోజకవర్గ పరిధిలోని బెట్టింగ్‌లు రూ.కోట్లలో చేరే అవకాశం ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. బెట్టింగ్ వ్యసనాలకు బానిసలుగా మారిన యువత, జూదరులు ఉన్న కాడకి ముట్ట చెప్పుకుంటున్నారు. హద్దు దాటాక వాహనాలు, స్థిరాస్తులు వంటివి సర్వస్వం వదిలేసుకుంటున్నారు. ఈక్రమంలో అప్పులు ఊబిలోకి చేరి ఐపీలు పెట్టడం, బలవన్మరణాలకు పాల్పడడం వంటి ఘటనలు మనం చూస్తున్నాం.

చాపకింద నీరులా..



రామాపురం రిసార్ట్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్, ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్

బెట్టింగ్‌లు ఒకప్పుడు చీరాల పట్టణంలో లేదా పేరాల, వేటపాలెం, జాండ్రపేట, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాలలోనే ఉన్నాయి. కానీ తాజాగా ఈ వ్యసనాలుకు గ్రామీణ యువకులు సైతం బానిసలుగా మారుతున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో మాత్రమే బెట్టింగ్‌లు జరిగేవి. ఇప్పుడు సెల్‌ఫోన్ ఉన్న యువత వాట్సాప్, బెట్టింగ్ యాప్ వంటి వాటికి చేరువయ్యారు. దీంతో బంతి బంతికీ పందేలు కడతారు. చీరాల పరిధిలోని రిసార్ట్స్, లాడ్జీలు, బార్‌లు, ఎంజీసీ మార్కెట్ పరిధిలోని కొందరు యువత, విద్యార్థులు, క్రికెట్ వీరాభిమానులు బెట్టింగ్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు వినిపిస్తుంది.

పాత, యాక్టివ్ పాత్రలపై దృష్టి సారించాలి

చీరాల పరిధిలో ఇప్పటికే జాండ్రపేటకు చెందిన ఓ వ్యక్తి అత్యున్నత స్థాయిలో బుకీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పేరాలలో మరో ఇద్దరు, వేటపాలెం, జవహర్‌నగర్, ఈపూరుపాలెం, గ్రామీణంలో అక్కడక్కడా యువత బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. ఈక్రమంలో పోలీసులు బెట్టింగ్‌పై కచ్చితంగా దృష్టి సారించాల్సిందే. అలాగే పాత, కొత్తగా ఫీల్డ్‌లోకి రంగ ప్రవేశం చేసిన వారిపైనా కన్నేయాలి. లేకుంటే ఎందరో జీవితాలు తారుమారయ్యే అవకాశం లేకపోలేదు. బుకీలకు పాల్పడే వారు ప్రత్యేకమైన ఫోన్ నెంబర్‌లను వాడుతున్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే అరగంట ముందు మాత్రమే ఆ నెంబర్‌ను వినియోగాస్తారు. మిగిలిన సమయమంతా ఆ నెంబర్ ఆఫ్‌లోనే ఉంటుంది. ఆన్ చేసిన సమయంలో గతంలో వారి వద్ద ఫీడ్ అయిన, వారి పాత పరిచయస్తుల నెంబర్‌లకు మాత్రమే ఆన్సర్ చేస్తారు. కొత్త నెంబర్‌లకు రెస్పాండ్ కాకుండా జాగ్రత్త పడతారు.

గతంలో అరకొర కేసులు



గతంలో చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జంజనం కాంప్లెక్స్‌లో యథేచ్ఛగా కొంతకాలం బెట్టింగ్ జరిగింది. దీంతో ఎట్టకేలకు పోలీసులు దాడులు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే టీవీతో పాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా చూసుకుంటే ఆ స్టేషన్ పరిధిలో 2016, 2021 సంవత్సరాల్లో వేటపాలెంలో 2021, 23లో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఇక చీరాల రూరల్, టూటౌన్ పరిధిలో కేసులే లేవు. ఈ మధ్య కాలంలో అసలు దాడులే చేయలేదు. దీంతో బెట్టింగ్ రాయుళ్లకు, బుకీలు పోలీసుల శైలిని అలుసుగా తీసుకొని వారి దందా కానిస్తున్నారు. ఏదేమైనా పోలీసులు ఈసారి క్రికెట్ బెట్టింగ్‌లపై కన్నెర్ర చేయకుంటే ఎన్నో దారుణాలు చూడాల్సి వస్తుంది.

ఆకస్మిక దాడులు

క్రికెట్ బెట్టింగ్‌లు జోరుకుందుంటున్న నేపథ్యంలో సోమవారం రాత్రి ట్రైనీ డీఎస్పీ అభిషేక్ ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్‌తో కలిసి రామాపురం, వాడరేవు తీరప్రాంతాల్లో లాడ్జిలు, రిసార్ట్స్‌లల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడి రికార్డులను పరిశీలించి, అనుమానితుల వివరాలను తెలుసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకులకు రూములు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్తి స్థాయిలో నిఘా



ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అలాగే కొన్ని నిర్దేశిత ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తంలో లావాదేవీల డేటాను సేకరిస్తున్నాం. నేరస్థులు తప్పించుకోలేరు. యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలి.

\- ఎండీ మొయిన్, డీఎస్పీ, చీరాల

అవీఇవీ

న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన



నిరసన తెలుపుతున్న మహిళతో మాట్లాడుతున్న పోలీసులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : న్యాయంచేయాలని కోరుతూ ఒక మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కలెక్టరేట్ వద్ద బైఠాయించి హల్‌చల్ చేశారు. కలెక్టరేట్ మెయిన్‌గేటు వద్ద సోమవారం కూర్చోవడంతో ఒంగోలు టుటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు అక్కడకు చేరుకొని ఆ మహిళ సమస్యను తెలుసుకొనే ప్రయత్నం చేశారు. తనకు న్యాయం జరిగేంత వరకు అక్కడి నుంచి కదిలేది లేదని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక కమ్మపాలెంకు చెందిన హర్షవర్థినికి జరుగుమల్లిమండలం కామేపల్లికి చెందిన చాంద్‌బాషాతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చాంద్‌బాష మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనకు అన్యాయం చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. కందుకూరు కోర్టు కొంతపరిహారం ఇప్పించింది. అయితే కొన్ని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో చాంద్‌బాషా తీసుకున్న రుణాలు తాను చెల్లించాలంటూ నోటీసులు పంపిస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నారని హర్షవర్థిని ఆరోపించారు. తనకు న్యాయంచేసి ఆదుకోవాలని విన్నవించారు. సీఐ శ్రీనివాసరావు ఆ మహిళతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి అక్కడినుంచి పంపించివేశారు.

అక్రమాలను సహించను : పీడీ నారాయణ

ఒంగోలు నగరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలకు రుణాలను మంజూరు చేయటంలో వారి నుంచి తిరిగి రుణాల రికవరీలో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే క్షమించబోనని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు టీటీడీసీ భవనంలో జరిగిన సీసీలు, వీవోఏలు, ఏపీఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీ నిధి రికవరీ, సీఐఎఫ్ రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రేడింగ్‌ను పెంచాలని ఆయన కోరారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పొదుపు సంఘాలు, గ్రామ సంఘాలు సమావేశాలు జరపాలని ఆయన అన్నారు. సంఘాల రికార్డుల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు.

అప్పుల బాధతో దంపతుల అదృశ్యం

కేసు నమోదు

అద్దంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో దంపతులు అదృశ్యంపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన ఆలకుంట వెంకటరావు, అంజలికి మూడు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. అంజలి 7 నెలల గర్భిణి. ఆదివారం అంజలి తల్లి వెళ్లి చూడగా ఇంట్లో భార్యభర్తలిద్దరూ లేరు. హాస్పటల్‌కు వెళ్లి ఉంటారని భావించారు. అయితే తిరిగి రాకపోవడంతో అద్దంకి, ఒంగోలు లలోని ఆసుపత్రులకు వెళ్లి వెతికారు. ఇంట్లోకి వెళ్లి చూడగా లెటర్ కనిపించింది. ఎక్కడెక్కడ ఎంత అప్పు ఉందో రాసి ఉంది. మమ్మలను వెతక వద్దు, మేము మీకు కనిపించమని రాసి ఉంది. అదే సమయంలో ఇంటిని అమ్మి బాకీలు చెల్లించాలని రాసి ఉంది. దీంతో ఆందోళనతో కుటుంబసభ్యులు వెతికారు. కనిపించకపోవడంతో అంజలి తండ్రి కుంచాల శ్రీనివాసరావు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

చిన్నగంజాం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు ఏడీజే కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. నిందితులకు శిక్ష పడడంలో సమర్థవంతంగా విధులు వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసులు తెలిపిన కేసువివరాల ప్రకారం, బాపట్ల జిల్లా, చిన్నగంజాం గ్రామంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీను తన భార్య కత్తి దుర్గను గత ఏడాది 07-06-2024న చెట్ల నరికే కత్తితో నరకంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో దుర్గ తన తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంటిలో తన బిడ్డలతో ఉంటుండగా భర్త ఇలాంటి చర్యకు పాల్పడ్డాడు. ఈఘటనపై దుర్గ తల్లి రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి అప్పటి ఎస్సై ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు విచారణ చేసి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రస్తుత ఇంకొల్లు సీఐ వై.రమణయ్య మిగిలిన దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుకు అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నిందితునిపై నేర నిరూపణ కావడంతో న్యాయాధికారి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.1600 జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు.

1న చంద్రబాబు.. 2న లోకేష్

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. అందుకోసం 4,900 ఎకరాల భూమి అవసరం ఉంది. అందులో తొలుత పీసీపల్లి మండలం దివాకరపురం సమీపంలో 475 ఎకరాలలో దీనిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. కాగా ఇరువురు కీలక నేతలు ఉమ్మడి జిల్లాకు వస్తుండటంతో స్థానిక శాసనసభ్యుల నేతృత్వంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యేలు

పెద్దగంజాంలో పేరుకు పించన్ల పంపిణీ, గ్రామస్థులతో ముఖాముఖి అయినప్పటికి ఎమ్మెల్యే ఏలూరి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు లోకేష్ వస్తున్న కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు వారంరోజులుగా ఉగ్ర సూచనలతో సంబంధిత శాఖల అధికారులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. కార్యక్రమం జరిగే ప్రాంతమంతా సరైన దారి లేకుండా బీడు భూములు కావడంతో యుద్ధ ప్రాతిపదికన రోడ్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాటు చేస్తున్నారు. బహిరంగ సభాప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాటు, కంప చెట్ల తొలగింపు ఇతరత్రా పనుల్లో పదుల సంఖ్యలో ఎక్స్‌కవేటర్లు, పెద్దసంఖ్యలో కూలీలతో పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సోమవారం దివాకరపురంలో పర్యటించి అక్కడ ఏర్పాట్లను స్థానిక అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు.

పది పరీక్షలపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

ఉంటుందన్నారు. పరీక్షల్లో ఎటువంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎటువంటి ఫుకార్లకు ఆస్కారం లేకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రశ్నపత్రాలకు సంబంధించి ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటివి జరగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల చీఫ్‌లు, డీవోలు నిజాయితీగా, నిబద్ధతతో విధులు నిర్వహిస్తే పరీక్షలు సజావుగా జరుగుతాయని తెలిపారు.

మూల్యాంకనం కేంద్రాన్ని సందర్శించిన పరిశీలకుడు

పరీక్షల రాష్ట్ర పరిశీలకులు సుబ్బారెడ్డి స్థానిక డీఆర్‌ఆర్ఎం హైస్కూలులోని మూల్యాంకనం కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న జవాబుపత్రాల బార్‌కోడింగ్‌ను పరిశీలించారు. గోప్యత పాటించాలని అక్కడి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు మూల్యాంకనానికి అవసరమైన తరగతి గదులను సుబ్బారెడ్డి పరిశీలించారు. డీఈవో, ఏసీలకు పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

ట్రెజరీకి వెళ్లాయి. అక్కడి వారి అకౌంట్లలో జమ అవుతున్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాదిన్నరలో ఉద్యోగ విరమణ చేసిన వారు వెయ్యి మందికిపైగా ఉండగా వందలాది మంది జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ బిల్లులు కూడా ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటన్నింటినీ ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక బకాయిల కోసం ఉద్యోగులు అనేక సార్లు రోడ్డెక్కినా పట్టించుకోలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో జీతాలు చెల్లింపుతోపాటు ఇప్పుడు ఆర్థిక బకాయిలు ఇస్తుండటంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పాము కాటుకు గురైన వృద్ధుడి మృతి

కొండపి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఒంగోలులోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని మూగచింతలకు చెందిన పోకూరి పేరయ్య (75) సోమవారం మృతి చెందాడు. ఈనెల 17వతేదీ పేరయ్య గ్రామానికి సమీపంలో తాటి ఆకులు కోసి చొక్కా తొడుక్కుంటుండగా కాలుపై పాము కాటేసింది. గమనించిన పేరయ్య తన పక్కన ఉన్న వారికి చెప్పడంతో ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు రిమ్స్ నుంచి పోలీసులకు సమాచారం అందింది.

500కు పైగా పాములను పట్టి..

మూగచింతల గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు పేరయ్య ఏరకం పామునైనా ఇట్టే పట్టగల నేర్పరి. గ్రామంలోని ఇళ్లు, పొలాల్లో పాములు కనిపిస్తే గ్రామస్థులు వెంటనే పేరయ్యకు సమాచారం ఇస్తారు. ఆయన ధైర్యంగా పామును పట్టుకొని దూరంగా తీసుకెళ్లి వదిలిపెట్టేవాడు. ఇలా సుమారు 500కుపైగా సర్పాలను పట్టుకున్న పేరయ్య పాముకాటుతోనే మృతి చెందడం విషాదకరం.

ఇంటి మెట్లు తొలగించవద్దని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆక్రమణల తొలగింపు నిరసిస్తూ మిద్దె మీదకు ఎక్కిన యువకుడు(వృత్తంలో)

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగర అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక అగ్రహారం రైల్వే గేటు వద్ద జరుగుతున్న అండర్‌పాస్ బ్రిడ్జి పనులు కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆ సమీపంలోని ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో ఓ ఇంటి మెట్లు తొలగించడాన్ని ఇంటి యజమాని శ్రీకాంత్ అడ్డుకున్నారు. తమ ఇంటి ముందు ఆక్రమణలు తొలగించవద్దంటూ నానా హడావుడి చేయడంతో కొంత గందరగోళ పరిస్థితికి దారి తీసింది. కాగా అధికారులు ఆక్రమణ పనులు చేపడుతుండగా ఇంటి యజమాని మేడపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడటంతో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు సమాచారాన్ని టుటౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. దాంతో పోలీసులు ఆందోళన చేసిన శ్రీకాంత్‌ను కిందకు దింపి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

వడ్డీలేని రుణాలతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే కొండయ్య
- పొదుపు సంఘాలకు రూ.20లక్షల చెక్కుల అందజేత



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన వెలుగు అధికారులు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలో అందించే వడ్డీలేని రుణాలను అందింపుచ్చుకుని ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకం ద్వారా నియోజకవర్గంలో ని 12 మంది స్వయం సహాయక సభ్యులకు రూ.20లక్షలు ఎస్సీ కార్పొరేషన్ వడ్డీలేని చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశా రు. ఈసందర్భంగా మాట్లాడుతూ పొదు పు సంఘాల ద్వారా అందించే రుణాలతో జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుని సంతోషంగా జీవించాలని కోరారు. అలాగే పొదుపు సంఘాల మహిళలకు రుణాలు కల్పించి సహకరించాలని సూ చించారు. కార్యక్రమంలో ఏసీ సుబ్బారావు, ఫణి, వెలుగు ఏపీఎంలు మధు, అంజిబాబు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

వేటపాలెం కాంగ్రెస్ పార్టీకు చెందిన 20 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లప్రోలు శ్రీను, కొత్త నాగు ఆధ్వర్యంలో చేరిన ప్రతినిధులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొండయ్య వారికి సూచించారు.

అన్యాక్రాంతాలపై చర్యలు తీసుకోండి

మునిసిపల్ పరిధిలోని 31,32,33 వార్డుల్లో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారని, 31వ వార్డు కౌన్సిలర్ సల్లూరి సత్యానందం ఎమ్మెల్యే కొండయ్యకు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి వార్డుల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రికవరీ చేసిన వాటిల్లో నిరుపేదలకు స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యేను కౌన్సిలర్ కోరారు.

క్రమం తప్పని ఔషధాలతోనే క్షయ నిర్మూలన



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. టీబీ అధికారి డాక్టర్ బెజవాడ శ్రీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు మీదుగా జీజీహెచ్ వరకు నిర్వహించారు. అనంతరం అక్కడి లెక్చర్ జెలరీ సమావేశపు హాలులో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళ్లె పరీక్ష ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులు తీసుకోవడం ద్వారా వ్యాధిని నివారించేందుకు సాధ్యమవుతుందన్నారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. టీబీ అధికారి డాక్టర్ బెజవాడ శ్రీవాణి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జనరల్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున మాట్లాడుతూ టీబీ రోగులకు వచ్చే సైడ్ ఎఫెక్ట్ వివరించారు. ఈకార్యక్రమంలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, డాక్టర్ మాధవిలత, డాక్టర్ రంజిత్‌బాషా, డాక్టర్ నళిని, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ పద్మజ, డాక్టర్ నిఖిల్, ఆస్టర్ రమేష్ హాస్పటల్ పల్మ లాలజిస్ట్ డాక్టర్ జహంగీర్ సుల్తాన్, అరవింద హాస్పటల్ డాక్టర్ భానుతేజ, డీపీఎం కిరణ్ ఉన్నారు.

ఎయిడెడ్ నియామకాలకు 28,29 తేదీల్లో కంప్యూటర్ పరీక్ష

ఒంగోలు విద్య, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులభర్తీకి ఈనెల 28,29 తేదీల్లో ఆన్‌లైన్ మోడ్‌లో కంప్యూటర్ పరీక్ష జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ఏబీఎం హైస్కూలులో తెలుగు, హిందీ ఒక్కొక్క గ్రేడ్-1 పోస్టులు, ఒకపీఈటీ పోస్టుకు, పంగులూరు మండలం ముప్పవరం పీఎస్ ఎస్‌సీసీ హైస్కూలులో తెలుగు, గణితం, సైన్స్ స్కూలు అసిస్టెంట్లు ఒక్కొక్క పోస్టుకు, చీరాల ఎంఎస్ హైస్కూలులో సోషల్ స్టడీస్, గణితం స్కూలు అసిస్టెంట్ ఒక్కొక్కటి, తెలుగు బాషా పండితులు ఒక పోస్టు భర్తీ చేసేందుకు ఈ కంప్యూటర్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తుచేసిన అభ్యర్థులు సీఎస్ఈ వెబ్‌సైట్‌నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పాఠశాల యజమాన్యానికి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారు తమ వద్ద ఉన్న ఆధారాన్ని డీఈవోకు చూపితే హాల్ టిక్కెట్ జారీ చేస్తారని తెలిపారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

సమస్యలు ప్రస్తావించిన కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం సోమవారం చైర్మన్ చిల్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి చెందిన అంత్య నిల్వ రూ.11,50,26,003లతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయం రూ.33,76,66,400లతో మొత్తంగా రూ.45,26,92,4003తో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంత్యనిల్వగా రూ.16,81,35,143లను చూపారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. బడ్జెట్ సరే పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. సాగర్ నీటి సరఫరా సరిగా లేదన్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మరో కౌన్సెలర్ దొడ్డా భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ.. తన వార్డులో నూతన సాగర్ పైప్‌లైన్‌ల నిర్మాణం చేపట్టి కనెక్షన్లు ఇచ్చినా పైప్‌లైన్‌లకు నీటిని విడుదల చేయాలన్నారు. కౌన్సిలర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ.. పాత బస్టాండ్‌లోని గాంధీపార్కు పర్యవేక్షణ లేక అధ్వాన్నంగా మారిందన్నారు. పార్కు మొత్తాన్ని బంకులకు కేటాయించి చెట్లను నరికివేశారన్నారు. కనీసం గాంధీ విగ్రహాన్ని అయినా కాపాడుకుంటారా..? అని ప్రశ్నించారు. తన సొంత నిధులతో గాంధీ పార్కు ఇప్పటి వరకు నిర్వహించామని, ఇకపై ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటు న్నామన్నారు. మరో కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ..కొత్తగా కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు ఇంతవరకు కనిపించడం లేదని, వీటిని ఎవరు ఎత్తుకెళ్లారని, దీనిపై చేపట్టిన విచారణ ఏమైందని ప్రశ్నించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, షాదీ ఖానా పూర్తి చేయాలని, చెత్త తరలించే వాహనాలు మరమ్మతులు చేయించాలని, సాగర్ జలాలు సక్రమంగా సరఫరా చేయాలని, పారిశుధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని కౌన్సిలర్లు కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ శ్రీనివాసన్, డీఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరంజీవులు..!

- వారిద్దరూ సామాన్యులైనా నిస్వార్థ సేవకులు
- అద్దంకిలో పచ్చదనానికి మూలపురుషులు
- శ్మశానాలు, రోడ్ల వెంబడి అలుముకున్న పచ్చదనం
- పేదల కడుపు నింపడంలోనూ కృషి
- నేత్రదానాలు చేయించడంలోనూ సఫలీకృతులు
- భౌతికంగా లేకున్నా పట్టణ ప్రజల మదిలో నిత్య చిరస్మరణీయులు


అద్దంకి పట్టణం లోని కొత్తపేటలో రోడ్డువెంబడి నాటిన మొక్కలు

అద్దంకి, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : భౌతికంగా వారు లేరు.. కానీ వారు నిత్యచిరస్మరణీయులుగా మిగిలిపోయారు.. వారు కాలం చేసినప్పటికీ వారు చేసిన సేవలు ప్రజల హృదయాలకు అనునిత్యం జ్ఞప్తికితెస్తున్నాయి.. అద్దంకి పట్టణంలో ఏ చల్లని చెట్టు కింద సేదదీరినా ఆ ఇద్దరి పేర్లు జపించాల్సిందే. వారే కాశయ్య, జ్యోతయ్యలు..! వారి ఆలోచనలు ఒకటే కావడంతో ఇద్దరూ ప్రజాసేవలో మునిగిపోయారు. అద్దంకి పట్టణం పాత బస్టాండ్ సెంటర్‌లో టీ దుకాణం నిర్వహించిన చల్లా కాశయ్య ఈ ప్రాంత ప్రజలకు టీకొట్టు కాశయ్యగా సుపరిచితులు. ఇక మిలటరీలో రిటైర్డ్ అయి, అనంతరం ఎస్‌బీఐ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసిన పంతంగి జ్యోతయ్య పేదలకు ఆకలి తీర్చే అన్నపూర్ణగా గుర్తింపు పొందారు.

'అద్దంకి'కి కొత్త అర్థాన్ని చెప్పిన ఘనులు

మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు అద్దంకి పట్టణంలో ఎలాంటి మొక్కలు బతకవు అనే నానుడి ప్రబలంగా ఉండేది. అంటే నేల అంత సారవంతమైంది కాదని అర్థం. అదేసమయంలో కుటుంబసభ్యులు ఎవరైనా చనిపోతే గుండ్లకమ్మ నది సమీపంలో ఖర్మకాండలు నిర్వహించుకునే సమయంలో చెట్ల నీడ లేక.. మండుటెం డలో రెండుకాళ్ల మీద నిల్చుని ఉండాల్సి వచ్చేది. ఇక శుభకార్యాలు, పండుగల సమయంలో ఇళ్ల ద్వారాలకు తోరణాలు కట్టుకోవాలన్నా ఆకులు ఎక్కడా దొరికేవి కావు.. వాటి కోసం సమీప గ్రామాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి. ఈ ఉదంతాలు ఆ ఇద్దరినీ కలిచివేశాయి.


జ్యోతయ్య(ఫైల్) కాశయ్య(ఫైల్)

మొక్కలునాటి.. నీళ్లుపోసి..

మూడు దశాబ్దాల క్రితం మొక్కలు నాటి సంరక్షణ చేసేందుకు కాశయ్య, జ్యోతయ్యలు నడుం బిగించారు. అప్పట్లో మొక్కలు నాటడంతో పాటు వాటి రక్షణకు చుట్టూ చిల్లకంప వేయాల్సి ఉండేది. అంతేగాక దూరం నుంచి నీరు తీసుకొచ్చి వాటిని కష్టపడి పెంచారు. ఇలా ఎన్నో ఇబ్బందులు పడి మొక్కలు పెంచారు. దశాబ్దకాలం తరవాత వారి కృషికి తగ్గ ఫలితం కనిపించింది. ఆ మొక్కలన్నీ చెట్లుగా ఎదిగి చల్లని నీడను ఇచ్చాయి. ఆ స్ఫూర్తితో వారిద్దరూ ఉద్యమంలా మొక్కలు నాటటం ప్రారంభించారు. ప్రధానంగా నర్రావారిపాలెం శ్మశానం, ఉత్తర అద్దంకి శ్మశానం, ముస్లిం శ్మశాన వాటికలతో పాటు పట్టణంలోని పలు రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వారు చూపిన బాటలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా నడిచాయి. అప్పట్లో ఆ ఇద్దరూ నాటిన మొక్కలే నేడు మహావృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. ఏ చెట్టును చూసినా పట్టణ ప్రజలకు ఆ ఇద్దరే గుర్తుకు వస్తారంటే అతిశయోక్తి కాదు.


ఆరామ క్షేత్రంలో నాటిన మొక్కలు

పేదల అన్నం గిన్నె జ్యోతయ్య

చెట్లునాటడం, గుంతలు పూడ్చడమేగాకుండా నేత్రదానాలు చేయించేందుకు కూడా వారు తమ వంతు సహకారం అందించారు. అంతేగాక జ్యోతయ్య పేదల పాలిట అన్నపూర్ణగా నిలిచారు. పట్టణంలో ఎక్కడైనా శుభకార్యాలు జరిగిన సమయంలో భోజనాలు, ఇతర వంటకాలు పెద్ద ఎత్తున మిగిలిపోయేవి. ఆకలితో అలమటిస్తూ పస్తులు ఉండే ప్రజలు కూడా అద్దంకి పట్టణంలో ఎందరో ఉండే వారు. ఆకలితో ఉండే వాళ్ల ఆకలి తీర్చేందుకు, వృథాగా పోయే భోజనాన్ని పేదలకు అందించేందుకు అర్ధరాత్రి సమయంలో కూడా వెనుకడుగు వేసింది లేదు. అన్నిరకాల భోజన పదార్థాలను తీసుకెళ్లేందుకు కూడా ప్రత్యేక వాహనాన్ని సమకూర్చుకున్నారు. ఆ వాహనంలో మిగిలిపోయిన భోజనాలను తీసుకొని అద్దంకి పట్టణంలో పేదలు నివశించే కాలనీలు, ఆర్టీసీ బస్టాండ్, ఇటుక బట్టీల వద్దకు వెళ్లి పంపిణీ చేసి ఆకలితో ఉన్న వాళ్ల కడుపులు నింపారు. జ్యోతయ్య వచ్చాడంటే పండుగగా కడుపు నిండా తినేవారు. ఇలా ఆ ఇద్దరు ఊరికి ఉపకారులుగా మారారు. అద్దంకి ప్రజల మదిలో చిరస్మరణీయులుగా మిగిలారు.


భోజనం పెడుతున్న జ్యోతయ్య(ఫైల్)

వారిద్దరూ చనిపోయినా...

కాశయ్య 2023 ఆగస్టు 29న.. జ్యోతయ్య ఈ ఏడాది ఫిబ్రవరి 3న మృతి చెందినా అద్దంకి పట్టణ ప్రజల మదిలో మాత్రం వారిద్దరూ చిరస్మరణీయంగా ఉన్నారు. ఇక మొక్కలు నాటడంతో ఆగకుండా అప్పట్లో అద్దంకి పట్టణంలో పెద్దగా సీసీ రోడ్లులో లేకపోవటంతో ఎక్కడ చిన్నపాటి గుంత కనిపించినా పార, తట్ట చేత బట్టి పూడ్చేవారు.

ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో కారు, బైక్ స్కీం డ్రాలో కన్సొలేషన్ బహుమతుల విజేతలు

1.గుంటుపల్లి రంగనాయకులు, ముండ్లమూరు 2.ఎన్.వంశీ, దర్శి 3.సయ్యద్ ఖాశింవలి, తర్లుపాడు 4.పరుచూరి కేదారేశ్వర్, గిద్దలూరు 5.ఎన్.క్రిష్ణ, కంభం 6.ఎ.రామలింగాచారి, పాపినేనిపల్లి 7.సంగోజి వెంకట శ్యామల, తాళ్ళూరు 8.గుంటి చిరంజీవి, బేస్తవారిపేట 9.కె.దీత్యారెడ్డి, గిద్దలూరు 10.అత్తి క్రిష్ణ, దోర్నాల 11.సాదు వెంకటేశ్వర్లు, త్రిపురాంతకం 12.కోమటిగుంట్ల జగన్‌మోహన్‌రావు, పొదిలి 13.చీతిరాల శేఖర్, మార్కాపురం 14.పరుచూరి శ్రీకాంత్, మార్కాపురం 15.తిరుమలశెట్టి రాజేంద్రకుమార్, మార్కాపురం 16.బి.శ్రీదేవి, ఒంగోలు 17.యడవల్లి వీరనారాయణ, నరసాయపాలెం, వై.పాలెం(మం) 18.మాగులూరి వెంకటేశ్వర్లు, వై.పాలెం 19.కదం వెంకటేశ్వర్లు, కొమరోలు 20.యువి.కోటేశ్వరరావు, పుల్లలచెరువు 21.జంపాల అంజమ్మ, మల్కాపురం, తాళ్ళూరు(మం) 22.వగులూరి సత్యనారాయణ, మారెళ్ళ, ముండ్లమూరు(మం) 23.ఎన్.శైలజ, బేస్తవారిపేట 24.కెవియస్.మల్లేశ్వరరావు, పొదిలి 25.కనమర్లపూడి శేషగిరిరావు, కంభం 26.షేక్ హుస్సేన్‌బీ, గిద్దలూరు 27.యం.లక్ష్మీనారాయణ, తోకపల్లి, పెదారవీడు(మం) 28.పోకల వెంకటరత్నం, దర్శి 29.కాకర్ల నాగరాజు, దర్శి 30.గొట్టిపాటి విజయ ప్రభాకరరావు, ఆవులమంద, కురిచేడు(మం) 31.పాముల పాటి నరసయ్య, సి.యస్.పురం 32.కొంగలేటి విల్సన్, దొనకొండ 33.గుదే రేణుక, కనిగిరి 34.టి.షమ్మీ, కనిగిరి 35.సయ్యద్ కరిముల్లా, పామూరు 36.పి.సబురుల్లా ఖాన్, దొనకొండ 37.దొరశీల సుబ్బారెడ్డి, పామూరు 38.కొడవటికంటి దావీదు, గుంటుపల్లి, పి.సి.పల్లి(మం) 39.బొప్పుడి వెంకటరాయుడు, కొండమంజులూరు 40.అచ్చుల విజయశ్రీ, చిలకలూరిపేట 41.షేక్ బాబుసాహెబ్. ఏల్చూరు, సంతమాగులూరు(మం) 42.చుంద్రు శ్రీరమణి, కారంచేడు 43.అత్మకూరి బాలక్రిష్ణ, కొమ్మనేనివారిపాలెం, బల్లికురవ(మం) 44.పల్లపోలు ఉమావరప్రసాద్ రెడ్డి, పావులూరు, ఇంకొల్లు(మం) 45.కామిశెట్టి శంకరరావు, ఉప్పుగుండూరు 46.టి.మాధవి, ఈపురుపాలెం 47.బండారు మణీంద్రరావు, మేదరమెట్ల 48.లక్కాకుల గోపిక్రిష్ణ, చినగంజాం 49.బి.చైతన్యకిరణ్, పేరాల 50.ఇంటూరి ఆంజనేయులు, మార్టూరు 51.గద్దె ఏసుదయమ్మ, ద్రోణాదుల, మార్టూరు(మం) 52.పెండెల సుబ్బారావు, ఈస్ట్ గంగవరం 53.బి.రవితేజ, వేటపాలెం 54.ధూళిపాళ్ళ వెంకటసుబ్బారావు, ముప్పవరం, పంగులూరు(మం) 55.కోనగండ్ల సాంబశివరావు, పర్చూరు 56.కొత్త నాగలక్ష్మీ, ఇనగల్లు, పర్చూరు(మం) 57.జాగర్లమూడి సుబ్బారావు, కొణికి, ఇంకొల్లు(మం) 58.ఆరె నాగేంద్రమ్మ, ఇంకొల్లు 59.ధూళిపాళ్ళ శేషగిరి, కొత్తపాలెం, బల్లికురవ(మం) 60.కదుళ్ల ఉదయ్ చరణ్, రావినూతల 61.నల్లాని నిధి, కొత్తపేట, వేటపాలెం(మం) 62.గింజల మల్లికాంబ, జాండ్రపేట, చీరాల(మం) 63.లింగాల రాఘవేంద్రరావు, వీరన్నపాలెం, పర్చూరు(మం) 64.చిన్నం వెంకటనారాయణ, వలపర్ల, మార్టూరు(మం) 65.తాళ్లూరి మాల్యాద్రి, కందుకూరు 66.పొనుగుమాటి నాగేంద్రమ్మ, కొణిజేడు, టంగుటూరు(మం) 67.కొల్లూరి రామానాయుడు, కందుకూరు 68.వెలిచెర్ల బాలకోటయ్య, ఉలవపాడు 69.మైనేని రాము, కొప్పోలు 70.ఎస్.కె.కరీం, పల్లామల్లి, చీమకుర్తి(మం.) 71.తలారి రెజీనా, కరవది 72.తాటి రమణారావు, చీమకుర్తి 73.ఎన్.కరుణ, మద్దిపాడు 74.ఎన్.ఆదిలక్ష్మీ, మన్నంవారిపాలెం, సంతనూతలపాడు(మం) 75.యర్రగుంట్ల అనూరాధ, మద్దులూరు 76.మంగళగిరి రవికిరణ్, ఏడుగుండ్లపాడు, మద్దిపాడు(మం) 77.కటకం వెంకటేశ్వర్లు, ముప్పవరం, కొండేపి(మం) 78.చుండి శైలజ, ఈతముక్కల 79.నూకల శ్రీనివాసరావు, చీమకుర్తి 80.ఉలిచి వెంకట క్రిష్ణా రెడ్డి, పాకల, శింగరాయకొండ(మం) 81.బండి తిరుపతిస్వామి, కె.ఉప్పలపాడు, కొండేపి(మం) 82.గద్దల విజయ్, మైనంపాడు 83. వరికూటి నాగ ఆకాష్, త్రోవగుంట 84. తలగడదీవి బసవపూర్ణయ్య, కొండేపి 85. భీమవరపు రామమూర్తి, పాలేటిపాడు, జరుగుమల్లి(మం) 86. పేరవరపు వెంకటేశ్వర్లు, సీతారామపురం, మద్దిపాడు(మం) 87.పూనాటి వెంకటరావు, పొందూరు, టంగుటూరు(మం) 88.గోనుగుంట సుబ్బారావు, కొత్తపట్నం 89.తాళ్ళూరు వెంకటేశ్వర్లు, ఉప్పుగుండూరు 90.కొల్లూరు మదన్‌మోహన్ బోస్, శింగరాయకొండ 91. చెల్లి అజయ్‌బాబు, మద్దిరాలపాడు 92.శనగల రాఘవరావు, వల్లూరు, టంగుటూరు(మం) 93.కందిమళ్ళ కోటేశ్వరి, టంగుటూరు 94.ఘట్టమనేని బసవయ్య వినోదరాయనిపాలెం, నాగులుప్పలపాడు(మం) 95.ఎ.సుమతి, ఒంగోలు 96.దేసు అయ్యప్ప, ఒంగోలు 97.పెనుమాక నాగమణి, ఒంగోలు 98.కొమ్ము మనోజ్‌కుమార్, ఒంగోలు 99.తన్నీరు అశోక్, ఒంగోలు 100.జలదంకి జగదీష్ బాబు, ఒంగోలు.

పాఠకుల పండుగ

- భారీగా బహుమతుల గెలుపు
- ఒంగోలు ఆంధ్రజ్యోతి కార్యాలయంలో కారు, బైక్ రేస్ స్కీం డ్రా నిర్వహణ
- ముఖ్యఅతిథులుగా హాజరైన కార్పొరేషన్ కమిషనర్, డ్వామా పీడీ, ఒంగోలు డీఎస్పీ
- ఉత్సాహంగా సాగిన కార్యక్రమం
- అద్దంకి వాసికి ప్రథమ, ఒంగోలు వాసికి ద్వితీయం
- అద్దంకికే చెందిన మహిళకు తృతీయ బహుమతి
- వంద మందికి కన్సొలేషన్


రెండో బహుమతి డ్రాను తీస్తున్న మెప్మా పీడీ జోసఫ్‌కుమార్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రజల పక్షాన అక్షర సమరం సాగించడంలోనూ... పాఠకులను గౌరవించడంలోనూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యావత్తు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిందని పలువురు వక్తలు కొనియాడారు. ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి నిలిచిందని కొనియాడారు. ఆంధ్రజ్యోతి పునఃప్రారంభమై 22 వసంతాలు నిండిన సందర్భంగా కారు, బైక్ రేస్ పేరుతో స్కీం డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం త్రోవగుంట వద్ద ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని డ్రా తీశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వేలాది మంది పాఠకుల నుంచి వచ్చిన కూపన్లను డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సిబ్బంది అందుబాటులో ఉండి హాజరైన పాఠకుల సమక్షంలో డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా గడిచిన 22 ఏళ్లలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన పాత్ర ఘనమైందని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎక్కువగా కథనాలు ఉంటాయని, తద్వారా ప్రభుత్వం తరఫున పరిష్కారం కావడానికి దోహదపడతాయని కొనియాడారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ సందేశాత్మక కథనాలతో ప్రజలను చైతన్యవంతం చేయడంలో ఆంధ్రజ్యోతి పోషించిన పాత్ర యావత్తు ప్రజల ప్రశంసలు అందుకుందని వ్యాఖ్యానించారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మా అక్షరమే మీ ఆయుధం అంటూ అన్ని రకాలుగా బాధిత ప్రజలకు అండగా నిలిచిన ఆంధ్రజ్యోతి పాత్ర విస్మరించలేనిదన్నారు. నిర్భయంగా, నిష్పక్షపాత కథనాలకు ఆంధ్రజ్యోతి పెట్టింది పేరని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు కూడా ఆ కథనాలు దోహదపడ్డాయని చెప్పారు. ప్రత్యేకించి పాఠకులను గౌరవిస్తూ వారికి చక్కటి బహుమతులను అందజేసే కార్యక్రమం నిర్వహించడం పట్ల ముగ్గురు అతిథులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, యూనిట్ పరిధిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి మొదటి విజేతకు మోటార్‌సైకిల్, రెండో విజేతకు ఫ్రిజ్, మూడో విజేతకు ఎల్ఈడీ టీవీని ఇవ్వడంతోపాటు వందమంది విజేతలకు గృహోపకరణాలను ఇవ్వనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు వారికి వివరించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశంలోని పాఠకులకు సంబంధించి మెగా డ్రా తీసి విజేతకు ఒక కారును, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మెగా డ్రాలో ఆ రాష్ట్ర విజేతకు మరో కారు ఇవ్వనున్నట్లు చెప్పారు. త్వరలో మెగా డ్రాలను హైదరాబాద్, విజయవాడలో నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు మెగా డ్రా అనంతరం బహుమతులు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ సుబ్బారావుతోపాటు ఎడిషన్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాసులు, స్టాఫ్ రిపోర్టర్ కోనూరి శ్రీనివాసరావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, టెక్నికల్ ఇన్‌చార్జి రామకోటేశ్వరరావు, యాడ్స్ విభాగం ఇన్‌చార్జి గోపికృష్ణ, రిపోర్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మొదటి విజేతకు తీసిన డ్రాను కమిషనర్ వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఆ డ్రాలో అద్దంకికి చెందిన పుష్పగిరి ఆంజనేయులు విజేతగా నిలిచి మోటార్‌సైకిల్‌ను దక్కించుకున్నారు. రెండో బహుమతి విజేత డ్రాను పీడీ జోసఫ్‌కుమార్ తీయగా, ఒంగోలులోని గద్దలగుంటకు చెందిన కే సుబ్రమణ్యంకు అవకాశం దక్కింది. మూడో బహుమతి విజేత డ్రాను డీఎస్పీ శ్రీనివాసరావు తీయగా, అద్దంకికి చెందిన కరేటి భవ్య (ఒంగోలు ఇరిగేషన్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్నారు) దక్కించుకున్నారు. విజేతలకు అధికారులే నేరుగా ఫోన్ చేసి సమాచారాన్ని అందించారు.


మూడో బహుమతి డ్రా తీస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

20ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకులం

పుష్పగిరి ఆంజనేయులు, విద్యుత్ లైన్‌మన్, అద్దంకి

1 వ బహుమతి బైక్ విజేత



ఆంధ్రజ్యోతి పత్రికను గత 20 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా చదువుతున్నాం. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా వార్తలు, ప్రత్యేక కథనాలు ఉంటాయి. నిష్పక్షపాతంగా వార్తలు ఉంటాయి. ప్రథమ బహుమతి వచ్చిందని తెలిసి కుటుంబమంతా ఎంతో ఆనందంలో మునిగిపోయాం. నేను ముండ్లమూరు మండలం మారెళ్లలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాను. అద్దంకి పట్టణంలోని బ్రహ్మానందం కాలనీ రోడ్డులో నివాసం ఉంటున్నాం.

ఉద్యోగ సమాచారం బాగుంటుంది

కండ్లగుంట సుబ్రమణ్యం, ఎంసీఏ, గద్దలగుంట ఒంగోలు

2 వ బహుమతి బైక్ విజేత




ఎంసీఏ చదువుకుని ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ఒకటిన్నరేళ్లుగా ఆంధ్రజ్యోతిని రెగ్యులర్‌గా చదువుతాను. ఉద్యోగ సమాచారం చాలా బాగుంటుంది. రాష్ట్ర సమాచారంతోపాటు, జిల్లా కథనాలు ఆసక్తికరంగా ఉంటాయి. అనవసరమైనవి, ప్రజలకు సంబంధం లేని వార్తలు కనిపించవు. ఎక్కువగా ప్రజాసమస్యలపైనే. రాజకీయ వార్తలు నిజాయితీగా ఉంటున్నాయి. అందరు ఆంధ్రజ్యోతి టీడీపీ అనే ప్రచారం ఉంది. కానీ నా దృష్టిలో పార్టీలతో సంబంధం లేకుండా ఉంటుందని నా అభిప్రాయం. మొన్న కందుకూరులో అధికారపార్టీ ఎమ్మెల్యేపైనా, నిన్న, మొన్న ఢిల్లీలో న్యాయమూర్తి ఇంటిలో నోట్ల కట్టలు కథనాలు, టీడీపీ ఎమ్మెల్యేల అవినీతిపైన కూడా వార్తలు బాగుంటున్నాయి. ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్‌లో నేను రెండవ బహుమతి సాధించడం సంతోషంగా ఉంది. సరదాగా కూపన్లు కట్ చేసి పంపించాను. కానీ విజేతగా నిలుస్తానని ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది.

కొత్తపలుకు నచ్చి ఆంధ్రజ్యోతి పాఠకులయ్యాం

కరేటి భవ్య ఏఈ, ఇరిగేషన్, ఒంగోలు

3వ బహుమతి ఎల్ఈడీ టీవీ విజేత



ఆంధ్రజ్యోతి దినపత్రికను రెండున్నరేళ్లుగా చదువుతున్నాను. ప్రతిరోజు ఆసక్తికరమైన కథనాలు, ప్రత్యేకించి, ఆదివారం ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ గారి కొత్తపలుకు, ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే చాలా నచ్చుతుంది. అంతేకాకుండా వారం వారం మహిళల సక్సెస్ స్టోరీలు, ఆరోగ్యం వంటి కథనాలు ఆసక్తికరంగా ఉంటాయి. జిల్లాల విభజన జరిగినప్పటికీ కేవలం వార్తలు ప్రకాశం జిల్లాకే పరిమితం కాకుండా బాపట్లవి రావడం సంతోషంగా ఉంటుంది. పేపర్ చదువుతున్నప్పుడు జిల్లా విడిపోయిందన్న భావన ఉండదు. అప్పుడు సంతోషంగా ఉంటుంది. అలాగే జిల్లాకు సంబంధించిన పొలిటికల్ వార్తలు నాన్న బాగా చదువుతుంటారు. వాస్తవంగా ఉంటాయని ఉంటారు. అందుకే ఆంధ్రజ్యోతి పాఠకులం అయ్యాము. కొన్ని వేలమంది పాల్గొన్న కార్ అండ్ బైక్ రేసులో నేను 3వ బహుమతి గెలుచుకోవడం సంతోషంగా ఉంది. అసలు ఊహించలేదు. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులు కావద్దు

- ఒంగోలు తాలుకా సీఐ

ఒంగోలు క్రైం,మార్చి23(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం పలుప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పేర్నమిట్ట , అరవై అడుగుల రోడ్డు, మంగమూరు రోడ్డులలో పలు షాపింగ్ మాల్స్‌లో సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లలో ఎవరూ పెట్టుబడులు పెట్టవద్దని అన్నారు. తొలుత కొంత గెలిచినట్లు ఎర వేస్తారని , తరువాత అప్పులు చేసే విధంగా తయారు చేస్తారని చెప్పారు. ఇలాంటి బెట్టింగ్‌లు ఎవరైయినా వేస్తున్నా, లేక ఎక్కడైనా ప్రచారం చేసినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇందుకు సంబంధించి సమాచారం ఉంటే 1930 నంబరుకు ఇవ్వాలని కోరారు. బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు.

భూమిని ఆక్రమించుకునేందుకు కుట్రలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలో ఒక కాలేజీకి అనుకొని ఉన్న మాదిగ కులస్థుడికి చెందిన భూమిని ఆక్రమించుకొనేందుకు కుట్రపన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో పలువురు మాట్లాడుతూ 1992లో ప్రభుత్వం డీకే పట్టా ఇచ్చిందన్నారు. ఆ పట్టాలో సమాధి ఉన్నా దానిని తొలగించి ఆక్రమించుకొనేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమికి సంబంధించి ఫోర్జరీ కాగితాలు కూడా సృష్టించారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సుధాకరరావు, పిన్నిక శ్రీనివాస్, పేరం సత్యం, అంజనేయులు, బి.సుబ్బారావు, ధరణికోట లక్ష్మీనారాయణ, మస్తాన్‌రావు ఉన్నారు.

అవీ..ఇవీ



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొండపి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పెరట్లోనే తక్కువ ఖర్చుతో కూరగాయలు పండించే విధానాన్ని ఏపీఎం గోపీనాథ్ వివరించారు. ఏవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎంటీ ఎస్తేరు మాట్లాడుతూ రైతులు పొలంలో తప్పనిసరిగా నవధాన్యాలను చల్లుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కట్టావారిపాలెం గ్రామ రైతు ఆరికట్ల రాఘవులు, పెరిదేపి గ్రామానికి చెందిన రైతు అంగలకుర్తి ముసలయ్యలను సన్మానించారు. ప్రాజెక్ట్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఝాన్సీ, యూనిట్ ఇన్‌చార్జిలు మందాకిని, మాధవ, రంజిత్, ఐసీఆర్పీలు మాలకొండయ్య, జ్యోత్స్న నాగరాజు పాల్గొన్నారు.



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ఈశ్వరయ్య

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో మే 15 నుంచి 18వతేదీ వరకు జరగనున్న అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో నాలుగు రోజుల పాటు జాతీయమహాసభలు జరుగుతాయని, మొదటి రోజుదేశ నలుమూలల నుంచి వేలాది మంది ఏఐవైఎఫ్ కార్యకర్యకర్తలతో ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్ని రాష్ట్రాలనుంచి వెయ్యిమంది ప్రతినిధులు మహాసభలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరుణానిధి, ప్రభాకర్, రాంబాబు, గులాం, నాగరాజు, సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రామాంజి తదితరులు ఉన్నారు.

వెంకట కృష్ణారావుకు నివాళి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కాపు కమ్యూనిటీ హాలు, పేద విద్యార్థుల వసతిగృహం వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ గాదె వెంకటశివయ్యనాయుడు కుమారుడు గాదె వెంకట కృష్ణారావుకు పలువురు నివాళులు అర్పించారు. స్థానిక పద్మావతి ఫంక్షన్‌హాలులో సోమవారం పేద విద్యార్థుల వసతిగృహం సభ్యుల ఆధ్వర్యంలో పెద్దకర్మ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. ముందుగా గాదె వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిలరాల సంజీవకుమార్, అయినాబత్తిన ఘనశ్యాం, గొర్రెపాటి శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీనివాసరావు, మలగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'నక్ష' సర్వే

భూ రికార్డుల ఆధునికీకరణకు ఒంగోలు ఎంపిక

ఆర్థిక వనరుల పెంపునకు దోహదం

కమిషనరు వెంకటేశ్వరరావు

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 'నక్ష' సర్వే సోమవారం నుంచి ప్రారంభం అయింది. మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల ఆదాయ వనరుల పెంపుకోసం అవసరమైన చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు నగర కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ల్యాండ్ నేతృత్వంలో పట్టణాల భూ రికార్డులను ఆధునికీకరించడం కోసం చేపట్టిన 'నక్ష' సర్వే దేశవ్యాప్తంగా అమలు చేయనుంది. రాష్ట్రంలో పది కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలు ఎంపిక కాగా అందులో ఒంగోలుకు స్థానం లభించింది. నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్-బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్ కింద దేశంలోని 152 నగరాలను, మునిసిపాలిటీలను ఎంపిక చేసిందన్నారు. ఈ సర్వే ద్వారా నగర పరిధిలోని భూ రికార్డులు, గృహాలు, ఆస్తులు ఆధునికీకరించడం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలో పది కార్పొరేషన్‌లు ఎంపిక చేయగా, అందులో ఒంగోలుకు స్థానం లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాజెక్టు కింద మొదటగా ఎంపికైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఇంటింటి సర్వే చేస్తారని తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రతి ఇంటిని పరిశీలించి ఆ ఇంటికి కేటాయించిన ఆస్తిపన్నును గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అలాగే సర్వేలో ఇంటి పన్నులు లేని గృహాలను గుర్తించి పన్ను విధిస్తారని వివరించారు. సర్వేతో ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల ఆదాయ వనరుల పెంపుకు దోహదపడతాయన్నారు. అలాగే ఈ ప్రాజెక్టుకు ఇన్సెంటివ్ కింద కేంద్ర ప్రభుత్వం రూ. 30 కోట్లు మంజూరు చేస్తుందని వివరించారు. ఇంటింటి సర్వే చేసి అండర్ అస్సెస్‌మెంట్‌లను గుర్తించడంతోపాటు, ఆస్తి పన్నుల్లో లోపాలను, అలాగే హెచ్చు తగ్గులను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దాంతోపాటుగా ఇప్పటి వరకు ప్రతి ఇంటికి కరెంట్ బిల్ మీటర్ నెంబరు ఏ విధంగా ఆ ఇంటి గోడపై వేస్తారో, అలాగే ఇంటి ఆస్తి పన్ను అస్సెస్‌మెంట్‌ను పెయింటింగ్ ద్వారా గోడపై వేస్తామని తెలిపారు. తద్వారా నగరంలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎన్నింటికి పన్ను ఉంది, పన్నులేని గృహాలు ఎన్ని ఉన్నాయో సులువుగా తెలుసుకోవడంతోపాటు, పన్ను విధించి కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచుకోవడం జరుగుతుందని కమిషనరు వివరించారు.



నక్ష సర్వేలో ఇంటికి అస్సెస్‌మెంట్ నెంబరు వేస్తున్న సిబ్బంది

అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలి



మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లారెవెన్యూ అధికారి చిన ఓబులేషు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు హాలులో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై డీఆర్వో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పట్లఅధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రజా వేదికలో 292 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, పార్థసారథి, జాన్సన్. విజయజ్యోతి తదితరులు ఉన్నారు.

భోజనం నాణ్యతను పరిశీలించిన డీఆర్వో

ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారులకు పెట్టేందుకు ఏర్పాటు చేసిన భోజన నాణ్యతను డీఆర్వో చిన్న ఓబులేషు పరిశీలించారు. అన్న క్యాంటీన్లు నిర్వహించే హరేకృష్ణ మూవ్మెంట్ భాగస్వామ్యంతో ప్రతి సోమవారం మీ కోసం కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజనాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భోజన నాణ్యతను పరిశీలించడంతో పాటు అక్కడే డీఆర్వో భోజనం చేసి అర్జీదారులకు భోజనాన్ని వడ్డించారు.

ఎస్పీకి 81 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు 81 మంది తమ సమస్యలను విన్నవించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు సుధాకర్, హజరత్తయ్య, పాండురంగారావు, ఎస్సై రజియా సుల్తాన్,ప్రభాకరరెడ్డి తదితరులు ఉన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఘనంగా జీవీఆర్ అధినేత గ్రంధి జయంతి

● కంపెనీలో రక్తదాన శిబిరం

సింగరాయకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఉన్న జీవీఆర్ కంపెనీలో ఆసంస్థల అధిపతి గ్రంధి వెంకటేశ్వరరావు 85వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద కంపెనీ ఉద్యోగులు, కార్మికులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి వెంకటేశ్వరరావు అని కొనియాడారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ ప్రొడక్షన్ మేనేజర్లు ఆరితోటి బాబూరావు, బి.శంకర్, చల్లా దొరై, సుబ్రమణ్యం, సిబ్బంది బాలాజీ, ప్రసాద్, శ్రీను టీడీపీనేతలు షేక్ సందానీబాషా, సుబ్బారావు, యస్థానీ పాల్గొన్నారు.



గ్రంధి వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కంపెనీ ఉద్యోగులు

సెలవుపై వెళ్లిన చీమకుర్తి ఎంపీడీవో

● ఏవోకు ఇన్‌చార్జి బాధ్యతలు

చీమకుర్తి,మార్చి24(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి ఎంపీడీవో రాఘవేంద్ర సోమవారం నుంచి సెలవుపై వెళ్లారు.గ్రూపు1 పరీక్షల నేపథ్యంలో మే9 వతేదీ వ రకూ సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో తాత్కాలికంగా ఏవో వజ్జా శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పచెప్పారు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మద్దిపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పొట్టు ట్రాక్టర్ లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇరువురికి గాయాలయ్యాయి. మద్దిపాడు ఎస్సై శివరామయ్య కథనం మేరకు తాళ్లూరు మండలం శివరాంపురంకు చెందిన నారిపెద్ది శ్రీను శనగపొట్టు తీసుకుని ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీను, గంగయ్యలతో కలిసి ఇంకొల్లు నుంచి వస్తుండగా గుండ్లాపల్లి అండర్ పాస్ బ్రిడ్జి దగ్గర రాంగ్ రూట్‌లోకి ప్రవేశించి వెల్లంపల్లి ఫైపుల మిల్లు ఎదురుగా లారీని ఢీకొట్టారు. దీంతో ట్రాక్టర్ లో ఉన్న నలుగురికి, లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా వారిని 108 వాహనంలో ఒంగోలు తరలించారు. వారిలో కంచర్ల శ్రీను చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శివరామయ్య తెలిపారు.

నేడు ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

కొత్తపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై ఈ నెల 25న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ, గృహ నిర్మాణశాఖ, పశుసంవర్ధకశాఖ, సర్వశిక్షా అభియాన్, అటవీశాఖల ద్వారా జరిగిన పనులపై జరిగే ప్రజావేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.



సర్టిఫికెట్ల ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న వీసీ మూర్తి

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డీవీఆర్ మూర్తి అన్నారు. స్థానిక ఏకేయూ సమావేశపు హాలులో సోమవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీసీ మూర్తి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు, ఉన్నత స్థాయి ఉద్యోగాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ఏ వృత్తినైనా నిబద్ధతతో చేసినప్పుడే ఫలితాలు వస్తాయన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధిలో భాగంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రిన్సిపాల్ రాజమోహన్‌మాట్లాడుతూ విద్యార్థులలో సేవా గుణాన్ని, సేవా తత్పరతను పెంపొందించుకొనేందుకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు దోహదపడుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్.నిర్మలామణి,డాక్టర్ పిల్లి వెంకట్రావు, డాక్టర్‌ఆర్.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రాపర్లలో ఆరబోసిన ధాన్యంను పరిశీలిస్తున్న సీపీఎం, రైతు సంఘం నేతలు

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నాగులుప్పలపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అధికారులు ఇచ్చిన మాట ప్రకారం రాపర్లలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంతిబాబు డిమాండ్ చేశారు. అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రాపర్ల ,మెట్టువానిపాలెం గ్రామాలకు చెందిన రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకొనేందుకు వీలు లేక ఆరుబయటే ఉంచారు. ఆ ధాన్యం కుప్పలను సోమవారం నాయకులు పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12 న ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ ఇచ్చిన అధికారులు పట్టించుకొన్న పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తూబాటి శ్రీకాంత్,ఈదర సాంబశివరావు, మెట్టు లోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాల తనిఖీ

చీమకుర్తి, మార్చి24 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న ఐదు కేంద్రాలను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్ర పరిశీలకులు సుబ్బారెడ్డి మన శశి పాఠశాలలో కేంద్రాన్ని, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెండ్ సుబ్బారావు ఆరోగ్యం బాగోలేక విశ్రాంతి తీసుకుంటుండటాన్ని గమనించిన పరిశీలకులు ఆరోగ్యంపై వాకబు చేశారు. ఆర్‌జేడీ,డీఈవోలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పొగాకు గరిష్ఠ ధర రూ. 280

సంతనూతలపాడు, మార్చి 24: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం అమ్మకాలకు కందులూరు క్లస్టర్ నుంచి 815 పొగాకు బేళ్లు వచ్చాయి. వాటిలో 678 బేళ్లు అమ్ముడవగా 137 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ280లు , కనిష్ఠ ధర రూ.250లు పలికింది. సరాసరి ధర రూ.271.12 వచ్చినట్లు తెలిపారు. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విక్రయానికి సిద్ధంగా టీటీడీ నూతన సంవత్సర పంచాంగాలు

ఒంగోలు కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి):తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన విశ్వావసు నామ సంవత్సర నూతన సంవత్సర తెలుగు పంచాంగాలు ఒంగోలు శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. సోమవారం పంచాంగాన్ని ముందుగాపాలకమండలి ప్రతినిధులు, అర్చక స్వాములకు అందజేశారు. పంచాంగాలు కావాల్సిన వారు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

మద్దతు ధరకు ఉత్పత్తులను కొనుగోలు చేస్తాం

సంతనూతలపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుల పండించిన కందులు, శనగలు, వరి పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరప్రకారం కొనుగోలు చేస్తామని ఏవో పావని సోమవారం ఓప్రకటనలో తెలిపారు. కందులు ధర క్వింటా రూ.7550, శనగలు క్వింటా రూ. 5650, వరి సాధారణ రకం క్వింటా రూ.2300, వరి గ్రేడ్ ఏ రకం రూ.2320 చొప్పున ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని ఆమె తెలిపారు. మద్దతు ధరలకు అమ్ముకోవాలకున్న రైతులు తమ వివరాలను గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకుని మండలానికి కేటాయించిన కేంద్రాల్లో విక్రయించవచ్చని తెలిపారు.

బెట్టింగ్‌కి పాల్పడితే కఠినచర్యలు

చీమకుర్తి,మార్చి24(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పోటీలు ప్రారంభమైన నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్ల ఆటకట్టించే చర్యలను ప్రత్యేకంగా చేపట్టినట్టు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. బెట్టింగ్ నిర్వహించినా, ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వేమా యల్లయ్య సేవలు ఆదర్శనీయం

చీమకుర్తి,మార్చి24(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి అభివృద్ధిపై చెరగని ముద్రవేసిన మాజీ శాసనసభ్యులు, వేమా యల్లయ్య అందించిన సేవలు ఆదర్శనీయమని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు అన్నారు. యల్లయ్య 30వ వర్ధంతి చీమకుర్తిలో సోమవారం నిర్వహించారు.

అసత్యాలు, అభూతకల్పనలను సహించం

●కమ్మ సంఘ ప్రతినిధుల ఆగ్రహం

ఒంగోలు కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి):ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘంపై నిందలు వేస్తూ విషపు రాతలు రాస్తే సహించేది లేదని సంఘ ప్రతినిధులు హెచ్చరించారు. ఆదివారం ఒంగోలులో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రతినిధులతో నిర్వహించిన కమ్మవారి ఆత్మీయ సమ్మేళనంపై బులుగు దినపత్రికలో అసత్య కథనం, అభూత కల్పనలు రాశారని సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్య కథనాన్ని ప్రచురించిన పత్రికపై పరువునష్టం దావా వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రావుల పద్మజ, కాట్రగడ్డ రఘుపతిరావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కంచర్ల వెంకట నారాయణ, గోగినేని శ్రీనివాసరావు, కాశిరావు, దుగ్గినేని వెంకట్రావు, బొడ్డపాటి వెంకట్, చిమ్మిరి బాలకృష్ణ, వేమూరి వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి

● ఆన్‌లైన్ బెట్టింగ్, సైబరు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్సై సంపత్ కుమార్

పుల్లలచెరువు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి వారిని క్రమశిక్షణతో మెలిగేలా చూడాలని పుల్లలచెరువు ఎస్సై సంపత్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో సైబరు నేరాలు, ఆన్‌లైను బెట్టింగ్‌లు, లైంగిక దాడులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరు నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటప్స్‌లో వచ్చే లింకులను నొక్కవద్దని సూచించారు. ముఖ్యంగా ఈవిటీజింగ్‌కు పాల్పడి కేరీర్ నాశనం చేసుకోకుండా అవగహన కల్పించాలని అన్నారు. విద్యార్థులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండేలా పాఠశాలల్లో అవగహన కల్పించాలన్నారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌ల బారిన పడొద్దు

పెద్దారవీడు : ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో యువత భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఎస్సై అనిక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో యువత ఆన్లైన్ జూదానికి అలవాటుపడి బెట్టింగ్ యాప్‌లలో లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారన్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా క్రెడిట్ కార్డులు, ఆన్లైన్ చీటీల ద్వారా అప్పులు చేసి వాటిని కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు దృష్టిసారించి పిల్లలు అలాంటి వాటి బారిన పడకుండా చూడాలన్నారు. ఐపీఎల్ నేపథ్యంలో బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్కా, పేకాటలపై ప్రత్యేక నిఘా

కొమరోలు : గిద్దలూరు సర్కిల్ పరిధిలో మట్కా, ఆన్‌లైన్ బెట్టింగులు, పేకాట ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని గిద్దలూరు సీఐ జే.రామకోటయ్య తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించి పోలీసులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గిద్దలూరు సర్కిల్ పరిధిలో జరిగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మట్కా, పేకాటలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగులు, మట్కా, పేకాట ఆడుతున్నారనే సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలియజేస్తే వారి వివారాలను గోప్యంగా ఉంచుతా మన్నారు. ఆయన వెంట ఎస్సై జక్కుల నాగరాజు, ఏఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చట్టం తీసుకురావాలి

మార్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ కాకుండా చట్టం తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు షాలేమ్‌రాజు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందజేసేందుకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధిని ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అసెంబ్లీలో చర్చ జరిపిన తీరుకు ఎమ్మార్పీఎస్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా శాసనమండలిలో బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదే అన్నారు. అప్పుడే ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి నైజం బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నేదరపల్లి జయరాజ్, కరవల్ల బాబీ, కొత్త కిషోర్, వినోద్, రమేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకులో మహిళ మృతదేహం గుర్తింపు

త్రిపురాంతకం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూపాడు ఎస్ఎస్ ట్యాంకులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సీహెచ్.శివబసవరాజు ఎస్ఎస్ ట్యాంకు వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన మహిళ వయస్సు సుమారు 50 ఏళ్లు పైబడి ఉంటుందని కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

● డాక్టర్ వెంకటేశ్వరనాయక్

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే గిరిజనులు వేసవి కాలంలో వచ్చే రోగాలపై జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ వెంకటేశ్వరనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఇష్టకామేశ్వరిదేవి అమ్మవారి గూడెం వద్ద మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవిలత, సుజాత, సీహెచ్‌డబ్ల్యూ పోతమ్మ, కొండయ్య, ఎన్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచితంగా నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వనున్నట్లు యాస్టర్ ఎడ్యుకేషనల్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు మహిళలకు, బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు కోర్సులు పురుషులకు 3 నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనే యువతీ యువకులు 8897837783 సంప్రదించాలని, ఆధార్, సర్టిఫికేట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డైరెక్ట్ బస్సు సర్వీసులు నడపాలి

గిద్దలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు వీలుగా స్థానిక డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులతో ఆయన నేరుగా మాట్లాడారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చాలా ఏళ్లుగా నడిచిన గిద్దలూరు-కడప, గిద్దలూరు-బెంగళూరు సర్వీసులను ఇటీవల కాలంలో రద్దు చేశారన్నారు. వాటిని పునరుద్ధరించాలని కోరారు. గిద్దలూరు నుంచి శ్రీశైలం, మహానంది, కనిగిరిలకు ప్రతి రోజు సర్వీసులు నడపాలని కోరారు. కంభం నుంచి వెలగలపాయకు ప్రతిరోజు రాత్రి 7.30గంటలకు చివరి సర్వీసు ఉండగా ఈ సమయాన్ని 8గంటలకు పెంచాలని ఆప్రాంతవాసులు కోరారు. మండల కేంద్రమైన అర్ధవీడులో ఒక్క నిమిషం కూడా బస్సు ఆపడం లేదని, 5 నిమిషాలైన బస్సును ఆపించాలని కోరారు. గిద్దలూరు-కెఎస్‌పల్లె మధ్య జగనన్న కాలనీలో 300కు పైగా కుటుంబాలు నివసిస్తున్న దృష్ట్యా రిక్వెస్టు స్టాప్‌ను ఏర్పాటు చేయాని కాలనీవాసులు కోరారు. గిద్దలూరు నుంచి రాచర్ల, తురిమెళ్ల మీదుగా విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసును ఈ రూటులో ఉండే గ్రామాల వద్ద ఆపించే ఏర్పాట్లు చేయాలన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తామని డిపో మేనేజర్ చంద్రశేఖర్ వారికి హామీ ఇచ్చారు.

ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములవుతాం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, ఆర్టీసీ బస్సుల అభివృద్ధిలో తోడ్పడతామని హయ్యర్ బస్ డ్రైవర్స్, వర్కర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆర్టీసీలో హయర్ బస్సులు నడుపుతూ తాము ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డామన్నారు. అనంతరం వివిధ సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. తాము డిపోలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లు అవసరమైతే హయర్ బస్సుల డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బొందిలి కాశీరామ్‌సింగ్, గౌరవ సలహాదారుడు పఠాన్ షఫివుల్లా ఖాన్, అధ్యక్షులు దివాన్ ఖాన్, కార్యదర్శి మండ్లా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
● 37 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
● కంభంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

గిద్దలూరుటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్య పరిస్థితులలో సతమతమవుతున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 37 మందికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 23,89,836లను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మంజూరు చేయించి ఆ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తే తనకు తెలియచేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కొమరోలు, రాచర్ల, గిద్దలూరు మండల పార్టీల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, కటికె యోగానంద్, మార్తాల సుబ్బారెడ్డి, కేతం శ్రీనివాసులు, నరసింహులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం : చెత్త నుంచి సంపద సృష్టించే భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని అన్ని పంచాయతీలలో ఘనవ్యర్థ పదార్థాల నుంచి ఎరువులను విద్యుత్ ఉత్పత్తి చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా చేయడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఒక్కో మండలం చొప్పున ఆయా పంచాయతీల కార్యదర్శులు, క్లాప్‌మిత్రల ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి కంభం, కందులాపురం సర్పంచులు బోడయ్య, రజని, టీడీపీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, ఆరేపల్లి మల్లికార్జున, ఎస్సీసెల్ నాయకులు గోన చెన్నకేశవరావు, కేతం శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, నీటిసంఘం అధ్యక్షులు ఆదినారాయణ, బిజ్జాల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కంభం : శనగ రైతులను ఆదుకునే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌యార్డుల ద్వారా శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిలో భాగంగా కంభం మార్కెట్‌యార్డు ఆవరణలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కంభం, అర్ధవీడు మండలాలకు చెందిన రైతుల నుంచి కందులు, శనగలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. క్వింటా శనగలు రూ.5650, క్వింటా కందులు రూ.7650 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కావున శనగ, కందులు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో స్వరూపా, ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పేదలకు దుస్తులు పంపిణీ

కంభం : రంజాన్ మాసం సందర్భంగా ఎస్ఆర్‌ఎ టీడీపీ నాయకులు రఫీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేతుల మీదగా 700 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేయించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రఫీ ఏటా ఇలా పేదలకు నిత్యవసర సరుకులను, దుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం,మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. సోమవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో త్రిపురాంతకం మండలంలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రతి 60 మంది ఓటర్లకు ఒక సారధి ఉంటారని వారు ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తారన్నారు. ఇక నియోజకవర్గం అభివృద్ధికి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేసిందన్నారు. పట్టణంలో ఎస్సీ హాస్టల్ నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. అనంతరం పట్టణంలో ఎస్సీ హాస్టల్‌కు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు మేకల వలరాజు, చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్,దేవినేని చలమయ్య, శ్రీనివాసరెడ్డి, ఆళ్ల నాసర్‌రెడ్డి, మల్లెల అల్లూరరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

టీడీపీ మీదకు నెపం నెడతారా..?

వైసీపీ పార్టీ వాళ్లు, వారి పార్టీ నాయకులను వారే కిడ్నాపు చేయించుకొని ఆ నేపం టీడీపీ పైకి నెట్టడం తగదని టీడీపీ నియోజకవర్గం నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రిపురాంతకం మండలం వైసీపీకి చెందిన ఆళ్ల ఆంజనేయరెడ్డి వాళ్ల పార్టీ నాయకులకు కిడ్నాపు చేస్తే ఆ నేపం టీడీపీ పై నెట్టడం సరికాదన్నారు. చట్టం తన పనితాను చేస్తుందని వారి అరెస్టు వెనుక టీడీపీ నాయకుల పాత్ర ఏమీలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు మేకల వలరాజు, చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మంత్రునాయక్, పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్, మిద్దె తోటలపై శిక్షణ


వై.పాలెంలో శిక్షణ కల్పిస్తున్న డీఆర్సీ రామ్మోహన్

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం డివిజన్ పరిధిలోని రైతుసేవాకేంద్రం సిబ్బందికి, వ్యవసాయ సిబ్బందికి హోమ్ కంపోస్టింగ్‌పై సోమవారం శిక్షణ తరగతులను రైతుసేవా కేంద్రంలో నిర్వహించారు. అదనపు వ్యవసాయ సంచాలకురాలు కె.నీరజ అధ్వర్యంలో జరిగిన ఈ తరగతుల్లో డీటీసీ డీఆర్సీ ఎస్.రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల కంపోస్టు పిట్ల తయారీ, మిద్దె తోటలు పెంపకం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్సీ, ఏడీఏ జె.వెంకట్రావు, డీఆర్సీ వ్యవసాయ అధికారులు వి.వెంకటశేషమ్మ, ఏ.శైలజరాణి, ఉద్యానశాఖ అధికారి పి.ఆదిరెడ్డి, నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

తర్లుపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం, తర్లుపాడు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణబీ, పడాయిబీపై కలుజువ్వ లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్కాపురం సీడీపీవో పి.సుశీలాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. మొదటి రోజు శిక్షణలో ప్రీ టెస్ట్ ఈసీసీఈ అభివృద్ధిలో భాగంగా బాల్య విద్య ప్రాముఖ్యత, సామాజిక భావోద్వేగ అభివృద్ధిపై, శారీరక అభివృద్ధి, సాంస్కృతిక, సౌందర్య అభివృద్ధి, బాష అభివృద్ధిపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో తర్లుపాడు, మార్కాపురం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శిక్షణను ప్రారంభిస్తున్న సీడీపీవో సుశీలాదేవి

అంగన్‌వాడీ కేంద్రంలో నూతన విద్యావిధానం

బేస్తవారపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలలో ఆరేళ్లలోపు పిల్లలకు ప్రీస్కూల్‌లో నూతన విద్యావిధానం ఏర్పాటు చేశారని అందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం సీడీపీవో నీలోఫర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోషణ్‌బీ - పడాయిబీలో భాగంగా 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడి కేంద్రాలలో నేర్పించే విద్యను అదర్ శిల అంటారన్నారు. కార్యకర్తలు పిల్లలకు చక్కగా విద్యను నేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.నాగచెంచులక్ష్మీ, పి.విజయలక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొమరోలు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు, మార్చి24(ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు కామూరి అమూల్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరుకానున్నారు. కావున మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా తగు సమాచారంతో హాజరు కావాలని కోరారు. సమావేశానికి మండల స్థాయి అధికారి రాకుండా ఇతర సిబ్బందిని పంపించాలంటే ముందుగా ఎంపీపీ అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. సమావేశానికి రాని అధికారులపై జిల్లా అధికారులకు చర్యల నిమిత్తం నివేదిక పంపనున్నామన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మార్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఎన్నో ఆలయాలను శ్రీకృష్ణదేవరాయలు కట్టించా రన్నారు. అందులో బాగంగానే మార్కాపురం లోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానాన్ని కూడా ఆయన హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. అంతేకాక ఎన్నో గ్రామాలను ఆలయం కోసం దానంగా ఇచ్చారన్నారు. అటువంటి గొప్ప రాజు విగ్రహం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. నేటితరానికి ఆయన ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యురాలు శాసనాల సరోజిని, నాయకులు ఎం.చిన్నయ్య, ఎమ్.లక్షీదేవి, పట్టణ పార్టీ అధ్యక్షులు పాదర్తి ఆంజనేయు లు, కడియం రామయ్య, గోనుగుంట్ల శ్రీధర్, పొట్టి గురునాథం, గురుమూర్తి, బైసాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు అధునాతన చికిత్స

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయరా దని, వ్యాధి నిర్మూలనకు అధునాతన చికిత్స అందుబాటులో ఉందని డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణదినోత్సవం సందర్భంగా కోర్టు కూడలిలోని ఆరోగ్య కేంద్రం నుంచి పట్టణ వీధులలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభించిన డా.పద్మావతి మాట్లాడుతూ.. క్షయవ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమన్నారు. అని సకాలంలో గుర్తిస్తే నివారణ సులభమవుతుందన్నారు. వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులు, పౌష్టికాహారం ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, శివారెడ్డి, ఎస్టీఎస్ గోవిందరాజు, సిబ్బంది ఆవులయ్య, లక్ష్మీరెడ్డి, ఎంపీహెచ్‌ఈవో నాగేంద్రరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దదోర్నాల: క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంజీవ్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సంజీవ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంజీవ్ మాట్లాడుతూ ప్రజలు ధూమపానం, గుట్కా, ఖైనీ, మద్యానికి దూరంగా ఉండాల న్నారు. టీబీ ఉన్నట్లు గుర్తిస్తే ప్రభుత్వ వైద్య శాలలో సంప్రదించాలన్నారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ప్రతి నెల రూ.వెయ్యి నగదును అందజేస్తా మన్నారు. .క్షయ ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుంద న్నారు. వాధిగ్రస్థులు మాస్కు ధరించాల న్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రామాంజనేయులు, మెర్సీ ప్రియాంక, కళాసంధ్య, మౌనిక, టీబీ సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది మంత్రునాయక్, వెంకటేశ్వరరెడ్డి, ఆరోగ్యమిత్రలు చంద్రశేఖర్, మణికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులు స్వీయరక్షణ విద్యను అభ్యసించాలి

మార్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్వీయరక్షణ పద్ధతు లపై విద్యార్థినులు తప్పక అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు అన్నారు. స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మార్కా పురం డివిజన్‌స్థాయి శక్తిటీం ఆధ్వర్యంలో స్వీయరక్షణ పద్ధతులపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎస్సై రాజమోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థినులు ఎవరికీ తక్కువ కాదన్నారు. ఎవరైనా విద్యార్థినులపై దాడి చేస్తే తప్పించుకోవడం, ప్రతిదాడి చేయగలిగే సామర్థ్యాలను తప్పక పెంపొందించుకోవాలన్నారు. చిన్నపాటి టెక్నిక్స్‌తో నిలువరించవచ్చన్నారు. ఈ సందర్భంగా కరాటే ఇన్‌స్ట్రక్టర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి విద్యార్థినులకు స్వీయ రక్షణ పద్ధతులను నేర్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, సీఎస్‌ఈ హెచ్‌వోడీ డాక్టర్ పిపి సాధునాయక్, ప్రొఫెసర్ వైవి ఆదిసత్యనారాయణ, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రకృతి వ్యవసాయం చేద్దాం

పెద్దారవీడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలో తమ పేర్లను తప్పక నమోదు చేసుకోవాలని ఏవో బుజ్జిబాయ్ అన్నారు. స్థానిక వ్యవసాయ రైతు సేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయశాఖ, వెలుగు సిబ్బంది సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏవో బుజ్జిబాయ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం వార్షిక ప్రణాళికలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి రైతు సాగు చేసే పంట వివరాలు, విస్తీర్ణాలను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వివరించారు. ఏపీఎం కృపమ్మ మాట్లాడుతూ మహిళా సంఘాలలోని సభ్యులందరూ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ లలితమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఉరికంభాన్ని ముద్దాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు మరువలేనివని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. స్థానిక 3వ వార్డులో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అమర వీరుల వర్ధంతిసభ నిర్వహించారు. కార్యక్రమంలో డీకేఎం రఫీ, చిన్ని, దేవరాజ్, అభిషేక్, శేఖర్, ఏసేబు, రాజాబాబు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను వృథా కానివ్వం

గిద్దలూరు : స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో దేశం కోసం రక్తంచిందించి అమరులైన వారి త్యాగాలను వృథా కానివ్వమని, వారి వారసత్వాన్ని కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.ఆరోన్ అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి వారోత్సవాలలో భాగంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి ఎందరో త్యాగ. దనులు అతిపిన్న వయస్సులోనే ప్రాణాలను త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐ నాయకులు తేజ, సాయికిరణ్, విష్ణువర్ధన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

కట్టుదిట్టంగా పదోతరగతి పరీక్షలు

మార్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేసినట్లు పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్, జెడ్పీ బాయ్స్, గర్ల్స్ హైస్కూల్ లలో బందోబస్తును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలకు సమీపాల్లో ఎవరూ తిరగరాదన్నారు. ఎలాంటి ఘటన చోటుచేసుకున్నా కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కువ సంఖ్యలో సిబ్బందిని విధుల్లో ఉంచా మన్నారు.

బేస్తవారపేట : మండలంలోని పిటికాయగుళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను తహసీల్దార్ జితేంద్ర తనిఖీ చేశారు. మొదటి నుంచి ఈ కేంద్రం సమస్యాత్మక కేంద్రంగా గుర్తింపు ఉంది. దీంతో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు గట్టిగా ఉండడంతో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గిద్దలూరుటౌన్ : పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తనిఖీ చేశారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ పాఠశాల, ముండ్లపాడులోని ఏపీయూపీ పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. అలాగే ఆయా పరీక్ష కేంద్రాల వద్ద అర్బన్ సీఐ కె.సురేష్ సిబ్బందిని నియ మించి కట్టుదిట్ట చర్యలు చేపట్టారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండల కేంద్రంలో మొత్తం 8 పరీక్ష కేంద్రాలలో పది పరీక్షలు జరుగుతున్నాయి. సోమవారం గణితం పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ 8 పరీక్ష కేంద్రాలలో మొత్తం 899 విద్యార్థులకు గాను 887 హాజరై పరీక్ష రాసినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. డిప్యూటీ డీఈవో ఫ్లైయింగ్ స్కాడ్, రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ, పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



మార్కాపురంలో బందోబస్తులో ఉన్న పోలీసులు, బేస్తవారపేటలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జితేంద్ర

పెద్దదోర్నాల : మండల కేంద్రం దోర్నాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తహసీల్దారు కిన్నెర శాంతి సోమవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రవీంద్ర హైస్కూల్, వసంత జూనియర్ కళాశాలలో మొత్తం 580 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రశాంత వాతావరణంలో జరగడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

దొనకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో గ్రామాల్లోని యువకులు బెట్టింగులకు దూరంగా ఉండాలని ఎస్ఐ టి.త్యాగరాజు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌ల మాయలోపడి యువత మోసపోవద్దన్నారు. వీటిపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. క్రికెట్ పోటీలను చూసి ఆనందించాలేకాని, బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మండలంలోని ఏగ్రామంలోనైనా ఇలాంటి కార్యక్రమాలు జరుగుతుంటే 9121102175 నెంబరుకు ఫోన్ చేయాలని ఎస్ఐ త్యాగరాజు పేర్కొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

పామూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడితే అంటు వ్యాధులు దరిచేరవని దూబగుంట పంచాయతీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు సూచించారు. స్థానిక చెత్త సంపద తయారీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు జరుగుతున్న శిక్షణలో భాగంగా 4 వ రోజు సోమవారం హనుమంతునిపాడు మండల కార్యదర్శులు, క్లాప్ మిత్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాల్లో క్లాప్ మిత్రలు సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి గ్రేడింగ్ చేయాలన్నారు. సేకరించిన చెత్తతో వర్మికంపోస్ట్ తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జీవీ అరవిందారెడ్డి, డీపీఆర్సీ రాఘవులు, జి.రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు

పామూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పామూరు, సీఎస్‌పురం మండలాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందని పామూరు ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి డాక్టర్ మునీర్ తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 వరకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఅవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 7వేలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,07,411లు వచినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.47,140, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.29,895, అన్నదాన విరాళాల ద్వారా రూ.19,360, ఇతర విరాళాల ద్వారా రూ.11,016 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

సీఎస్‌పురం(పామూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌ను పామూరు సీఐ ఎం. భీమానాయక్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రాత్రుళ్లు గస్తీ ముమ్మురం గా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ముండ్లమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడులో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సోమవారం సాయంత్రం సమాచారం అందటంతో ఎస్ఐ వై.నాగరాజు తన సిబ్బందితో దాడిచేశారు. ఈసందర్భంగా ముగ్గురిని అరెస్టుచేసి రూ.31,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని దర్శి కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా దేవస్థాన వార్షికోత్సవం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలోని గంగమ్మతల్లి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయ తోరణ అలంకరణ, దంపతుల యోగశాల, గణపతి పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఏవో బి.సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం సీఎస్‌పురం మండలం నల్లమడుగు గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కందికి క్వింటా రూ.7,550 మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు. ప్రస్తుతం కంది పంట నూర్పిడి దశలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. పెద్దగోగులపల్లి రైతు సేవా కేంద్రంలో కందుల కొనుగోలు సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు చెప్పారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు

ముమ్మర ఏర్పాట్లు



విద్యుత్‌లైన్ ఏర్పాటుకోసం స్తంభాలు వేసిన అధికారులు

- వేగంగా విద్యుత్‌లైన్, రోడ్డు నిర్మాణం
- పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీలో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచనలతో సంబంధిత అధికారులు చకచకా పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే సుమారు 350ఎకరాలలో ముళ్లపొదలను తొలగించారు. దివాకరపల్లి నుంచి బయోగ్యాస్ ప్లాంట్‌కు కేటాయించిన భూమి వరకు రోడ్డు పనులు వేగవంతమయ్యాయి. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో దివాకరపల్లి గ్రామంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి పక్కన అమర్చారు. రిలయన్స్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూమి వరకు విద్యుత్ అధికారులు వడివడిగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఈవెంట్ నిర్వాహకులు మణిందర్, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి తదితరులు ప్లాంట్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఏప్రిల్ 2న జరిగే భూమిపూజకు వీఐపీలు రానున్న



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

నేపథ్యంలో రెండు హెలిప్యాడ్‌ల నిర్మాణంతో పాటు బహిరంగసభ నిర్వహించే ప్రాంతంలో భూమిని చదును చేయడంతో పాటు అవసరమైన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సంబంధిత అధికారులు, రిలయన్స్ ప్రతినిధులను ఆదేశించారు. సభావేదిక నుంచి 600మీటర్ల దూరంలో హెలిప్యాడ్‌లు నిర్మించాలన్నారు. వీఐపీల వాహనాలు వచ్చేందుకు మురుగమ్మి నుంచి రోడ్డును ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. బహిరంగసభకు వచ్చే ప్రజలకు దివాకరపల్లి నుంచి రోడ్డుమార్గం ఏర్పాటు చేయడంతో పాటు ద్విచక్రవాహనాలు, కార్లకు వేరువేరుగా పార్కింగ్‌లు ఏర్పాటుచేయమని సంబంధిత శాఖ వారిని ఆదేశించారు.

రిలయన్స్ కంపెనీకి కేటాయించిన 475.57ఎకరాలలో సోమవారం రాత్రికి 350ఎకరాలకు పైగా భూమిలో ముళ్లపొదలను తొలగించి భూమిని చదునుచేశారు. ఎమ్మెల్యే ఉగ్ర వెంట సైట్ ఇన్‌చార్జ్ బత్తిన రాధాక్రిష్ణ, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, ఈవెంట్ నిర్వాహకులు మణిందర్, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ తిరుపాలయ్య, విద్యుత్‌శాఖ ఈఈ ఆర్.ఉమాకాంత్, ఏఈ లక్ష్మీరాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు

ప్రయాణమే పెద్ద పరీక్ష



ఆటోలో కిక్కిరిసి ప్రయాణిస్తున్న విద్యార్థులు

- తప్పని రవాణా కష్టాలు

దొనకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రయాణమే పెద్ద పరీక్షగా మారింది. 15 కిలోమీటర్ల దూరంలోని చందవరం జడ్పీ పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు, 14 కి.మీ దూరంలోని తెల్లబాడు జడ్పీ పాఠశాలకు చెందిన 68 మంది, పది కి.మీ దూరంలోని ఆరవళ్లిపాడు జడ్పీ పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు. అలాగే, 14 కి.మీ దూరంలో ఉన్న మంగినపూడి జడ్పీ పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు, 16 కి.మీ దూరంలో ఉన్న కొచ్చెర్లకోట జడ్పీ పాఠశాలకు చెందిన 48 మంది, ఏడు కి.మీ దూరంలో ఉన్న గంగదేవిపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.



దొనకొండ జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను స్వగ్రామాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆటోలు

మార్చి నెలలోనే వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రానికి రాకపోకలు జరుపుకునేందుకు విద్యార్థులు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈనెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించింది. అయితే బస్సులు లేని రూట్లల్లో గ్రామాలకు చెందిన విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరేందుకు ప్రత్యేక బస్సుల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో ప్రమాదమైన విద్యార్థులు సాహసం చేస్తూ ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు ప్రారంభం నుంచి దొనకొండలోని పరీక్షా కేంద్రానికి ఆటోల్లో కిక్కిరిసి రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు కుటుంబ సభ్యులు పనులు మానుకొని ద్విచక్ర వాహనాలపై వారి పిల్లలను దొనకొండకు తెచ్చి పరీక్షలు రాయించి తీసుకెళ్తున్నారు. భవిష్యత్తులోనైనా పరీక్షల సమయంలో విద్యార్థులు రవాణా ఇబ్బందులు ఎదుర్కొనకుండా పాలకులు, అధికారులు గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడితే విద్యార్థులకు రవాణా కష్టాలు తప్పుతాయని ప్రజలు భావిస్తున్నారు.

మాస్‌కాపీయింగ్ నిరోధానికి చర్యలు

- పరీక్షా కేంద్రాలను తనిఖీచేసిన డీఈవో, రాష్ట్ర పరిశీలకులు

తాళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, పరీక్షల విభాగం రాష్ట్రపరిశీలకులు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతున్నట్టు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో సోమవారం తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూర్పుగంగవరం జాహ్నవి పరీక్షా కేంద్రంలో కాపీయింగ్ జరిగినట్లు వచ్చిన ఆరోపణలు రుజువు కావటంతో ఆ కేంద్రం చీఫ్, డీవోలను మార్చారు. అలాగే, మండలంలోని బొద్దికూరపాడు ఏబీ కేంద్రాలోనూ జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అన్ని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇచ్చారు.

పామూరులో.. పామూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం పామూరులోని నాలుగు పరీక్షా కేంద్రాలు, బొట్లగూడూరులోని ఒక పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని చెప్పారు.

దొనకొండలో.. దొనకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి రెండు పరీక్షా కేంద్రాలను స్క్వాడ్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. స్క్వాడ్ అధికారి అయిన రాచర్ల ఎంఈవో-2 గిరిధరశర్మ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. రెండు కేంద్రాలకు చెందిన పరీక్షల చీఫ్‌లు జైహింద్‌రెడ్డి, రమణయ్యకు సూచనలు చేశారు.

కురిచేడులో.. కురిచేడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం స్క్వాడ్ బృందం, తహసీల్దార్, ఎస్ఐలు తనిఖీ చేశారు. ఉదయం 9.30 గంటలకే స్క్వాడ్ బృందం పరీక్షా కేంద్రాలకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ శివ పరీక్షా కేంద్రాలకు వెళ్ళి చీఫ్ సూపరింటెండెంట్‌లతో మాట్లాడారు. తహసీల్దార్ రజనీ కుమారి తమ సిబ్బందితో కలసి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఒకేరోజు ముగ్గురు అధికారులు పరీక్షా కేంద్రాల తనిఖీలతో విద్యార్థులు ఒకింత అసహనానికి గురయ్యారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఎస్ఐ వై.నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఒక పరీక్షా కేంద్రం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఒక పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

క్షయపై అవగాహన ర్యాలీ

కనిగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రెండు వారాలకు మించి దగ్గు వస్తుంటే అలక్ష్యం చేయవద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరాయంగా వచ్చే దగ్గు, జ్వరం అనారోగ్యాలకు కారణమన్నారు. వెంటనే సమీప పీహెచ్‌సీని సంప్రదించి కళ్లె పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల్లో క్షయ వ్యాధిగా నిర్ధారణ జరిగితే ఆందోళన చెందవద్దన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తగిన మందులు ఇస్తారని చెప్పారు. క్రమం తప్పకుండా వైద్యులు సూచించినవిధంగా మందులు వాడితే రోగం అదుపులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతి రెడ్డి, ఏహెచ్‌ఎస్ డాక్టర్ జి.వెంకటఫణి, టీబీ యూనిట్ ఆఫీసర్ రామాంజనేయులు, ఐటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పామూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్లు విజయ్‌కుమార్, రవళి పియాంక పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి సందర్భంగా సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బీసీ హాస్టల్ నుంచి మమ్మిడాడి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, క్రమంగా బరువు కోల్పోవడం, దగ్గినప్పుడు రక్తం పడటం జరుగుతున్నట్లయితే టీబీ లక్షణాలు ఉంటాయన్నారు. అటువంటి లక్షణాలు కలిగిన వారు దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటి వైద్యశాలల్లో కళ్లె పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు ఎస్.బ్రహ్మానందం, పి.శ్రీధర్, సరళమ్మ, విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, వైద్యులు, టీబీ యూనిట్ అధికారులు

ఉత్తమ అధికారిగా కేపీ రాజు

ముండ్లమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న కేపీ రాజు ఉత్తమ అధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందజేశారు. రాజును మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సీహెచ్ ప్రవీణ్ కుమార్, బి.మధు శంకర్, సిబ్బంది అభినందించారు.

రంగుల కోసం రూ.5 లక్షలు వృథా చేయాలా!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అసహనం

కనిగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, పోలీస్‌స్టేషన్ ఆవరణ వంటి బహిరంగ ప్రదేశాల్లో వివిధ ఆకృతులతో సుమారు రూ.5 లక్షలు వెచ్చించి రంగులు వేశారు. దీనికి సంబంధించిన బిల్లుల ఆమోదం కోసం సోమవారం జరిగిన సాధారణ సమావేశంలో చేర్చారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కేవలం రంగులకు రూ.5 లక్షలు ఉపయోగించడం సరికాదన్నారు. ఆ నిధులను భవిష్యత్తులో కూడా మేలు చేకూర్చే పనులకు వినియోగిస్తే బావుండేదన్నారు. మినిట్స్ బుక్ మెయింటెన్ చేయకపోవటంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. వచ్చే నెల 2న మంత్రి లోకేష్‌బాబు నియోజకవర్గానికి రానున్నట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. మంచినీటి సమస్యపై, ఇంటింటికి కుళాయి ఏర్పాటుకు రూ.84 కోట్లు మంజూరు చేయాలని కోరనున్నట్టు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, మేనేజర్ ప్రసాద్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సమాజంలో ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జునరావు

తాళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం ఉందని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. ఈ వృత్తికి కళంకం తీసుకురావద్దన్నారు. పాఠశాలల్లో బాలికల పట్ల ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలు ఆరోపణలు వస్తున్నాయన్నారు. బాలికల పట్ల అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదులతో జిల్లా ఎస్పీ ఆదేశానుసారం సోమవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఎస్ఐ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపుతుంటారని చెప్పారు. విద్యార్థినుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. సమాజంలో గురువులకు ఉన్న ప్రాధాన్యతను గుర్తుంచుకొని సన్మార్గంలో ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, ఎంఈవో-2 సుధాకర్ రావు, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

తాళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజా విజ్ఞప్తులను స్వీకరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రీవెన్ సెల్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మాకొడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు గృహనిర్మాణ శాఖ అధికారి మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ పది నిమిషాలు ఉండి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. ఎంపీడీవో హనుమంతరావు తన కార్యాలయంలోనే ఉండి విధులు నిర్వహించారు. దాదాపు 15శాఖలకు చెందిన అధికారులు ఉండగా, ఒక్కశాఖ అధికారి మాత్రమే హాజరయ్యారు.

జిల్లా అధికారులు మాత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండగా, స్థానిక అధికారులు మాత్రం గ్రీవెన్స్ గురించి పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గ్రీవెన్స్‌కు మండలస్థాయి అధికారులు రాకపోతుండటంతో ప్రజలు తమ సమస్యలను ఒంగోలులో జరిగే మీకోసంలో జిల్లా అధికారులకు విన్నవించుకుంటున్నారు.

ఘనంగా గోవిందమాంబ ఆరాధన ఉత్సవాలు

దొనకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో శ్రీమాత గోవిందమాంబ ఆరాధన మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీగోవిందమాంబ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, తదితర పూజలు నిర్వహించారు. మహా నైవేద్యాలు సమర్పించి మహిళలచే సామూహిక హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు గ్రామ పంచాయతీ నోటీసులు

తాళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామపంచాయతీలో సైడు కాలువలను ఆక్రమించిన వ్యాపారస్థులకు గ్రామ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి సోమవారం నోటీసులు జారీ చేశారు. మండల కాంప్లెక్స్ నుంచి వెల్లంపల్లి బస్టాండ్, తూర్పుగంగవరం రోడ్డు, ముండ్లమూరు రోడ్డు, రజానగరం రోడ్డు మార్గంలో కొందరు వ్యాపారస్థులు సైడు కాలువలను ఆక్రమించారు. అక్కడ రేకుల షెడ్లు వేసి వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్రఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ట్రాఫిక్ అంతరాయాన్ని పలువురు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేశారు. సైడు కాలువలపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా వారం రోజుల్లో తొలగించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో గ్రామపంచాయతీ ఆక్రమణలను తొలగిస్తుందని పేర్కొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ముండ్లమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ చేయించుకోని వారి లిస్టు విడుదల చేశారు. తమ సమీపంలోని రేషన్ డీలర్లను సంప్రదించి వీఎస్‌డబ్ల్యూఎస్ యాప్‌లో వేలి ముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈనెల 31 వరకే ఈ అవకాశం ఉందని తెలిపారు.

తప్పుల తడకగా రీసర్వే

తాళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే రైతులకు కష్టాలను తెచ్చి పెట్టింది. భూముల రికార్డులు తప్పుల తడకగా ఉండటంతో లబోదిబోమంటున్నారు. సోమవారం బొద్దికూరపాడు గ్రామస్థులు తమ బాధలను ఏకరువుపెట్టారు. తమకు చెందిన భూములు శంకర నారాయణ పురం రెవెన్యూ పరిదిలో ఉండి తమ అనుభవంలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో రెవెన్యూ అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీంతో తమకు చెందిన భూమి రికార్డుల్లో విస్తీర్ణం తగ్గగా, కొందిరికి భూమిలేకున్నా ఉన్నట్లు రికార్డులు సృష్టించారన్నారు. తమ అవసరాల కోసం భూములను అమ్ముకునేందుకు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా రికార్డుల్లో తమ పేరుబదులు ఇతరులుగా ఉండటంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయిందని గ్రామస్థులు పేర్కొన్నారు. అధికారులు చేసిన తప్పిదాలకు తాముతీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

తహసీల్దార్ సంజీవరావు మాట్లాడుతూ గతంలో కొందరి భూముల్లో నుంచి సాగర్ కాలువలు వెళ్లగా, వాటికి ప్రభుత్వం నష్టపరిహారం అందించిందని తెలిపారు. అన్ని విషయాలను పరిశీలించి భూమి హక్కుదారులకు భూమి హక్కు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, రిటైర్డ్ టీచర్ ఎస్.అంజిరెడ్డి, గ్రామస్థులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మండలంలోని వివిధ గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రూరల్ ఏఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆజీస్‌పురం, పునుగోడు, తాళ్లూరు, గుడిపాడు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పీసీపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీసీపల్లిలో సోమవారం సహకార సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటా రూ.7,550 మద్దతు ధరకు రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈక్రాప్ చేయించుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో కందులు విక్రయించిన వారం రోజుల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అధికారులతో పాటు పీసీపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం సిబ్బంది పాశ్చా, నాగార్జున, నాగోతు శ్రీనివాసులు, వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, ములకా నాగేశ్వరరావు, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





పథకం కోసం తరలించిన పైపులు



హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు ఊహాచిత్రం

మళ్లీ.. హ్యాపీనెస్ట్


నాడు రూ.714 కోట్లు.. నేడు రూ.930 కోట్లు

హ్యాపీనెస్టు గేటెడ్ కమ్యూనిటీలోని ఫ్లాట్లను కొనుగోలుదార్లకు 2021 నాటికే అప్పగించాలి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. తొలుత రూ.714 కోట్ల ప్రాజెక్టును షాపూజీ పల్లోంజీ పనులు చేపట్టగా రివర్స్ టెండరింగ్ అంటూ జగన్ ప్రభుత్వ నిర్ణయంతో పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో విపరీతమైన జాప్యంతో నిర్మాణ వ్యయం ప్రస్తుతం రూ.930 కోట్లకు పెరిగింది. గత డిసెంబరులో టెండర్లను పిలవగా ఎన్‌సీసీ సంస్థ ప్రాజెక్టును దక్కించుకుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (మంగళవారం సాయంత్రం)
సహరి : 4.52 (బుధవారం ఉదయం)

రాజధాని అమరావతిని అత్యద్భుతంగా నిర్మించే క్రమంలో అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. అంతర్జాతీయ స్థాయి వసతులతో హ్యాపీనెస్ట్ పేరుతో గృహ సముదాయాలకు గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. ప్రజల నుంచి ఊహించని స్పందన రావడంతో ఫ్లాట్ల బుకింగ్‌లు శరవేగంగా జరిగాయి. ఇక రాజధానిలో తమ కలల గృహం.. కృష్ణా నదీ సమీపంలో నేల పాడులో నిర్మాణం జరుగుతుందని ఫ్లాట్ల కొనుగోలుదారులు ఆనంద డోలికల్లో ఉన్నారు. అయితే వారి కలలను కల్లలు చేస్తూ.. వారి ఆశలను చిదిమేస్తూ గత వైసీపీ ప్రభుత్వం అమరావతి తో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును కూడా పక్కన పెట్టేసింది. రూ.లక్షలు చెల్లించిన వారు గత ఐదేళ్లు ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం..

అమరావతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో హ్యాపీనెస్టు కొనుగోలుదారుల్లో ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన హ్యాపీనెస్టు ప్రాజెక్టును చంద్రబాబు పట్టాలపైకి తీసుకురావడంతో కొను గోలు దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నా యి. జగన్ ప్రభుత్వమే తమను మోసం చేసిందని ఆందోళన చెందుతున్న ఫ్లాట్ల కొనుగోలుదార్లకు కూటమి ప్రభుత్వం అభయమిచ్చి పాత రేట్లపైనే నిర్మాణా లు పూర్తి చేసి అప్పగించేలా విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఆర్‌డీఏ రీ టెండర్లు నిర్వహించగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పను లను దక్కించుకుంది. త్వరలో హ్యాపీనెస్టు పనులు ప్రారంభం కానున్నాయి.



కొనుగోలు దార్లకు అభయం

- ప్రాజెక్టును పట్టాలెక్కిస్తోన్న ప్రభుత్వం
- రీ టెండర్.. నేలపాడులో పనులు ప్రారంభం
- పాత రేట్లపైనే పూర్తి చేసి అప్పగిస్తామని ప్రకటన
- జగన్ నిర్వాకంతో రూ.216 కోట్లు పెరిగిన వ్యయం



ప్రాజెక్టు స్థలం వద్ద జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో జనాభాను పెంచే లక్ష్యంతో 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును చేపట్టింది. నేలపాడు వద్ద హ్యాపీనెస్ట్ పేరుతో గేటెడ్ కమ్యూనిటీని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతితో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో హ్యాపీనెస్ట్‌లో ఫ్లాట్ల కోసం డబ్బులు చెల్లించిన అనేకమంది గగ్గోలు పెట్టారు. కొందరు ఒత్తిడి చేసి డబ్బులను వెనక్కు తీసుకోగా.. మరికొందరు దింపుడు కళ్లెం ఆశతో ఎదురుచూశారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు హ్యాపీనెస్ట్‌కు డబ్బులు చెల్లించిన వారందరికీ తీపి కబురు చెప్పారు. ఐదేళ్లపాటు ఆలస్యమైనా.. నిర్మాణ వ్యయం రూ.216 కోట్ల మేర పెరుగుతున్నా దానిని సీఆర్‌డీఏనే భరిస్తుందంటూ బాధిత ఫ్లాట్ల దారులకు అభయమిచ్చి వారిలో ప్రభుత్వంపై నమ్మకాన్ని కల్పించారు.

2బీ+జీ+18 అంతస్తులుగా 12 టవర్లు

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో)

అనుసంధానం.. ఆలస్యం

- గోదావరి జలాలు బనకచర్లకు తరలింపుపై ఖరారు కాని డిజైన్
- భూ సేకరణ ప్రక్రియను నిలిపేసిన రెవెన్యూ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ.. 2026 జూన్ కల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా చేపట్టిన జలహారతి ప్రాజెక్టు ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జలహారతి పేరుతో చేపట్టిన పనులు భూ సేకరణ దశలోనే ప్రస్తుతానికి ప్రభుత్వం ఆపేసింది. జలహారతిలో గోదావరి-బనకచర్ల అనుసంధానానికి ప్రభుత్వం గతంలో ప్రణాళికను విడుదల చేసింది. ఈ పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను కూడా ప్రారంభించింది. అయితే ఇంత వరకు ప్రక్రియ వేగంగా జరగడంతో గోదావరి జలాలు కుడి కాల్వకు వచ్చే కాలం అతి దగ్గరలోనే ఉందని ఆయకట్టు రైతులు ఆశపడుతున్నారు. అయితే వారిని నిరాశపరుస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు భూసేకరణ దశలో నిలిపివేయడంతో కుడి కాల్వకు గోదావరి జలాలు తరలించే ఎత్తిపోతల పథకం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

జలహారతి తొలివిడత ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందుతారు. గోదావరి జలాలను బొల్లాపల్లి జలాశయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించేందుకు ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణ చేపట్టారు. ఈ పనులను మూడు దశల్లో చేపట్టాలని ప్రభు త్వం నిర్ణయించింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. రూ.6020 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా రూ.465 కోట్ల పనులు పూర్త య్యాయి. రెండో ప్యాకేజీలో రెండు పంపు హౌస్ లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏర్పాటు చేయాలి. మరో 15.95 కిలో మీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్ స్టేషన్లు నిర్మిం చాలి. ఈ ప్యాకేజీలో రూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466.31 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రూ.181కోట్ల వ్యయం అవుతుందని రెవెన్యూ శాఖ అంచనా వేయగా ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. దీంతో భూ సేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ దశలో గోదావరి జలాలను బనకచర్లకు తరలించే ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ డిజైన్‌కు తుది రూపు వచ్చే వరకు భూసేక రణను వాయిదా వేశారు. దీంతో భూసేకరణను రెవెన్యూ శాఖ నిలిపివేసింది. డిజైన్‌ను ప్రకటించిన అనంతరమే భూసేకరణ ప్రారంభించాలని ప్రభుత్వం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. అమరావతి, క్రోసూరు, రాజుపాలెం నకరికల్లు మండలాల పరిధిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం కోసం రెవెన్యూ అధికారులు ఎదురు చూస్తున్నారు.



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి నాడు సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం


ప్రథమ పౌరులుగా గుర్తించాలి

- రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలి
- సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు రాజధాని గ్రామాల రైతులు వినతి
- ప్రతీ గ్రామానికి డీపీఆర్ :ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో 2014 డిసెంబరు 8 వరకు నివాసం ఉంటున్న వారిని ప్రథమ పౌరులుగా గుర్తించాలి. గత టీడీపీ ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్య, వైద్యాన్ని పునః ప్రారంభించాలి. అప్పట్లో ఇచ్చిన హెల్త్ కార్డులు ఇప్పుడు పని చేయడం లేదు. తిరిగి పథకం అమలు చేయాలి..' అని రాజధాని గ్రామాల రైతులు, కూలీలు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబును కోరారు. రాజధాని గ్రామాల రైతులు, కూలీలతో సోమవారం తుళ్లూరులోని హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు సమస్యలను రాజధాని గ్రామాల రైతులు కమిషనర్, ఎమ్మెల్యేకి ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ముంపు ప్రాంతమని అమరావతిని అవహేళన చేసిందని, ఈ పరిస్థితుల్లో పూడిపోయిన వాగులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచించారు. రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలన్నారు. రాజధానిలో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇస్తున్నారని దానిని మున్సిపాల్టీల్లో ఇస్తున్నట్లు రూ.21 వేలకు పెంచాలని సీపీఎం రాష్ట్ర సహాయక కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబురావు తెలిపారు. రాజధాని గ్రామాలలో పేదలకు ఉచిత సోలార్ పథకం అమలు చేయాలన్నారు. గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించాలన్నారు. అసైన్డ్ రైతులు కొందరికే కౌలు జమయ్యాయని మిగిలిన వారికి జమ చేయాలని దళిత జేఏసీ నేత చిలకా బసవయ్య తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రైతులు చెప్పిన సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణాలను ఎంత వేగంగా చేస్తున్నామో అంతేవేగంగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు పెదపరిమి, తాడికొండ రైతులు ముందుకొస్తున్నారన్నారు. హామీ లేకుండా రూ.25 లక్షల వరకు ఇచ్చే రుణాలను అమలు చేయాలన్నారు. గ్రామాల అప్రోచ్ రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా డీపీఆర్లు తయారు చేసి పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అమరావతి పింఛన్ అమలు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



సమావేశానికి హాజరైన రైతులు, రైతు కూలీలు



గ్రామస్థులతో సీఎం పర్యటనపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

కొత్తగొల్లపాలేనికి చంద్రబాబు

- 1న సీఎం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
- పరిశీలించిన జేసీ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే ఏలూరి

చిన్నగంజాం(పర్చూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సేవలో భాగంగా ఏప్రిల్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెం గ్రామంలో పర్యటించనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీకి చంద్రబాబు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలాన్ని ఎంపిక చేశారు. గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో, కార్యకర్తలతో ముఖాముఖి సభ వేదికలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ వద్ద గ్రామస్థులతో ఏలూరి ముచ్చటించారు. చంద్రబాబు పర్యటనను ప్రజలు పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో 100శాతం సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, నివాస గృహాలు, రైతులకు అగ్రికల్చర్ కనెక్షన్లు, యుద్ధప్రాతిపతికన ఏర్పాటు చేయాలని ఏలూరి అధికారులకు సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేవిధంగా ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల ఆర్డీవోలు చంద్రశేఖర్, గ్లోరియా, డీఎస్పీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు టాబ్లెట్ల కేసులో..

పోలీసుల అదుపులో మరొకరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మత్తు టాబ్లెట్ల కేసుకు సంబంధించి బాపట్ల రూరల్ పరిధిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల టాబ్లెట్లతో పట్టుబడిన మహిళతో పాటు, పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని విచారణ చేయగా డ్రగ్స్ అవశేషాలు కలిగిన మాత్రల వెనక జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల హస్తం ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. కానీ నిబంధనల ప్రకారం జిల్లాలోని ప్రతిషాపును జల్లెడ పట్టే అధికారం అటు ఎక్సైజ్ విభాగానికి, ఇటు సివిల్ పోలీసులకు లేకపోవడంతో డ్రగ్స్ విభాగం అధికారులతోనే దర్యాప్తును చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన ఈగల్ టీం పర్యవేక్షణతో పాటు డ్రగ్స్ విభాగం సమన్వయం చేసుకుని విచారణ ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సమస్యల చిట్టాతో..

కలెక్టర్ల సదస్సుకు..

- ఏటీఆర్‌లతో పాటు.. ప్రస్తుత ప్రణాళికలతో సిద్ధం
- జిల్లాకు సంబంధించి పలు సమస్యలపై పీపీటీ
- రేపు హాజరు కానున్న ఎస్పీ.. శాంతిభద్రతలే అజెండా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగబోతున్న మూడో కలెక్టర్ల సదస్సుకు బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యారు. జిల్లాకు సంబంధించిన కీలక అంశాలను ప్రజంటేషన్‌లో పొందుపరిచి సీఎం, మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రెటరి, వివిధ శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో నివేదించేందుకు సిద్ధమయ్యారు. సదస్సులో చర్చకు వచ్చే అంశాలపైనే గత వారం రోజులుగా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కసరత్తు చేసి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. ఇంతకుముందు రెండుసార్లు జరిగిన కలెక్టర్ల సదస్సులో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారం విషయంలో పురోగతి ఏమిటన్న దానిపై ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్టు)ను సీఎంకు అందించనున్నట్లు తెలుస్తోంది. డీఆర్సీతో సమావేశంతోపాటు జిల్లా పరిషత్ మీటింగ్‌లో జిల్లాకు సంబంధించి ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాకు సంబంధించి సవివర నివేదికను సదుస్సులో చర్చించనున్నట్లు సమాచారం. గతంలో జరిగిన సదస్సులో జిల్లాకు సంబంధించి చర్చకు వచ్చిన ధాన్యం సేకరణ, కాల్వల బాగు, పర్యాటకరంగ అభివృద్ధి విషయంలో సంతృప్తికర ఫలితాలు సాధించినట్లు కలెక్టర్ సీఎంకు వివరించనున్నట్లు సమాచారం. వేసవి నీటి సమస్య, రబీలో ధాన్యం సేకరణ, స్వర్ణాంధ్ర-2047 దిశగా తీసుకోవాల్సిన చర్యలు, పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళికలు, నిజాంపట్నం మండల పరిధిలోని దిండి వద్ద ఆక్వా పార్కు నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు ఉన్న అడ్డంకులు, నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు, సమీకృత కలెక్టరేట్ నిర్మాణం వంటి సమస్యల చిట్టాను కలెక్టర్ ఈ సదస్సులో నివేదించనున్నారు. మరమ్మతులకు నోచుకోని కాల్వల పూడికతీతకు మూడున్నర కోట్లు ఖర్చు చేసినట్లు, ఇంకా దాదాపు రూ.5 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఏటీఆర్‌లో పొందుపరిచినట్లు తెలుస్తోంది. పర్యాటకరంగ అభివృద్ధికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నందున వాటి మీద దృష్టి పెట్టాలని గత సదస్సులో సీఎం సూచించారు. దానిలో భాగంగా ఇప్పటికే రూ.40 లక్షలు నిధులు విడుదల చేయడంతో పాటు ఇటీవల చేపట్టిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని కూడా ఈ సదస్సులో కలెక్టర్ వివరించనున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో వివిధ సమస్యలపై వచ్చిన వినతుల్లో ప్రాధమ్యాలకు అనుగుణంగా 280 పనులను ఎంపిక చేసుకుని వాటికోసం ఇప్పటికే దాదాపు రూ.7 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ఏటీఆర్‌లో భాగంగా కలెక్టర్ నివేదించనున్నారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికలను 12 విభాగాలుగా విభజించి పీపీటీ రూపంలో సదస్సులో సీఎంకు వివరించనున్నట్లు సమాచారం.మోటుపల్లిలో నౌకనిర్మాణ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం అనుకూలంగా ఉండడంతో రాష్ట్రప్రభుత్వం వైపు నుంచి తీసుకోవాల్సిన చర్యల అంశం సదస్సులో భాగం కానున్నాయి

రేపు హాజరుకానున్న ఎస్పీ..

సదస్సుకు ఎస్పీ తుషార్‌డూడీ బుధవారం హాజరుకానున్నట్లు సమాచారం. జిల్లాలో క్రైం రేటును సదస్సులో ఆయన వివరించనున్నారు. కీలకమైన మూడు కేసుల సిట్ విషయంలో సారథిగా ఎస్పీ ఉన్నారు. ఇందులో రెండు నెల్లూరు కేంద్రంగా ఉన్న భూ సంబంధమైన అంశాలుకాగా, మరొకటి పల్నాడు జిల్లా పరిధిలో ఓ ప్రైవేటు చిట్ సంస్థ అక్రమాలకు సంబంధించింది. వీటి పురోగతి కూడా సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సాంకేతికతను చేరవేయటంలో కేవీకేలదే కీలక పాత్ర

లాంఫాం(తాడికొండ)మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పరి శోధనల్లో రూపుదిద్దుకున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ పేర్కొ న్నారు. సోమవారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ రమణ ఈ సందర్భంగా మాట్లాడారు. పాడి రైతులకు వ్యవసాయంలో కావాల్సిన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు కేవీకే శాస్త్రవేత్తలు ఇస్తున్నారన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కేవీకేల ద్వారా అనేక సర్టిఫికెట్ కోర్సులను అందుబాటులో తీసుకువచ్చారన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శార దా జయలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించే క్రమంలో అంతరాలను గుర్తించి వాటిని పూరించటానికి కేవీకే పనితీరు మెరుగుపరచడానికి ఎంతో కీలకమైనవని తెలిపారు. అనంతరం 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2025-26 కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బీ.రేభామణి, లాంఫాం కేవీకే అధినేత డాక్టర్ యుగంధర్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచా లకులు డాక్టర్ వీ.నరసింహారావు, ఎల్‌ఆర్‌ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దీపా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీ రమణ

వాగును కమ్మేసిన ముళ్లపొదలు

- ముందుకు కదలని నీరు
- కొద్దిపాటి వరదలు సంభవిస్తే పొలాలు ముంపునకు గురికావాల్సిందే
- కన్నెత్తి చూడని డ్రైనేజీ అధికారులు

పర్చూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వాగులో చిల్లచెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. సంవత్సరాల తరబడి వాగులో ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో కొద్దిపాటి వరదలు సంబవించినా, భారీ వర్షాలు కురిసినా వాగులో నీరు ముందుకు కదలక సమీపంలోని వందల ఎకరాల పంట పొలాలను ముంచెత్తే పరిస్థితి నెలకొంది. గత వైసీపీ పాలనలో వాగుల అభివృద్ధిని పట్టించుకోక పోవడంతో ఎక్కడ చూసినా పెద్దపెద్ద ముళ్లపొదలే దర్శనమిస్తున్నారు. వాగుల కట్టలను పటిష్ట పరచక పోవడం, అభివృద్ధి చేయక పోవడం, ఆపై ముళ్ల పొదలు పెరిగి పోవడంతో ఉన్న వాగు కాస్త కాలువను తలపించే విధంగా తయారైంది. పర్చూరు - కారంచేడు మధ్య డ్రైనేజీ కాలువ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో వాగుల అభివృద్ధి పేరుతో ఇష్టారాజ్యంగా మట్టిని త్వవ్వుకునేందుకు అనుమతించిన అధికారులు ఆపై వాగు అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఏళ్ల తరబడి వాగుల అభివృద్ధికి చర్యలు చేపట్టక పోవటం, గ్రామాల్లోని మురుగు, ఇతర వ్యర్థాలు నేరుగా వాగులోకి చేరడంతో సమస్య మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన నెలకొంది. వాగుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అనేక మార్లు రైతులు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఇదిగో అభివృద్ధి అదిగో అభివృద్ధి చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప కార్యాచరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాగులో పెరిగిపోయిన ముళ్ల పొదలను తొలగించడంతోపాటు, వాగు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎం తైనా ఉంది.


పర్చూరు వాగులో అడవిని తలపిస్తున్న ముళ్లచెట్లు


వాగు కుంచించుకుపోయి కాలువలా ఉన్న నీటి ప్రవాహం

రేపు ఐటీఐ కాలేజీలో జాబ్ మేళా

ఇంకొల్లు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మారుతీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 26వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. టెన్త్, డిప్లమో, డిగ్రీ అభ్యర్థులను సోలార్, టెక్స్‌టైల్స్‌లో ఉద్యోగాలు పొందేందుకు గోదావరి ఆంధ్ర మ్యాచువలీ ఎయిడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఆవిష్కరణ్ ఇండస్ట్రియల్, ఇండోసోలార్ కంపెనీల వారు ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. అభ్యర్థులు అర్హత సర్టిఫికెట్‌లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

మహనీయుల విగ్రహాల జోలికి వెళ్లొద్దు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలకు అవమానం కలిగించేలా వ్యవహరించడం దుర్మార్గమని దళిత బహుజన పార్టీ నాయకులు షేక్ జిలానీ అన్నారు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా నల్లచర్లలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు చెప్పులు వేసి అవమానించడం క్షమార్హమన్నారు. వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

బాధిత కుటుంబాలకు పరామర్శ

పంగులూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మంత్రి రవికుమార్ సోమవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ముప్పవరం గ్రామానికి చెందిన షేక్ అఫ్రున్‌బీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, నివాసానికి వెళ్లిన మంత్రి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మహిళా కూలీలు చింతల లక్ష్మమ్మ, వరపర్ల భారతి, పాలపర్తి సుభాషిణిలను వారి నివాసాల వద్దకు వెళ్లి పరామర్శించారు. ముప్పవరం గ్రామంలో ఇటీవల గుండె సమస్యతో మరణించిన వినుకొండ భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొండమంజులూరు మృతి చెందిన చిలుకూరి రంగయ్య దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని మంత్రి గొట్టిపాటి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, మండల నేతలు కేవీ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, బాలిన రామసుబ్బారావు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, చింతల సహదేవుడు, గరిమిడి జగన్మోహన్, మస్తాన్‌వలి, వరపర్ల సుబ్బారావు, బత్తుల వెంకటరావు, నార్నె సుబ్బారావు, బొప్పూడి నాగేశ్వరరావు, చిలుకూరి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మూగ బాలుని వైద్యానికి మంత్రి ఆదేశం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముప్పవరం గ్రామంలో మాటలు రాని కంచర్లపల్లి విశ్వనాథ్ అనే ఐదేళ్ల బాలునికి తగిన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని తన వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. ముప్పవరం గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌లో నివాసం ఉంటూ ఆటో ప్రమాదంలో మృతి చెందిన అఫ్రున్‌బీ కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం కాలనీలో నివాస గృహం పైగా ఉన్న విద్యుత్ లైన్‌తో పాటు, ప్రహరీకి దగ్గరగా ఉన్న ట్రాన్స్‌ఫారంతో ప్రమాదం పొంచిఉందని స్థానికులు సమస్యను మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే చర్యలుచేపట్టాలని సిబ్బందిని మంత్రి ఆదేశించారు. గుండె సమస్యతో మరణించిన వినుకొండ భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూటమి విజయం మాదిగలకు వరం


హర్షం వ్యక్తం చేస్తున్న మాదిగ సంఘాల నాయకులు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి విజయంతోనే వర్గీకరణ సాధ్యమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ రుణం తీర్చుకోలేనిదని ఎంఆర్‌పిస్, అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక విఠల్‌నగర్‌లో విజయ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి, మంద కృష్ణ మాదిగలను కొనియాడారు. పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, దుడ్డు వందనం, రమేష్, యేసురాజు, జేమ్స్, వెంకట్ తదతరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాయలంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు నివేదికలతోనూ, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్


శిక్షణ పత్రాలను అందుకున్న అభ్యర్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణతో కూడిన విద్యతో యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందని వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ కళాశాల అధ్యక్షుడు బండ్ల అంకయ్య అన్నారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన చెన్నైకు చెందిన ఖోఖో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కన్సల్టెన్సీ సుమారు 4 నెలల శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. అందులో పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం శిక్షణ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి చెన్నై కంపెనీ వారు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించినట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చల్లా వాసుదేవ రావు, బండ్ల రవీంద్రనాథ్, ఆదిలక్ష్మి, మల్లేశ్వరరావు, హోరాంబ, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో దంపతుల అదృశ్యం

కేసు నమోదు

అద్దంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో దంపతులు అదృశ్యంపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన ఆలకుంట వెంకటరావు, అంజలికి మూడు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. అంజలి 7 నెలల గర్భిణి. ఆదివారం అంజలి తల్లి వెళ్లి చూడగా ఇంట్లో భార్యభర్తలిద్దరూ లేరు. హాస్పటల్‌కు వెళ్లి ఉంటారని భావించారు. అయితే తిరిగి రాకపోవడంతో అద్దంకి, ఒంగోలులలోని ఆసుపత్రులకు వెళ్లి వెతికారు. ఇంట్లోకి వెళ్లి చూడగా లెటర్ కనిపించింది. ఎక్కడెక్కడ ఎంత అప్పు ఉందో రాసి ఉంది. మమ్మలను వెతక వద్దు, మేము మీకు కనిపించమని రాసి ఉంది. అదే సమయంలో ఇంటిని అమ్మి బాకీలు చెల్లించాలని రాసి ఉంది. దీంతో ఆందోళనతో కుటుంబసభ్యులు వెతికారు. కనిపించకపోవడంతో అంజలి తండ్రి కుంచాల శ్రీనివాసరావు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

క్షయ లక్షణాలను తెలుసుకుని చికిత్స పొందండి



ముప్పవరం, మార్టూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి తగిన చికిత్స పొందాలని జిల్లా వ్యాధి నిరోధకాల అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యుత్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినం సందర్భంగా సోమవారం అద్దంకి పట్టణంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలనీ డాక్టర్ మనోజ్ ప్రద్యుత్ ప్రారంభించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు మూడు నెలల నుంచి తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ లక్షణాలపై అవగాహన కలిగి ఉండి ఆశా, ఏఎన్ఎంలకు తెలియజేసి వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష, గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జయసింహ, డాక్టర్ మాధురి, వైద్యుడు డాక్టర్ హరికృష్ణ, ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ కన్యాకుమారి, ఎస్‌టీఎస్ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా ముప్పవరం గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య క్షయపై అవగాహన కల్పించారు. బీసీ వసతి గృహ బాలికలతో నిర్వహించిన ర్యాలీలో వార్డెన్ పద్మావతి, సూపర్‌వైజర్ హరిబాబు, ఏఎన్ఎం శేషకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

మార్టూరు : క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులను ఇస్తున్నదని మార్టూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరు సూపరింటెండెంట్ డాక్టరు విష్ణు తేజ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినం సందర్భంగా మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహ ర్ష ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ స్టాఫ్ వెంకటరత్నం, ఇంకా పలువురు వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ కాలువల మరమ్మతులను వెంటనే ప్రారంభించాలి

ఈఈ సతీష్

అద్దంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల మరమ్మతుల పనులు నీటి విడుదల నిలిపివేసిన వెంటనే ప్రారంభించాలని ఈఈ సతీష్ అన్నారు. అద్దంకి డివిజన్ ఈఈగా సతీష్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సోమవారం అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీల అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, యలమందయ్య లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాగు నీటి విడుదల విషయమై చర్చించగా మార్చి చివరి వరకు మాత్రమే సాగు నీరు విడుదల జరుగుతుందని, ఆ వెంటనే ఆ కాలువలలో పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. మే నెలలో తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడుదల జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏప్రిల్‌లో మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు.


ఎన్నెస్పీ ఈఈ సతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీ అధ్యక్షులు

సమస్యల వలయంలో ఆరో వార్డు


వార్డులో అధ్వానంగా డ్రెయిన్‌లు


శిథిలావస్థకు చేరిన డ్రెయిన్, పక్కన చెత్తా చెదారం

అధ్వానంగా డ్రెయిన్లు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డు సమస్యల వలయంలో ఉంది. వార్డులో పారుదల లేని డ్రెయిన్‌లు, ప్రమాద భరితమైన జంక్షన్, ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ నేతలు వార్డులో సమస్యలు గురించి పట్టించుకోలేదు. వార్డులో సుమారు 2 కిలో మీటర్ల మేర అంతర్గత రహదారులు ఉన్నాయి. వాటిల్లో చాలా వరకు దెబ్బతిన్నాయి. అయితే ఈ రహదారుల వెంబడి పూర్తి స్థాయిలో డ్రెయిన్‌లు లేవు. ఉన్న అరకొర డ్రెయిన్‌లు శిథిలదశకు చేరుకుని పారుదల లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో డ్రెయిన్‌లలో మురుగు వలన దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. శానిటేషన్ నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. కాలువల్లో పూడికలు తీస్తున్నా ఆయిల్ బాల్స్ వినియోగం లేదు. బ్లీచింగ్ చల్లడం లేదు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. వార్డులో ఎక్కువ భాగం ఇరుకు రోడ్లు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వార్డులో సమస్యలు ఇలా మోత మోగిస్తున్నా ఆ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి నేడు చైర్మన్ హోదాలో ఉన్న జంజనం శ్రీనివాసరావు వాటిపై దృష్టి సారించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చైర్మన్, మునిసిపల్ అధికారులు వార్డులో సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


వార్డులో ప్రమాద భరితంగా జంక్షన్

భార్యను చంపిన భర్తకి జీవిత ఖైదు

చిన్నగంజాం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు ఏడీజే కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. నిందితులకు శిక్ష పడడంలో సమర్థవంతంగా విధులు వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసులు తెలిపిన కేసువివరాల ప్రకారం, బాపట్ల జిల్లా, చిన్నగంజాం గ్రామంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీను తన భార్య కత్తి దుర్గను గత ఏడాది 07-06-2024న చెట్ల నరికే కత్తితో నరకంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో దుర్గ తన తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంటిలో తన బిడ్డలతో ఉంటుండగా భర్త ఇలాంటి చర్యకు పాల్పడ్డాడు. ఈఘటనపై దుర్గ తల్లి మల్లవరపు రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి అప్పటి ఎస్సై ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు విచారణ చేసి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రస్తుత ఇంకొల్లు సీఐ వై.రమణయ్య మిగిలిన దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుకు అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. నిందితునిపై నేర నిరూపణ కావడంతో న్యాయాధికారి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.1600 జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మళ్లీ.. హ్యాపీనెస్ట్

(5వ పేజీ తరువాయి)

నేలపాడు వద్ద ఓవైపు ఎన్-12, ఎన్-13ల మధ్య ఇంకోవైపు ఈ-7, ఈ-8ల మధ్య రహదారుల వెంబడి 14.46 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టింది. మొత్తం 1200 ఫ్లాట్లు.. 12 టవర్లను 2బీ+జీ+18 అంతస్తులుగా నిర్మించాలని ప్రతిపాదించింది. అప్పట్లో ప్రాజెక్టు మొత్తం ఖర్చును రూ.714 కోట్లుగా అంచనా వేసి నిర్మాణ పనులను షాపూజీ పల్లోంజీ సంస్థకు అప్పగించింది. చదరపు గజం ధరను రూ.4049 వంతున నిర్ణయిస్తూ ప్రాజెక్టును ప్రకటించగా.. జనం ఎగబడి ఇంచుమించుగా 1185 మంది ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో ప్రాజెక్టు పనులు కేవలం పైల్స్ టెస్టింగ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారంతా గగ్గోలు పెట్టారు. వీరిలో సుమారు వంద మంది కావాలని కోరడంతో రూ.25 కోట్ల మేర అడ్వాన్స్‌లను ఇచ్చేశారు. బుక్ కాని 15 ఫ్లాట్లతో పాటు వంద మంది నగదు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం 115కు పైగా ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే బుక్ అయిన ఫ్లాట్లను మినహాయించి ఖాళీగా ఉన్న ఫ్లాట్‌లను కొత్తగా బుక్ చేసుకునేవారికి మాత్రం పెరిగిన నిర్మాణ వ్యయాన్ని బట్టి ఎస్ఎఫ్‌టీ రేట్లను నిర్ణయిస్తారు. పాతవారి నుంచి మాత్రం అదనంగా పైసా కూడా వసూలు చేయరు. ప్రస్తుతం ప్రాజెక్టు స్థలంలో నెలరోజులుగా నీటి తోడివేత పనులు చేపట్టి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు రెండేళ్లకు పైబడి సాగనుండడంతో ఆ ప్రాంగణంలోనే కార్మికులు నివాసం ఉండేందుకు వీలుగా తాత్కాలిక షెడ్లను కూడా నిర్మించారు. భవన నిర్మాణపనులను ఆరంభించేందుకు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు.

రెండేళ్లలో పనులు పూర్తి

ఈ ప్రాజెక్టులో 1225, 2750 చదరపు అడుగుల విస్తీర్ణం కల ఫ్లాట్లు ఉన్నాయి. ఇందులో 144 ఫ్లాట్లు డబుల్ బెడ్ రూమ్‌వి కాగా, 1036 ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లుగా ఉంటాయి. మొత్తం విస్తీర్ణంలో అత్యధిక భాగం ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రోడ్ల కోసమే వినియోగించేలా ప్రణాళికను రూపొందించారు. ఒక్కో అంతస్తులో రెండేసి పార్కింగ్ ఫ్లోర్‌లకు స్థానం కల్పించి మొత్తం 12 టవర్లలో కలిపి 1631 కార్లు, 1200 బైకులను పార్కింగ్ చేసుకునేలా వెసులుబాటును కల్పిస్తున్నారు. ఇవిగాక మరో రెండు ఎమినిటీస్ బ్లాకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

దివ్యాంగుని పెన్షన్ నిలిపివేశారంటూ కలెక్టర్‌కు వినతి

బాపట్లరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నా కుమారుడు పులుగు వెంకటనారాయణ పుట్టకతోనే వికలాంగుడు. అయితే తనకు వస్తున్న పెన్షన్‌ను ఇటీవల నిర్వహించిన సర్వే వలన ఆపేస్తామంటూ అధికారులు తెలపటంతో తమకు న్యాయం చేయాలంటూ సోమవారం కలెక్టర్‌కు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వికలాంగుని తండ్రి గోపాళం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో విలేకర్లతో మాట్లాడుతూ చీరాల మండలం కావూరి వారిపాలెంకు చెందిన నాకు పుట్టకతోనే కుమారుడు వికలాంగుడు నేను కూలి పనిచేసుకుంటూ అతని బాగోగులు చూచుకుంటూ ఉండేవాడిని 2009 నుంచి ఫించన్‌ను వస్తున్నది. అయితే ఇటీవల నిర్వహించిన సర్వేలో హ్యాండీక్యాప్ సర్టిఫికెట్ లేదని పెన్షన్ రాకపోవచ్చుఅని అధికారులు తెలపటం జరిగిందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు చెప్పటం జరిగిందని తెలిపారు.


కలెక్టరేట్ ఆవరణంలో విలేకరులతో మాట్లాడుతున్న దివ్యాంగుడు, తండ్రి గోపాళం

చీరాలలో జోరందుకున్న క్రికెట్ బెట్టింగ్

- అత్యాశకు లోనై.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న యువత
- రెండు నెలల్లో రూ. కోట్లల్లో పందేలు జరిగే అవకాశం!
- పోలీసులు దృష్టి సారించకుంటే ప్రమాదమే

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఊపందుకున్నాయి. దాదాపుగా రెండు మాసాలు ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లను కొందరు వినోదం కోసం చూస్తుంటే.. మరి కొందరు సులభంగా డబ్బు సంపాదించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈక్రమంలో క్రికెట్ మ్యాచ్‌లను వేదికగా మలుచుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అయితే అమాయకుల ఆశలను ఆసరాగా చేసుకుని బుకీలు డబ్బులు దండుకుని సామాన్యులను మోసగిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే ఈ రెండు మాసాల్లో చీరాల నియోజకవర్గ పరిధిలోని బెట్టింగ్‌లు రూ.కోట్లలో చేరే అవకాశం ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. బెట్టింగ్ వ్యసనాలకు బానిసలుగా మారిన యువత, జూదరులు ఉన్న కాడకి ముట్ట చెప్పుకుంటున్నారు. హద్దు దాటాక వాహనాలు, స్థిరాస్తులు వంటివి సర్వస్వం వదిలేసుకుంటున్నారు. ఈక్రమంలో అప్పులు ఊబిలోకి చేరి ఐపీలు పెట్టడం, బలవన్మరణాలకు పాల్పడడం వంటి ఘటనలు మనం చూస్తున్నాం.

పూర్తి స్థాయిలో నిఘా



ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అలాగే కొన్ని నిర్దేశిత ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తంలో లావాదేవీల డేటాను సేకరిస్తున్నాం. నేరస్థులు తప్పించుకోలేరు. యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలి.

- ఎండీ మొయిన్, డీఎస్పీ, చీరాల



రామాపురం రిసార్ట్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్, ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్

చాపకింద నీరులా..

బెట్టింగ్‌లు ఒకప్పుడు చీరాల పట్టణంలో లేదా పేరాల, వేటపాలెం, జాండ్రపేట, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాలలోనే ఉన్నాయి. కానీ తాజాగా ఈ వ్యసనాలుకు గ్రామీణ యువకులు సైతం బానిసలుగా మారుతున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో మాత్రమే బెట్టింగ్‌లు జరిగేవి. ఇప్పుడు సెల్‌ఫోన్ ఉన్న యువత వాట్సాప్, బెట్టింగ్ యాప్ వంటి వాటికి చేరువయ్యారు. దీంతో బంతి బంతికీ పందేలు కడతారు. చీరాల పరిధిలోని రిసార్ట్స్ లాడ్జీలు, బార్‌లు, ఎంజీసీ మార్కెట్ పరిధిలోని కొందరు యువత, విద్యార్థులు, క్రికెట్ వీరాభిమానులు బెట్టింగ్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు వినిపిస్తుంది.

పాత, యాక్టివ్ పాత్రలపై దృష్టి సారించాలి

చీరాల పరిధిలో ఇప్పటికే జాండ్రపేటకు చెందిన ఓ వ్యక్తి అత్యున్నత స్థాయిలో బుకీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పేరాలలో మరో ఇద్దరు, వేటపాలెం, జవహర్‌నగర్, ఈపూరుపాలెం, గ్రామీణంలో అక్కడక్కడా యువత బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. ఈక్రమంలో పోలీసులు బెట్టింగ్‌పై కచ్చితంగా దృష్టి సారించాల్సిందే. అలాగే పాత, కొత్తగా ఫీల్డ్‌లోకి రంగ ప్రవేశం చేసిన వారిపైనా కన్నేయాలి. లేకుంటే ఎందరో జీవితాలు తారుమారయ్యే అవకాశం లేకపోలేదు. బుకీలకు పాల్పడే వారు ప్రత్యేకమైన ఫోన్ నెంబర్‌లను వాడుతున్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే అరగంట ముందు మాత్రమే ఆ నెంబర్‌ను వినియోగాస్తారు. మిగిలిన సమయమంతా ఆ నెంబర్ ఆఫ్‌లోనే ఉంటుంది. ఆన్ చేసిన సమయంలో గతంలో వారి వద్ద ఫీడ్ అయిన, వారి పాత పరిచయస్తుల నెంబర్‌లకు మాత్రమే ఆన్సర్ చేస్తారు. కొత్త నెంబర్‌లకు రెస్పాండ్ కాకుండా జాగ్రత్త పడతారు.



గతంలో అరకొర కేసులు

గతంలో చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జంజనం కాంప్లెక్స్‌లో యథేచ్ఛగా కొంతకాలం బెట్టింగ్ జరిగింది. దీంతో ఎట్టకేలకు పోలీసులు దాడులు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే టీవీతో పాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా చూసుకుంటే ఆ స్టేషన్ పరిధిలో 2016, 2021 సంవత్సరాల్లో వేటపాలెంలో 2021, 23లో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఇక చీరాల రూరల్, టూటౌన్ పరిధిలో కేసులే లేవు. ఈ మధ్య కాలంలో అసలు దాడులే చేయలేదు. దీంతో బెట్టింగ్ రాయుళ్లకు, బుకీలు పోలీసుల శైలిని అలుసుగా తీసుకొని వారి దందా కానిస్తున్నారు. ఏదేమైనా పోలీసులు ఈసారి క్రికెట్ బెట్టింగ్‌లపై కన్నెర్ర చేయకుంటే ఎన్నో దారుణాలు చూడాల్సి వస్తుంది.

ఆకస్మిక దాడులు

క్రికెట్ బెట్టింగ్‌లు జోరుకుందుంటున్న నేపథ్యంలో సోమవారం రాత్రి ట్రైనీ డీఎస్పీ అభిషేక్ ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్‌తో కలిసి రామాపురం, వాడరేవు తీరప్రాంతాల్లో లాడ్జిలు, రిసార్ట్‌లల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడి రికార్డులను పరిశీలించి, అనుమానితుల వివరాలను తెలుసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకులకు రూములు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సూరవరపుపల్లి చెరువుకు వాగు నుంచి చేరుతున్న సాగర్ జలాలను పరిశీలిస్తున్న గ్రామస్థులు

సూరవరపుపల్లి చెరువుకు సాగర్ జలాలు

ఎమ్మెల్యే ఏలూరి సూచనలతో కదిలిన నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలోని చెరువుకు దాదాపుగా కిలోమీటర్ దూరంలో ఉన్న వాగు నుంచి సాగర్ జలాలను సోమవారం నింపుతున్నారు. వాస్తవానికి గ్రామంలోని చెరువుకు డైరెక్టగా సాగర్ జలాలు చేరే అవకాశం లేదు. గ్రామ పంచాయతీ వారు చెరువులోని నీటిని సమీపంలోని బావిలోకి పంపింగ్ చేసిన తర్వాత మరల బావి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించి అక్కడ నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన కొళాయిల ద్వారా ప్రజలకు తాగునీటిని విడుదల చేస్తుంటారు. అయితే గత నెల రోజుల నుంచి చెరువులోని నీరు పూర్తిగా అడుగంటిపోయాయి. దాంతో ఈ వేసవిలో గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని టీడీపీ గ్రామ నాయకులు కోయ సతీష్, కోయ శరత్ బాబు, ఇంటూరి వినయ్, వసంతరావు, నాగేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో గ్రామ సమీపంలోని వాగుకు ప్రస్తుతం విడుదల చేసిన సాగర్ జలాలు చేరుతుండడంపై, వాగు నుంచి నీటిని చెరువుకు పంపించాలని, అందుకు సంబంధించి గ్రామ నాయకులకు సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్యకు ఏలూరి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుంచి టీడీపీ నాయకులు వాగు నుంచి పైపులు ద్వారా ప్రత్యేకంగా చెరువుకు నీటిని పంపిస్తున్నారు. దాదాపుగా వారం రోజులు వాగు నుంచి చెరువుకు నీటిని పంపిస్తే ఎండాకాలంలో గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని గ్రామస్థులు చెప్తున్నారు. ఈ వేసవి కాలంలో మాత్రం గ్రామంలో మంచినీటి సమస్య తీరినట్లేనని గ్రామస్థులు అంటున్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో కే కుసుమకుమారి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీ-4 సర్వే పూర్తయితే గ్రామ సభలు నిర్వహించారు. అలానే పీజీఆర్ఎస్ సర్వే చేసి గతంలో ఫిర్యాదులు చేసిన వారితో సంతకాలు పెట్టించాలన్నారు. అలానే గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాన్నారు. గ్రామాలలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికల దాతల సహాయంతో చలి వేంద్రాలను ఏర్పాటు చేయించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిరు పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని కాలయాపన చేసి మోసగించిందని, కూటమి ప్రభుత్వమైనా ఆదుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆమంచి కృష్ణమోహన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో స్లిప్పులు మాత్రమే అందాయని, ప్రతిసారి సామాన్యులకు ఆశే తప్ప ఆదరణ లేదని నాయకులు అన్నారు. అనంతరం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. బాబూరావు, వసంతరావు, జయరాజ్, ఐవీ ప్రసాద్, సుధాకర్, ఖాలేషా, కోటేశ్వరమ్మ, లక్ష్మీ, ఏసుపాదం, పవన్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాంబయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, మహిళలు పాల్గొన్నారు.

మార్టూరు : ఇంటి స్థలాలను మంజూరుచేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ టీ ప్రశాంతికి మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జనార్దన్‌నగర్ వాసులు వినతిపత్రం అందచేశారు. సీపీఎం మండల శాఖ కన్వీనర్ బత్తుల హనుమంతురావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ వాసు లు చినఅంజయ్య, రామాంజి, రాజమ్మ, వీరాంజి,కోటేశ్వరయ్య పాల్గొన్నారు.

జేకేసీ శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలి



కేఆర్‌కేలో జేకేసీ గ్రాండ్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలోని జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) ద్వారా అందించే శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగపర్చుకుని తద్వారా ఉపాధి అవకాశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు సూచించారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేకేసీ ఆధ్వర్యంలో 2024-25 శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఆంగ్లభాషపై పట్టు సాధించడం ద్వారా ఇంటర్వ్యూలలో విజయం సాధించడం సులభతరం అవుతుందని జేకేసీ కోఆర్డినేటర్ ఎన్.షర్మిల రాణి అన్నారు. ప్రతి ఏడాది శిక్షణపూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించి, సర్టిఫికేట్‌ను అందించడంతో పాటు జాబ్ డ్రైవ్ నిర్వహిస్తారని తద్వారా ఉద్యోగం సులభంగా పొందవచ్చని జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జూమ్, మాక్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ వంటివి నిర్వహించారు.

శ్మశాన అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు

మేదరమెట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మేదరమెట్లలో శ్మశాన అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు చేశారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ మృతి చెందారు. వైవీ సోదరులు తల్లి అంత్యక్రియలను మేరదమెట్లలో నిర్వహించారు. మేదరమెట్లలో పలు అభివృద్ధి పనులకు గతంలో నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉండగా మేదరమెట్లలో కల్యాణ మండపం నిర్మించారు. సుబ్బారెడ్డి తండ్రి చినపోలిరెడ్డి జ్ఞాపకార్థం ఆసుపత్రిని నిర్మించారు. ఇటీవల డిజిటల్ లైబ్రరీ భవనంలో అదనపు గది నిర్మాణానికి సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి నిదులిచ్చారు. మేదరమెట్ల తూర్పుపాలెంలో శ్మశానం ప్రహరీగోడ, గదినిర్మాణం, రహదారి అభివృద్ధికి రూ.30 లక్షలు రాజ్యసభ నిధుల నుంచి మంజూరు చేశారు. నిధులు కేటాయించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌లో నమూనాలను పరిశీలిస్తున్న సీఐ శేషగిరిరావు, శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ రవికుమార్

ప్రయోగాలపై పరిజ్ఞానం అవసరం

విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌లో సీఐ శేషగిరిరావు

మార్టూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త విషయాలని తెలుసుకోవాలి, వాటిని కనుగొనాలి, పరిశోధనాత్మకమైన పరిజ్ఞానంపై విద్యార్థి దశలోనే ఆలోచనలు కలగాలని సీఐ ఎం.శేషగిరిరావు అన్నారు. సోమవారం మార్టూరులో శ్రీహర్షిణి విద్యాసంస్థలో హైస్కూలు విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. విద్యార్థులు కలిసి మెలిసి తయారుచేసిన 67 నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి సీఐ ఎం.శేషగిరిరావు, శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, రోటరీ మాజీ అధ్యక్షుడు జాష్టి సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనలను తిలకించారు. సాంకేతికంగా, శాస్త్రపరంగా విద్యార్థుల ఆలోచనలకు రూపకల్పన చేసి, వారి చిన్న బుర్రలో పెద్ద పెద్ద ఆలోచనలతో చేసిన ప్రయోగాత్మకాలను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఆలోచనలు చేయాలని ప్రోత్సహించారు. చంద్రయానం, విద్యుత్ ఆదా తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. వారికి సైన్స్ ఉపాధ్యాయినులు నీలిమ, అనూష్, సురేష్ తదితరులు మార్గదర్శకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఏవో అజయ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రపంచ అధ్యయనం



ప్రిన్సిపాల్ మురళికి సాహిత్య పుస్తకాలను అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాల పఠనంతో ప్రపంచాన్ని అధ్యయనం చేయవచ్చని. యువతరం ప్రత్యేకమైన పుస్తకాలపై దృష్టి సారించాలని తిరుపతి తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మురళి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనంపై ప్రణాళిక ఉండాలన్నా రు. అలాగే ప్రపంచంపై పట్టుతో పాటు ప్లాస్టిక్‌పై యువత పోరుబాట పట్టాలన్నారు. అనంతరం కళాశాల లైబ్రరీకు విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా.వెంకట కృష్ణయ్య, డా.ఎస్ శ్రీకాంత్, డా.నాగేశ్వరరెడ్డి, రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నీలా కుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొండమంజులూరులోని శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. గ్రామంలో పునర్ నిర్మించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి గొట్టిపాటి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి గొట్టిపాటికి ఆలయ అర్చకస్వామి ఆశీర్వచనం అందచేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, బత్తుల వెంకటరావు, మొప్పూడి వీరయ్య, దొప్పలపూడి వీరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై హర్షం

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ముగింపు చెప్తూ కేబినెట్ కమిటీ ఆమోదించిన సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస సీనియర్ నాయకుడు పూనూరి నరేంద్ర, ఎంఈఎఫ్ గౌరవ అధ్యక్షుడు పసుమర్తి కోటయ్య, అనపర్తి రమేష్, గంగవరపు సిద్దు, వంగివరపు రమేష్, చక్రవర్తి, కోటేశ్వరరావు, సాల్మన్, ఉదయ్ కుమార్, అనిల్ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు

వడ్డీలేని రుణాలతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే కొండయ్య
- పొదుపు సంఘాలకు రూ.20లక్షల చెక్కుల అందజేత

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలో అందించే వడ్డీలేని రుణాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకం ద్వారా నియోజకవర్గంలోని 12 మంది స్వయం సహాయక సభ్యులకు రూ.20లక్షలు ఎస్సీ కార్పొరేషన్ వడ్డీలేని చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా అందించే రుణాలతో జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుని సంతోషంగా జీవించాలని కోరారు. అలాగే పొదుపు సంఘాల మహిళలకు రుణాలు కల్పించి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ సుబ్బారావు, ఫణి, వెలుగు ఏపీఎంలు మధు, అంజిబాబు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన వెలుగు అధికారులు

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

వేటపాలెం కాంగ్రెస్ పార్టీకు చెందిన 20 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లప్రోలు శ్రీను, కొత్త నాగు ఆధ్వర్యంలో చేరిన ప్రతినిధులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొండయ్య వారికి సూచించారు.

అన్యాక్రాంతాలపై చర్యలు తీసుకోండి

మునిసిపల్ పరిధిలోని 31,32,33 వార్డుల్లో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారని, 31వ వార్డు కౌన్సిలర్ సల్లూరి సత్యానందం ఎమ్మెల్యే కొండయ్యకు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి వార్డుల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రికవరీ చేసిన వాటిల్లో నిరుపేదలకు స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యేను కౌన్సిలర్ కోరారు.



చక్రాయపాలెంలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పారిశుధ్యం మెరుగునకు సహకరించండి

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చేపడతున్న కార్యక్రమాలకు గ్రామస్థులంతా సహకరించాలని ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు కోరారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న పేడ దిబ్బలను, చెత్త చెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అన్ని గ్రామాలల్లో రోడ్డు వెంబడి ఎటువంటి దిబ్బలు, చెత్త చేదారం ఉన్న తొలగించడం జరుగుతుందని అందుకు ప్రజలు ముందుగానే వాటిని తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్లా నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.



చిన్నగంజాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

మామిడిలో సస్యరక్షణపై అవగాహన

చిన్నగంజాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) మామిడి పంటలో సస్యరక్షణ చర్యలపై సోమవారం చిన్నగంజాంలో ఉద్యానవనశాఖ అధికారి లేఖ్య అధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల పరిశోధన కేంద్రానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు ప్రస్తుత పంట పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మామిడి పూత పిందె కాయ దశలో ఉందన్నారు. కాయలు రాలకుండా ప్లానోఫిక్స్ ఒక మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఒక వేళ మాడిమి తోటలో తామర పురుగు ఉన్నట్లతే దాని నివారణకు వేప నూనె 10,000 పీపీఎం మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ కిషోర్, విహెచ్ ఏ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవకులకు ఉత్తమ అవార్డులు

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ క్షయ నిర్మూలన దినము సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఉత్తమ సేవలందిస్తున్న అధికారులు అవార్డులకు ఎంపికయ్యారు. సోమవారం బాపట్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ అధికారులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అద్దంకి మండలంలోని మోదేపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న షేక్ అబ్దుల్ సత్తార్ ఉత్తమ ఆరోగ్య పర్యవేక్షకునిగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అద్దంకి టీబీ యూనిట్‌లో పనిచేస్తున్న బీ రాజశేఖర్‌కు ఉత్తమ సీనియర్ టెక్నికల్ సూపర్‌వైజర్‌గా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్, రాజశేఖర్‌లను పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది అభినందించారు.




జిల్లా వైద్య అధికారి డాక్టర్ విజయమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అబ్దుల్ సత్తార్



వెంకటేశ్వర్లుకు ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డును అందజేస్తున్న విజయమ్మ

వెంకటేశ్వర్లుకు ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డ్


బల్లికురవ : ప్రపంచ టీబీ డే సందర్భంగా గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కే వెంకటేశ్వర్లును ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డుతో సోమవారం ఘనంగా సత్కరించారు. గుంటుపల్లి పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు చేసేందుకు అన్ని వసతులు ఉండడంతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ విధులలో బాధ్యగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తుండడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించి జిల్లా కేంద్రం బాపట్లలో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్వర్లును వైద్యాధికారులు రమీజ్ అహ్మద్, రవితేజ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీబీ ఆఫీసర్ మహ్మద్ సాదిక్ మలేరియా అధికారి గోపీనాథ్ పాల్గొన్నారు.



13న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

నెల్లూరు (హరనాథపురం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ కో ఆర్డినేటర్ టి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మొదటి సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ పరీక్ష 13వ తేదీకి వాయిదా పడిందని పద్మజ పేర్కొన్నారు.

అక్కరకు రాని ఆరోగ్యశ్రీ



ఇటీవల కావలికి చెందిన ఒక వ్యక్తి నెల్లూరుకు వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యాడు. ఆయన్ను 108లో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యానికి ఎంత ఖర్చు అవుతుందో ఆసుపత్రి వర్గాలు క్షతగాత్రుడి భార్యకు చెప్పాయి. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే తీసుకురండని చెప్పారు. కళ్లలో నుంచి ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ ఇంటికి వెళ్లిన ఆమెకు ఆరోగ్యశ్రీ కార్డు ఎక్కడుందో కనిపించలేదు. ఎంత ఆలోచించినా స్ఫురణకు రాలేదు. పరుగున మళ్లీ ఆసుపత్రికి చేరుకుని విషయం చెప్పింది. ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఆ కుటుంబ యజమానురాలి పేరుతో కార్డు ఉంది. ప్రాణం లేచి వచ్చినట్లు ఊపిరి పీల్చుకుంది. అంతలోనే మరో కబురు. ఆన్‌లైన్‌లో ఉంటే సరిపోదు.. ఒరిజనల్ కార్డు ఉండాల్సిందేనని ఆసుపత్రివర్గాలు చెప్పడంతో ఏం చేయాలో దిక్కుతోచలేదు. అసలే పేద కుటుంబం. అద్దె ఇళ్లలో జీవనం. ఇల్లు మారే క్రమంలో ఎక్కడైనా మిస్ అయ్యిందో ఏమో ఎంత వెతికినా ఆరోగ్యశ్రీ కార్డు కనిపించలేదు. కార్డు కోసం సచివాలయానికి పరుగులు తీసిందా ఇల్లాలు. వారూ చేతులెత్తేశారు. 'ఇదివరకులా కార్డులు డౌన్‌లోడ్ కావమ్మా.. మేము ఏమి చేయలేమన్నారు. అప్పుడు మా పక్కంటోళ్లకు తీసిచ్చావు కదన్నా! అని అడిగింది. అప్పట్లో వచ్చేవి. ఇప్పుడు రావడం లేదు' అని సమాధానం చెప్పారు. ఇక ఆ మహిళ ఆరోగ్యశ్రీ కోసం ఆలోచించలేదు. జీవితకాలమంతా పోగుచేసుకున్న సొమ్ముతో కొన్న నగనట్రా అమ్మేసి భర్తకు వైద్యం చేయించుకుంది.

- ఒరిజినల్ కార్డు ఉంటేనే వైద్యం
- నెంబర్, నకలు ఉంటే సరిపోదట
- వ్యాధిగ్రస్థులకు తేల్చిచెబుతున్న ఆసుపత్రివర్గాలు
- కార్డు డౌన్‌లోడ్‌ను ఆపేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ, ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం
- సచివాలయ సిబ్బంది వినతులూ బేఖాతరు
- అప్పులను పోగొట్టుకోలేక పేదల అవస్థలు
- ఆస్తులు, ఆభరణాలు తెగనమ్మి వైద్యం పొందుతున్న వైనం

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : స్థిరాస్తికి సంబంధించిన దస్తావేజులు దారిపోతే రిజిస్ట్రేషన్ కార్యాలయంలు నకలు తీసుకోవచ్చు. ఆధార్ కార్డు కనిపించకుండాపోతే మరొకటి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నెంబరు ఉంటే చాలు రేషన్ కార్డు లేకపోయినా నిత్యావసరాలు పొందవచ్చు. అవసరం అనుకుంటే సచివాలయానికి వెళితే కొత్త కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కానీ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రాణాధారమైన ఆరోగ్యశ్రీ కార్డు పొరపాటున మిస్ అయితే ఇక ఆరోగ్యశ్రీలో వైద్యం మరచిపోవాల్సిందే. మరోమార్గంలో ఉచిత వైద్యం పొందాలంటే వ్యాధికన్నా తీవ్ర నరకయాతన అనుభవించాల్సిందే. ఆరోగ్యశ్రీ కార్డు అదృశ్యమైతే మరొకటి డౌన్‌లోడ్ చేసుకోవడం సాధ్యం కాదు. ఒరిజినల్ కార్డు చూపనిదే ఆరోగ్యశ్రీ తరఫున వైద్యమూ దొరకదు. నకలు కార్డు చూపినా, ఆన్‌లైన్‌లో రోగి తాలూకు పేరు ఉన్నా ఆసుపత్రిలో అడ్మిషన్ వరకు ఓకే. ఆ తర్వాత వైద్యసేవలు పొందాలంటే ఒరిజినల్ కార్డు తప్పనిసరి అంటున్నాయి ఆసుపత్రి యాజమాన్యాలు. అయితే, ఆరోగ్యశ్రీ అధికారులు మాత్రం 'అబ్బే.. అలా ఏం లేదే!' అని సర్దిచెబుతున్నారు. పోనీ మరో కార్డు డౌన్‌లోడ్ చేసుకుందామంటే సాధ్యపడదు. ఆ కార్డు డౌన్‌లోడ్ కాదు. ఇందుకు ఎప్పటినుంచో ఇలాగే ఉందా!? రాష్ట్రంలో ప్రభుత్వం మారిన క్రమంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన పలు కార్యక్రమాలను కొద్ది రోజులు స్తంభింపజేశారు. ఆ తరువాత అవి మామూలు స్థితికి వచ్చాయి. వైసీపీ హయాంలో ఉన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంగా మార్పు మార్చారు. అయితే, ఆరోగ్యశ్రీ కార్డుల వ్యవస్థలో మాత్రం ఇప్పటికీ స్తబ్దత కొనసాగుతూనే ఉంది. కొత్త కార్డులు ఇవ్వలేరు. పాత కార్డులను డౌన్‌లోడ్ చేసుకోలేరు. ఏమైనా మార్పు, చేర్పులు చేయలేరు. దీంతో ఒరిజనల్ కార్డులు పోగొట్టుకున్న పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యం కోసం నరకం అనుభవిస్తున్నారు. ఆరోగ్యశ్రీ అక్కరకు రాకపోవడంతో జీవితకాలం పొదుపు చేసుకున్న డబ్బులనో, ఆస్తులనో, ఆభరణాలనో అయిన కాడికి తెగనమ్మి వైద్యం చేయించుకొంటున్నారు.



డౌన్‌లోడ్ ఆపడంతోనే సమస్య

గతంలో సచివాలయాల్లో ఆరోగ్యశ్రీ కార్డును డౌన్‌లోడ్ చేసి ఇచ్చే అవకాశం ఉండేది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి ఆరోగ్యశ్రీ కార్డులు సచివాలయంలో డౌన్‌లోడ్ కాకుండా నిలుపుదల చేశారు. దీనివల్ల ఈ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. డౌన్‌లోడ్ అవకాశాన్ని తిరిగి పునరుద్ధరించమని పలుమార్లు ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని కోరినా ఆ సౌకర్యాన్ని పునరుద్ధరించలేదని సచివాలయ సిబ్బంది అంటున్నారు. ప్రభుత్వం ఏ కారణంతో డౌన్‌లోడ్ ఫెసిలిటీని ఆపేసిందో తెలియదు కానీ దీనివల్ల పొరబాటునో, గ్రహపాటునో ఆరోగ్యశ్రీ కార్డులు పోగొట్టుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలి

ఒకవేళ ఇప్పట్లో ఒరిజినల్ కార్డుల డౌన్‌లోడ్ అవకాశం కల్పించలేని పక్షంలో ఆన్‌లైన్ కార్డుతో వైద్యం చేయాలని ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే ఆసుపత్రులను ప్రభుత్వం ఆదేశించాలి. ఈ విషయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆసుపత్రుల్లోని ఆరోగ్యశ్రీ కౌంటర్ల వద్ద ఒరిజినల్ కార్డు లేకున్నా వైద్యం అందుతుందన్న విషయాన్ని తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేసేలా ఆసుపత్రి వర్గాలను ఆదేశించాలి. లేని పక్షంలో దురదృష్టవశాత్తు కార్డు పోగొట్టుకున్న ప్రజలకు అన్యాయం జరుగుతుంది. వైద్య సేవలు అందించడంలో ఆలస్యం జరుగుతుంది.

కోటకు చెందిన ఓ వ్యక్తి గుండెపోటుతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. స్టంట్ వేయాలని వైద్యులు సూచించారు. ఇప్పుడు మళ్లీ అదే సీన్. ఒరిజనల్ కార్డు లేకపోతే మరో పద్ధతి ఉందని సీఎంసీఓ లేఖ గురించి చెప్పారు. అది కావాలంటే తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లాలి. ఆయన దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నారని సర్టిఫై చేస్తూ ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. ఇది కావాలంటే తహసిల్దార్ కన్నా ముందు వీఏఓ ఎక్కడున్నాడో ఆయన్ను ప్రసన్నం చేసుకోవాలి. ఈ లెటర్ తీసుకొని ఆరోగ్యశ్రీ సిబ్బందికి ఇవ్వాలి. వారు దానిని జిల్లా ఆరోగ్యశ్రీ కార్యాలయానికి పంపుతారు. వారు సీఎంసీఓ లెటర్ ఇస్తారు. అక్కడనుంచి అనుమతి వచ్చిన తరువాత వైద్యం మొదలు పెట్టాలి. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిక వ్యక్తి ఇవన్నీ చేసుకొని రాలేక, అంతవరకు ప్రాణం ఉంటుందో పోతుందో తెలియక స్థోమత లేకున్నా సొంత ఖర్చులతో వైద్యానికి సిద్ధపడ్డారు. ఒరిజనల్ ఆరోగ్యశ్రీ కార్డు పోగొట్టుకున్న రోగులు పడుతున్న పాట్లకు ఇవి ఉదాహరణలు మాత్రమే.

ఏ సమస్య ఉన్నా ఫోన్ చేయండి

ఒరిజినల్ ఆరోగ్యశ్రీ కార్డును పోగొట్టుకున్నంత మాత్రాన ఆరోగ్యశ్రీ వైద్యం ఆగదు. ఒరిజనల్ కార్డు లేనివారికి సీఎంసీఓ లెటర్ ద్వారా ఆరోగ్యశ్రీ వైద్యం చేయిస్తున్నాము. అయితే ఈ లెటర్ ఎక్కడ పొందాలి ఎలా పొందాలి అనే విషయంలో ఏమైనా అనుమానాలు ఉన్నా, లేదా ఆరోగ్యశ్రీ ఒరిజనల్ కార్డు లేని కారణంగా ఉచిత వైద్యం అందడం లేదనే పిర్యాదులు ఉన్నా 9281068169 నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందలే చర్యలు తీసుకుంటాము. ఈ ఫోన్ నంబర్‌ను నెట్వర్క్ పరిధిలోని ఆసుపత్రుల వద్ద ప్రచారంలోకి తెస్తాము. ఆరోగ్యశ్రీ ఒరిజనల్ కార్డు లేదు కాబట్టి ఉచిత వైద్యం అందదేమో అనే ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- సుధీర్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోర్డినేటర్



పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు

నేడు, రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

నాలుగు కేంద్రాల్లో నిర్వహణ ● కట్టుదిట్టంగా ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్సీ పరీక్షలను జిల్లాలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఉదయబాస్కర్‌రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 4 కేంద్రాల్లో 2 వేల మందికిపైగా హాజరయ్యే ఈ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు బందోబస్తుతోపాటు మహిళా పోలీసులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి సెంటర్‌లోనూ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ ప్రతినిధి గిరిజారాణి, పరీక్ష కేంద్రాల కళాశాలల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలెక్టర్ల సదస్సు

అమరావతికి చేరుకున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో మంగళ, బుధవారాల్లో జరిగే కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు కలెక్టర్ ఆనంద్ సోమవారం అక్కడకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది మూడో సదస్సు. తొలి సదస్సులో ప్రభుత్వం తమ లక్ష్యాలను వివరించగా, రెండో సదస్సులో జిల్లాస్థాయిలో రానున్న ఐదేళ్లలో చేయాల్సిన అభివృద్ధికి సంబంధించి సీఎం దిశానిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని ఆ సదస్సులో ఆదేశించారు. ఇప్పుడు జరగనున్న మూడో సదస్సులో జిల్లా విజన్ ప్లాన్‌లపై సమీక్ష జరగనుంది. గత సమావేశం తర్వాత జిల్లాస్థాయిలో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ తయారు చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ వర్గాల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని వాటన్నిటినీ క్రోడీకరించి 2025-26 యాక్షన్ ప్లాన్‌ను కలెక్టర్ రూపొందించారు. వ్యవసాయం, పరిశ్రమలు ప్రధానంగా రానున్న ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా ఈ యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. దీనిని సదస్సులో కలెక్టర్ ప్రదర్శించనున్నారు. తొలిరోజు మధ్యాహ్నం వరకూ సీఎం ప్రసంగంతోపాటు రాష్ట్ర స్థాయి హెచ్‌వోడీల ప్రెజంటేషన్ ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత జిల్లాలపై సమీక్ష జరుగుతుంది. కాగా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సంబంధించి కలెక్టర్ ఆనంద్ పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాలేదు.

16 మండలాల్లో శనగల కొనుగోలు కేంద్రాలు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లో శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్ తెలిపారు. సోమవారం ఉదయగిరిలోని కమ్మవారిపాళెం సొసైటీ కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో పవన్ మాట్లాడుతూ క్వింటం రూ.5,650 మద్దతు ధరతో నిర్దేశించిన ప్రమాణాలు పాటిస్తూ రైతుల నుంచి శనగలు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల ద్వారా 2 వేల టన్నుల శనగ దిగుబడులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ.చెన్నారెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ సీఈవో లోక్‌నాథరెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ వేణు, టీడీపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, చుండి అంజిరెడ్డి పాల్గొన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : విరువూరు రైతుసేవా కేంద్రంలో కంది, శనగ కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటం కందికి రూ.7,550, శనగకు రూ. 5,650వంతున కనీస మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రవికుమార్, డీసీఎంఎస్ నిర్వాహకులు సుధాకర్, పాల్గొన్నారు.



వరికుంటపాడు : విరువూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పవన్‌కుమార్

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (మంగళవారం సాయంత్రం)
సహరి : 4.54 (బుధవారం ఉదయం)

భూగర్భ జలం.. పుష్కలం!

సరాసరి 5.96 మీటర్ల లోతులోనే నీరు ● ఇప్పటి వరకూ అధిక వర్షపాతం నమోదు

ప్రస్తుతం ప్రాజెక్టుల్లో దండిగా నీరు ● వేసవిలో మంచినీటికి తప్పనున్న ఇక్కట్లు



నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూగర్భ జలమట్టం ఆశాజనకంగా ఉంది. గతేడాది భారీగా వర్షాలు కురవడంతో ఈ ఏడాది తక్కువ లోతులోనే భూగర్భ జలాలు ఉన్నాయి. దీని ఫలితంగా ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తడం లేదు. ఇప్పటికే రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రెండో పంట కూడా సాగు జరగనుంది. కాబట్టి భూగర్భ జలాలు మరింత రీచార్జ్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో వేసవిలో కూడా చాలా వరకూ తాగునీటి సమస్యను అధిగమించవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా సరాసరి భూగర్భ జలమట్టం 5.69 మీటర్లుగా ఉంది. అంటే దాదాపు అన్ని మండలాల్లో ఆరు మీటర్లలోపే భూగర్భ జలాలు కనిపిస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరిలో 5.75 మీటర్లు లోతున జలం ఉండగా, మేలో అది 7.07 మీటర్లకు పడిపోయింది. అప్పుడు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు లేకపోవడం, తద్వారా రెండో పంట సాగు జరగకపోవడంతో జలాలు జారిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత అక్టోబరు, నవంబరు నెలల్లో భారీ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు మళ్లీ రీచార్జ్ అయ్యాయి. దీంతో నవంబరులో భూగర్భ జలమట్టం 5.76 మీటర్లకు పెరిగింది. ఆ తర్వాత పూర్తి ఆయకట్టు సాగు జరగడంతో పెన్నా నదితోపాటు కాలువల్లో పుష్కలంగా నీరు పారింది. చెరువులు, రిజర్వాయర్లలో నీరు నిల్వ ఉండటంతో జలమట్టం పడిపోలేదు. రాష్ట్రంలో సరాసరిన 8.81 మీటర్లుగా ఉంటే నెల్లూరు జిల్లాలో మాత్రం అది 5.69 మీటర్లుగా ఉండటం విశేషం. జిల్లాలో దాదాపు 20 మండలాల్లో ఆరు మీటర్లలోపే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈ దఫా వర్షాలు కూడా జిల్లాలో పుష్కలంగా కురిశాయి. గతేడాది జూన్ నుంచి ఫిబ్రవరి వరకూ 981.73 మీ.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 1084.36 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 10.45 శాతం ఎక్కువ వర్షం కురిసింది. భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉండడానికి ఇదే ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా జిల్లాలోని పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక రూపొందించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఏడాది జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడదని యంత్రాంగం అంచనా వేస్తోంది. ఒకటీ రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తినా నీటిని సరఫరా చేసే విధంగా ప్రణాళిక రూపొందించింది.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య) : ప్రధాన మంత్రి యోగా అవార్డు-2025కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపిన వ్యక్తులు, సంస్థలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. వ్యక్తిగత విభాగంలో 40 ఏళ్లలోపు, సంస్థలైతే 20 ఏళ్ల లోపు అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31లోగా innovetev india.my gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.





సచివాలయ కేంద్రం.. పందుల పెంపకం

మండల కేంద్రమైన గుడ్లూరులో గత వైసీపీ పాలనలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్ర భవనాలు ఇవి. అప్పట్లోనే 90 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.లక్షల వెచ్చించి అప్పటి పాలకులు ఈ భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే, బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. ఇంకేముంది ఈ భవనాల్లో కింది గదుల్లో పందుల పెంపకం జరుగుతుండగా, పై గదుల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఈ భవనాల సమీపంలోనే వైద్య ఆరోగ్య కేంద్రం, బాలుర వసతిగృహం ఉండటంతో ప్రజలు, విద్యార్థులు దుర్వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తయిన భవనాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

- గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి)



సచివాలయ భవనంలో దొడ్లు కట్టి పెంచుతున్న పందులు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 435

» పామూరు రోడ్డు సర్కిల్‌లో ఆక్రమణలు తొలగించేనా?
» యథావిధిగా అభివృద్ధి చేస్తే మరింత ఇబ్బంది
» రూపుమారిన ట్రాఫిక్ సమస్య తీరేనా?

కందుకూరు ముఖద్వారానికి

మహర్దశ పట్టేనా!


కందుకూరు పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టనున్న పామూరు రోడ్డు సర్కిల్

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ ముఖద్వారంగా భావించే పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం కలగడంపై ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే గుడ్లూరు-కావలి రోడ్డుతో పాటు పట్టణంలోని ప్రధానరోడ్లు కలుస్తూ నాలుగురోడ్ల కూడలిగా, కందుకూరు ముఖద్వారంగా ఉన్న పామూరు రోడ్డు సర్కిల్ ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఫలితంగా నాలుగువైపుల నుంచి వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో గతంలో పలుమార్లు తాత్కాలికంగా ఆక్రమణల తొలగించినా ప్రయోజనం లేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ సర్కిల్ అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుని రూ.1.07 కోట్ల నుడా నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. సర్కిల్‌లో కందుకూరుకు ఐకానిక్‌గా ఉండేలా స్వాగత నిర్మాణం చేయాలన్న ఆలోచనతో ఈ పనులకు రూపకల్పన చేశారు. అయితే ఈ సర్కిల్‌లో నాలుగువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించాకే సర్కిల్ అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణలు తొలగించకుండా సర్కిల్ అభివృద్ధి చేసినా సమస్య మరింత పెరగటం తప్ప పరిష్కారం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పామూరు సర్కిల్‌తో పాటు అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు సెంట్రల్ డివైడర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు గతంలో తెలుపగా ప్రస్తుతం కేవలం సర్కిల్ అభివృద్ధికి రూ.10 లక్షలు మాత్రమే కేటాయించి 97 లక్షలు గుడ్లూరు రోడ్డు డ్రైన్ నిర్మాణం కోసం మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. ఆక్రమణల పూర్తిస్థాయిలో తొలగించకుండా రోడ్డు మధ్యలో సర్కిల్ నిర్మిస్తే సమస్య జఠిలమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పామూరు రోడ్డు సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నా ఆక్రమణల తొలగింపుతో పాటు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ కూడా చేయాల్సి వస్తుందని అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రిలయన్స్ స్మార్ట్ వరకు డివైడర్ ఏర్పాటుకు అనువుగా రోడ్డు విశాలంగా ఉన్నప్పటికీ అక్కడి నుంచి పామూరు రోడ్డు సర్కిల్ వరకు డివైడర్ ఏర్పాటు చేసేందుకు కావలసిన రోడ్డు లేదు. ప్రస్తుతం ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక డివైడర్ పెడితే రోడ్డు మరీ కుచించుకుపోతోంది. ఈ ప్రాంతంలో పలు బ్యాంకులు ఉండటంతో ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే పార్కు చేయడం పరిపాటిగా మారింది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తొలిగే పరిస్థితి ఇప్పుడే ఉండటం లేదు.

డివైడర్, సెంట్రల్ లైటింగ్‌కు అంచనాలు రూపొందిస్తాం

కందుకూరు పట్టణం పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి మాత్రమే ప్రస్తుతం నిధులు కేటాయించాం. అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు సెంట్రల్ లైటింగ్‌తోపాటు డివైడర్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసినందున ఆ నిధులతో పనులు చేసేలా అంచనాలు రూపొందిస్తున్నాం.

– గణపతి, మున్సిపల్ డీఈ

ముగిసిన సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

● సమస్యలపై మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో 10 రోజుల పాటు జరిగిన ప్రజా చైతన్య యాత్ర సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గుర్తించిన పట్టణ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలోని 40వార్డులలో పర్యటించామని ఎక్కడ చూసిన సమస్యలతో ప్రజలు సతమతమతున్నారన్నారు. ప్రధానంగా పేదలు, గిరిజనులు నివశించే కాలనీల్లో కనీస మౌలిక వసతులప లేక దుర్భరజీవితాలు జీవిస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీ ట్యాంకర్లు కూడా సరిగ్గా నీటి సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణయ్య, తిరుపాలు, కృష్ణమెహన్, మధుసూదన్‌రావు, మాల్యాద్రి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలల్లో రూ.6 కోట్లతో అభివృద్ధి

● రూ.1.37 కోట్ల పనులకు ఎమ్మెల్యే ఇంటూరి శంకుస్థాపన


లింగసముద్రం: అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి చ్చిన 8 నెలల్లో కందుకూరు పట్టణంలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలో రూ.1.37 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.07 కోట్లతో పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధి, అక్కడి నుంచి మాచవరం రోడ్డుకు స్టోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, నాంచారమ్మ కాలనీలో రూ.30 లక్షలతో సిమెంటురోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని శంకర్ బుక్‌స్టాల్ ఎదురుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, డీఈ గణపతి, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● ముస్లింలకు ఇఫ్తార్ విందు

కందుకూరు పట్టణంలోని ముస్లింలకు పవిత్ర రంజాన్‌మాసం సందర్భంగా సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శివాలయం సమీపంలోని పెద్దమసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించటంతో పాటు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ రఫీ, షేక్ సలాం, నాయబ్‌రసూల్, మున్నా, మహబూబ్ బాషా, నజీర్, గౌస్‌బాషా, అహ్మద్‌బాషా, ఖలీల్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

లింగసముద్రం : మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పశువుల మేత పోరంబోకు భూమిలో చాలా కాలం క్రితం ఇళ్లు నిర్మించుకున్న తమకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. అసైన్డ్ భూములకు వెబ్‌సైట్‌లో 1బి, అడంగలు రాకపోవడంతో తాము పంట రుణాలు తీసుకోలేకపోతున్నామని బాధితులు వాపోయారు. అయితే వీటిని ప్రభుత్వమే నిలుపుదల చేసిందని తహసీల్దారు సీతామహాలక్ష్మి ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే తాము కొనుగోలు చేసిన అసైన్డ్ భూములను తమ పేరుతో మ్యుటేషన్ చేసి పాస్ పుస్తకాలు ఇప్పించాలని మరికొందరు రైతులు కోరారు. దీంతో ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన చినపవని పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ను ప్రారంభించి అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వీవీ నారాయణరెడ్డి, ఎంపీడీవో కె.శ్రీనివాసులు, ఏఈ నాగరాజు, ఏపీఎం కే.సింహాద్రిరావు, వైద్యాధికారి డాక్టర్ అనూరాధ, ఏఈ షేక్ ఫిరోజ్, టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కావలి ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా

● ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి


ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కా వలి ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని ఎమ్మె ల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తసత్రంలో సోమవారం జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభు త్వ లక్ష్యమన్నారు. కొత్తసత్రంలో 500 మంది రైతుల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు లేక పోవటంతో వారు ఏ పథకానికి అర్హులు కాలేకపోతున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పట్టాలు ఇప్పిస్తామన్నారు. తాగునీటి అవసరాల కోసం సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాని హామీ ఇచ్చారు. తుమ్మల పెంట రోడ్డు నిర్మాణంలో అడుగడుగున ఆటంకాలు సృష్టిస్తున్నారని, ఎన్ని అడ్డంకులు వచ్చినా త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తానన్నారు. ఆయకట్టు స్థిరీకరణ కోసం రూ.52 కోట్లతో కొండేపి డ్రెయిన్ పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, జనసేన నాయకుడు సిద్ధూ, స్థానిక నాయకులు సోమయ్యగారి రమణ, విక్రమ్‌రెడ్డి, మస్తాన్, పులి రమేష్, కొండూరు తిరుపతి, ఉప్పాల దినేష్, రవీంద్ర, తాతయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు భూ సమస్యలు

బిట్రగుంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏకే కండ్రిక, జక్కేపల్లి గూడూరు, ఎస్సీపాలెం, అక్కరాజు వారి కండ్రిక గ్రామాలకు చెందిన పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. వాటిని స్వీకరించిన తహసీల్దారు పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలపై మండల సీపీఎం నేత తుమ్మల వెంకయ్య ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట సీఐటీయు మండల నేతలు చల్లా నరహరి, అన్వర్‌బాషా, సీపీఎం నేతలు ఉప్పాల యానాదయ్య, బ్రహ్మయ్య, భాస్కర్ ఉన్నారు.

మినీ లారీ బోల్తా

● డ్రైవర్‌కి గాయాలు


బోల్తాపడిన బియ్యం లారీ

గుడ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరుకు సమీపంలో కందుకూరు-గుడ్లూరు రోడ్డుపై సోమవారం బియ్యం లోడుతో వెళుతున్న మినీలారీ అదుపు తప్పి బోల్తా పడింది. షాపులకు వేసేందుకు పోలీస్ రైస్‌ను కావలి నుంచి గుడ్లూరు మీదుగా కందుకూరుకు వెళుతుండగా గుడ్లూరు ఉప్పుటేరు దాటిన తరువాత ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్‌మార్జిన్‌లో అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ గోవింద్‌కు స్వల్పగాయాలయ్యాయి. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో వాహన్నా రోడ్డుపైకి తెచ్చారు.

కావలికి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పాదయాత్ర


పట్టణంలో పాదయాత్రగా వస్తున్న ప్రజ్ఞానంద సరస్వతి

కావలిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సర్వతి తెనాలి నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర సోమవారం కావలికి చేరింది. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, శిరీష దంపతుల పర్యవేక్షణలో ఆర్యవైశ్యులు, పురప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన కన్యకా పరమేశ్వరిని దర్శించుకుని పూజలు నిర్వహించి పాదయాత్రగా బృందావనం కాలనీ కల్యాణ మండపానికి చేరుకున్నారు. ప్రజలు, వ్యాపారులు ఆయనకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం కల్యాణమండపంలో బాలస్వామీజి యాజ్ఞక నిర్వహణలో అర్చక బృందం మంత్రోచ్చరణలతో నిర్వహించిన శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కార్యమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, సంఘం బాధ్యులు ఓరుగంటి రామకృష్ణ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య ప్రమాదకర గుంతలు

కావలి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు ఇందిరమ్మకాలనీలో నివాసాల మధ్యన ఉన్న గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అట్టల ఫ్యాక్టరీ కాలనీ, వికలాంగుల కాలనీ, వినాయక కాలనీలకు సమీపంలో గతంలో బొంతరాయి తవ్వకాలు జరపడంతో ఈ గుంతలు ఏర్పడ్డాయి. ఒక్కో గుంట సుమారు 20 అడుగుల మేరకు లోతు ఉండటంతో పాటు వర్షాకాలంలో వర్షపు నీరు నిలుస్తుందని చెబుతున్నారు. చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి అందులో పడి ప్రమాదాలకు గురవుతారని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దివ్యాంగుల కాలనీ సమీపంలోని గుంతలు

పీహెచ్‌సీ సిబ్బందికి అవార్డులు


అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలితో ప్రశంసాపత్రాలు అందుకున్న కలిగిరి వైద్యసిబ్బంది

కలిగిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవంలో భాగంగా మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఏఎన్ఎంలు కే అనిత, బీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వై లక్ష్మీప్రసన్న, ఆశా కార్యకర్త పీ మంజులకు జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి జిల్లా కేంద్రంలో సోమవారం అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి : సీఐటీయూ



పూర్తిగా నిండిన చెత్తబండిని తోయలేక అవస్థ పడుతున్న కార్మికురాలు

కావలిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కార్మికుల పట్ల వేధింపులు ఆపాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయు ఆధ్వర్యంలో వార్డుల్లో పర్యటించి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. మహిళా కార్మికులు అధిక బరువుండే పుష్‌కార్టులు తోయలేక నానా అవస్థలు పడుతుండడాన్ని గుర్తించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గతంలో పలు దఫాలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకో లేదని ఆరోపించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న యూనియన్ నేత మల్లి అంకయ్య

కావలి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లి అంకయ్య కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలసి ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని, వయస్సు రీత్యా తొలగించిన కార్మికుల ఈపీఎఫ్ సెటిల్‌మెంట్ చేసి వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వైనారాయణ, టీ.వెంకటేష్, జీ.అంకయ్య, ప్రభావతి, కే.లక్ష్మి, బీ.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు పొగాకు బ్యారన్ల దగ్ధం : రూ.8 లక్షల ఆస్తి నష్టం


పొగాకు బ్యారన్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

వలేటివారిపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లవారి పాలెంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో నల్లబోతుల అంకయ్య, మీనుగు మాల్యాద్రిలకు చెందిన రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం సంభవించింది. పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడి మంటలు వ్యాపించి బ్యారన్లు దగ్ధమైనట్లు బాధితులు అంకయ్య, మాల్యాద్రిలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కందుకూరు అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బోర్డు అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

క్రీడల్లో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, తదితరులు

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. ఏ1 గ్లోబల్‌లో జరిగిన పోటీలలో వాలీబాల్‌లో కళాశాల జట్టు విన్నర్స్‌గాను, క్రికెట్‌లో రన్నర్స్‌గా కప్పులు, ప్రశంసాపత్రాలు సాధించారని క్రికెట్ టీంలో ప్రకాష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడని తెలిపారు. అలాగే శామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పోటీలలో కబడ్డీ విభాగంలో కళాశాల జట్టు విజేతగా నిలిచిందని తెలిపారు. దీంతో సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, అకడమిక్ ఇంచార్జి ఎస్ఎన్ మీరావలి, జీ.ప్రసాద్ అభినందించారు.

న్యూస్ బాక్స్

నేడు టీఆర్ఆర్‌లో జాబ్‌మేళా

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. హెటిరో ల్యాబ్స్, ఏరీస్ ఆగ్రో, ఎస్‌బీఐ కార్డ్స్, డైకిన్, పేటీఎం తదితర సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని 190మంది వరకు ఉద్యోగాలకు ఎంపిక చేసుకోనున్నాయని తెలిపారు.

ఉపాధి కూలీలకు కూలి బకాయిలు చెల్లించాలి

ఉలవపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల రోజువారి కూలి బకాయిలు రూ.3,422 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మోహన్ ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కోత విధించిందని పేర్కొన్నారు. ఉపాధి నిధులు సక్రమంగా విడుదల కావడం లేదని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఈనెల 12న పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొందని తెలిపారు. ఆధార్‌కార్డు లింక్ కాలేదని సుమారు 90 లక్షల మంది కూలీలను పథకానికి దూరం చేసిందని, ఆధార్ తప్పనిసరి షరత్‌ను తొలగించాలని సూచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీల వేతనాలు విడుదలపై నిర్లక్ష్యం విడనాడాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టీ.జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్లో ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

వలేటివారిపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం ఎంపీడీవో, తహసీల్దారు, ఉపాధిహామీ పథకం ఏపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు లేని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీ-4 విధానంతోనే సమగ్రాభివృద్ధి


కొండాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీ-4 విధానంతో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు అన్నారు. స్థానిక సచివాలయ ఆవరణలో ఈ విధానంపై గ్రామస్థులకు సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పాలకీర్తి కోటేశ్వరమ్మ, గుడవల్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, సెంట్రల్ టెలికాం బోర్డు అడ్వైజరీ మెంబరు తానికొండ అనూష, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

బిట్రగుంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సామాజిక సేవతో ముందుకు సాగాలని కావలి రూరల్ సీఐ పాపారావు అన్నారు. సోమవారం బోగోలు మండలం తిప్ప పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన స్థానిక సమస్యలపై ఎస్సై భోజ్యను అడిగి తెలుసుకున్నారు. యువతను తప్పుదోవ పట్టించే బెట్టింగులపై గట్టి నిఘా ఉంచామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో 11కేవీ వీఐపీ ఫీడర్ మీద లైన్‌వర్క్ ఉన్నందున మంగళవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తూర్పు వడ్డిపాలెం, తూర్పు కమ్మపాలెం, సాలిపాలెం, మారెమ్మ మిట్ట, కోటారెడ్డినగర్, హీరోహోండా షోరూం ఏరియా, క్లబ్‌రోడ్డు, ఆదిఆంధ్ర కాలనీ ప్రాంతాల వినియోగదారులు అసౌకర్యాన్ని గుర్తించాలని కోరారు.



ఇదేదో భలే బాగుందే!

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారుల కష్టాలు ఎనలేనివి. భానుడి దెబ్బకు ఎవరైనా అబ్బా అనాల్సిందే. అలా అనకుండా ఉండాలంటే ఏం చేయాలో కొంతమంది ఆలోచిస్తూ వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ క్రమంలో అల్లూరులో ఓ వ్యక్తి తన కుటుంబంతో కలసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుంటాడు. తనకు, తన కుటుంబ సభ్యులను ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టాడు. వాహనానికి పైన రేకుతో నీడ కోసం ఆటోకు వేసినట్లు టెంటును ఏర్పాటు చేసి అందులో ప్రయాణించడం స్థానికులను ఆకట్టుకుంటుంది. ఇదేదో భలే బాగుందే... అంటూ అందరూ ఆ వాహనాన్ని వింతగా చూస్తున్నారు. ఇటువంటివి మరికొన్ని వాహనాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

- అల్లూరు(ఆంధ్రజ్యోతి)

నెల్లూరు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన కవి పెరుగు రామకృష్ణ. పసి వయసు నుంచే కవన విద్యను ఒంటబట్టించుకుని అర్ధశతాబ్దంగా అక్షర సేద్యం చేస్తున్న నవతరం సాహితీవేత్త. ఆంధ్ర కవితల్లో దిట్ట అనిపించుకుని, అంతటితో ఆగక తాను రాసిన కవితలను దేశ విదేశీ భాషల్లో తర్జుమా చేసి తెలుగు కవితల కమ్మదనాన్ని విశ్వ వేదికలపైకి తీసుకెళ్లిన ఘనుడు. అలాగే, విదేశీ సాహిత్యాన్నీ తెలుగులోకి అనువదించి ఆ భాషలపై తనకున్న పట్టును ప్రదర్శించిన విభిన్న కవి. అభ్యుదయ రచయితగా, సంపాదకుడిగా తెలుగు విస్తృతికి కృషి చేస్తున్న భాషాభిమాని. 150కిపైగా జాతీయ పురస్కారాలు, 60 అంతర్జాతీయ అవార్డులు ఆయన సాహితీ సేవకు వరించిన కుసుమ మాలికలు.

- అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ
- పదో తరగతి నుంచే సాహితీ సేద్యం
- అర్ధశతాబ్దపు ఆంధ్ర కవి
- ఎన్నో భాషల్లోకి తర్జుమాలు
- దేశ, విదేశాల్లో పురస్కారాలు



● ఫ్లెమింగో దీర్ఘకావ్యం

అతిథులుగా ఏటా విహారానికి వచ్చే ఫ్లెమింగో పక్షులపై రామకృష్ణ దీర్ఘకావ్యాన్ని రాశారు. 2006లో వెలువడిన ఆ కావ్యంలోని 52 పంక్తులను కృష్ణ గీతికలు పేర 2023లో రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి తెలుగు పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టడం ఆయన కవితా పటిమకు నిదర్శనం.

ఎల్లలు దాటిన కవిత్వం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పెరుగు రామకృష్ణ నెల్లూరులో 1960 మే 27న పెరుగు కమలమ్మ, వెంకటేశ్వర్లుకు జన్మించారు. ఆయన పుట్టిన మే 27 యాదృచ్ఛికంగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మదినం కూడా కావడం విశేషం. ఠాగూర్ అంతటి వాడివి కావాలంటూ కుటుంబ సభ్యులు, సన్నిహితులు ప్రోత్సహించడంతో రామకృష్ణలో బాల్యంలోనే సాహిత్యం దిశగా పునాది పడింది. ఆయన పాఠశాల విద్యను నెల్లూరులో పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల నుంచి ఆంగ్ల సాహిత్యంలో డిగ్రీ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ పట్టా పొందారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి పీజీ డిప్లమో చేశారు. పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా 1984లో వాణిజ్యపన్నుల శాఖలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 36 ఏళ్ల సర్వీసు అనంతరం జీఎస్టీ అధికారిగా విరమణ పొందారు.

● 50 ఏళ్ల సాహితీ ప్రయాణం

రామకృష్ణ తెలుగు సాహిత్యానికి 50 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. ఆయన పదో తరగతి విద్యార్థిగా 1975లో తొలి కవిత రాశారు. అది ఆంధ్రజ్యోతి వార పత్రికలో ప్రచురితమైంది. 1980లో మానసవీణ అనే లిఖిత పత్రికను తన సంపాదకీయంలో నడిపారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం జరిగిన ఉద్యమాల్లో తన వంతు పాత్రను పోషించారు. 1996లో తొలి కవిత్వ సంపుటిని ప్రచురించారు. 2024 వరకు ఆయన రాసిన 24 పుస్తకాలు వెలువడ్డాయి.

● విదేశీ వేదికలపై వెలుగు

తెలుగు సాహిత్యంపై పట్టు సాధించిన డాక్టర్ పెరుగు రామకృష్ణ 13 ఏళ్లకుపైగా విదేశీ వేదికలపై తెలుగు సాహిత్యానికి ఆంగ్ల అనువాదాలు వినిపించి అంతర్జాతీయ సాహిత్యకారుల్లో ఒకరిగా స్థానం సంపాదించారు. 2011లో గ్రీసు దేశంలో జరిగిన సాహితీ సభలో తెలుగు కవిత్వాన్ని వినిపించారు. అలాగే అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యంలోని పలు వేదికలపై తెలుగు భాషా విశిష్టతను తెలియజేస్తూ, కవితలతోపాటు పత్రాలను సమర్పించారు. ఆయన కవితలు పలు విదేశీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.



చెక్ రిపబ్లిక్ దేశ రాజధానిలో గౌరవ డీలిట్ డిగ్రీని అందుకుంటున్న రామకృష్ణ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి సత్కారం అందుకుంటూ..

● జాతీయ, అంతర్జాతీయ పట్టాలు, పురస్కారాలు

రామకృష్ణ, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వ విద్యాలయాల్లో రెండు ఎంఫిల్ డిగ్రీలు, సమగ్ర కవిత్వం మీద పీహెచ్‌డీ పొందారు. 2016లో చెక్ రిపబ్లిక్‌లో నోబెల్ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ ఎర్నెస్టో క హాన్ నుంచి డిలిట్ గౌరవ పట్టా అందుకున్నారు. రామకృష్ణ కవితలు ఆంగ్లం, గ్రీక్, అరబ్, స్పానిష్, ఫ్రెంచి వంటి భాషల్లోకి అనువాదమై తెలుగు ఖ్యాతిని చాటాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశిష్ట కవిగా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా కీర్తి పురస్కారం, గుజరాత్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు... ఇలా 150కిపైగా జాతీయ అవార్డులు, 60 విదేశీ అవార్డులు అందుకున్నారు. రామకృష్ణ ఆంగ్లం నుంచి తెలుగుకి అనువాదం చేసిన పుస్తకాలను నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించాయి. ప్రస్తుతం అభ్యుదయ రైతు మాస పత్రిక సంపాదకులుగా, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన జాతీయ సంస్థ ఆంధ్రప్రదేశ్ శాఖకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా

సమస్యలు పరిష్కారించాలి : జేసీ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 24 (ఆంధ్ర జ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్క రించాలని జేసీ కే. కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. అర్జీదారుల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వేదికకు 309 అర్జీలు వచ్చా యి. వీటిలో 138 వినతులు రెవెన్యూ శాఖకు చెందినవి. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

● రాయితీలు త్వరగా ఇవ్వాలి

అట్రాసిటీ కేసులో బాధితులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు త్వరగా మంజూరు చేయాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.మాబు జేసీ వినతిపత్రం అందించారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలని విన్న వించారు.

● కొత్తూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంచినీటి వసతి కల్పించాలని ఆ ప్రాంతవాసులు వీ.రమేష్, జీ రమణారెడ్డి జేసీకి వినతిపత్రం సమర్పించారు. అక్కడున్న బావులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకో వాలని కోరారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 86 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), మార్చి 24: నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 86 మంది బాధితులు తరలివచ్చి ఎస్పీ జీ. కృష్ణకాంత్‌కు ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు వినతులు స్వీకరించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట దళితుల ధర్నా

నెల్లూరు (హరనాథపురం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విడవలూరు మండలం ఊటుకూరులో దళితుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు దళిత నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ 2018లో విడవలూరు మండలం ఊటుకూరులో ఎస్సీ కార్పొరేషన్ వారు భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నెంబరు 1288 నుంచి 1294 వరకు 90.96 ఎకరాల భూమిని దళితులకు ఇచ్చారని తెలిపారు. దాంట్లో 50 ఎకరాలను కబ్జాదారులు ఆక్రమించుకుని పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. వారిపై తహసీల్దారు చర్యలు తీసుకోవడంలేదని ఆయన ఆరోపించారు. అద్దంకి కార్తీక్, పీ.పాపయ్య మాట్లాడుతూ దాదాపు రూ.8కోట్ల విలువైన భూములను ఆక్రమణదారులు సాగుబడి చేసుకుని లబ్ధిపొందుతున్నారని తెలిపారు. తక్షణం కలెక్టర్ జోక్యం చేసుకుని హద్దులు చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు కొండయ్య, ఇమ్మానియేల్, శివాజీ, జెడ్డా వాసు, తదితరులు పాల్గొన్నారు.



లైంగిక వేధింపుల కేసులో జీవితఖైదు

నెల్లూరు (లీగల్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు సన్నెరెడ్డి సుబ్రహ్మణ్యంకు జీవితఖైదుతో పాటు రూ.22వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, సైదాపురం మండలం జప్లాపురంకు చెందిన బాలిక(10) 2021 ఏప్రిల్ 29వతేదీ ఉదయం 10 గంటల సమయంలో ఆడుకుంటుండగా, అదే మండలం చాగణం ఎర్రసంఘానికి చెందిన సన్నెరెడ్డి సుబ్రహ్మణ్యం బాలికకు మామిడికాయలు కొనిస్తానని సమీపంలోని చెట్ల పొదలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా జైలు తోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 565 బేళ్లను తీసుకొని రాగా తొమ్మిది కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 545 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 20 బేళ్లను తిరస్క రించారు. గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 260గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 507 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 174 కేంద్రాల్లో జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన మ్యాథ్స్ పరీక్షకు 507 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 28,834 మంది హాజరు కావాల్సి ఉండగా, 28,327 మంది హాజరయ్యారు. 507 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరుపై జిల్లా అబ్జర్వర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆరు కేంద్రాలను, డీఈవో డాక్టర్ బాలాజీ రావు ఏడు కేంద్రాలను, పరీక్షల విభాగం ఏసీ రెండు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 56 కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో భాగంగా మ్యాథ్స్‌కు 1535 మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా, 1324 మంది హాజరయ్యారు. 211 మంది గైర్హాజరయినట్లు డీఈవో వివరించారు.

డాక్టర్ శ్రావణికి

అరుదైన అవకాశం



- 74వ నోబెల్ లారియట్ సమావేశానికి ఎంపిక
- వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు అభినందనలు

వెంకటాచలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ పూర్వ విద్యార్థిని డాక్టర్ బతినపట్ల శ్రావణికి 74వ లిండౌ నోబెల్ లారియట్ సమావేశంలో పాల్గొనే అరుదైన గొప్ప అవకాశం లభించడం శుభపరి ణామం అని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ విషయంపై సోమవా రం ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 600మంది యువశాస్త్రవేత్తల్లో డాక్టర్ శ్రావణి ఒకరిగా ఎంపికై ఈ ఏడాది జూన్, జూలైలో జర్మనీలోని లిండౌ నగరంలో జరుగనున్న సమావేశంలో పాల్గొం టారని చెప్పారు. శ్రావణి వీఎస్‌యూలో ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. గత కొన్నేళ్లగా ఆమె హైడ్రోజన్ ఉత్పత్తికి భూమిలో విస్తృతంగా లభించే లోహాల ఆధారిత ఎలెక్ట్రోక్యాటలిస్ట్ అభివృద్ధిపై అనేక పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలోని ఎంకే పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా యూనివర్సిటీలో పని చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో నోబెల్ బహుమతి గ్రహీతలతో సంప్రదింపులు జరిపి రసాయనశాస్త్ర రంగంలో అగ్రశ్రేణి పరిశోధనలో తనవంతు పాత్ర పోషించేందుకు శ్రావణికి అవకా శం లభించిందన్నారు. ఆమెకు వీఎస్‌యూ తరుపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

- 25 టీబీ ముక్త పంచాయతీల ఎంపిక
- అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత కోరారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ నగరంలో అవగాహన ర్యాలీ జరిగింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బీఈడీ కళాశాల వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్థులకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నామని, ఇందులో భాగంగా ఎంతో ఖరీదైన మందులను సైతం ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అంద చేస్తున్నామని చెప్పారు. 92 గళ్ల పరీక్షల ద్వారా వ్యాధిగ్రస్థులను గుర్తిస్తున్నామన్నారు. టీబీ ముక్త పంచాయత్ కింద 25 పంచాయతీలు ఎంపికయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలకు సర్టిఫికెట్‌తోపాటు గాంధీజీ జ్ఞాపికను అందచేశారు. అలాగే వ్యాధి నివారణలో ఉత్తమ ప్రతిభ చూపిన వైద్యులు, సూపర్‌వైజర్లు, సీహెచ్‌వో, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా కార్యకర్తలకు ప్రతిభా పురస్కరాలు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, న్యూక్లియస్ మెడికల్ అధికారి డాక్టర్ సురేంద్రబాబు, డీపీఎంవో డాక్టర్ రమేష్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ భవానీ రామకృష్ణ, డెమో కనకరత్నం, డీఎంవో హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ

వేణుగోపాలస్వామి ఆలయానికి పూర్వవైభవం

పునర్నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ : మంత్రి ఆనం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రాశస్త్యం కలిగిన మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించామని, అందరి సహకారంతో ఆలయానికి పూర్వవైభవం వచ్చేలా నిర్మాణాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన పాలక మండలి సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. అనంతరం అనంతరం విలేకరులతో ఆనం మాట్లాడుతూ గతంలో ఈ ఆలయం భక్తులతో కళకళలా డేదని, ఆలయ సత్రాలలో వందలాది వివాహాలు జరిగేవని తెలిపారు. మంచి ముహూర్తంలో తిరిగి ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన పనులకు శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్థపతులు, చీఫ్ ఇంజనీర్లు ఆలయాన్ని పరిశీలించి మాస్టర్ ప్లాన్ రూపొందించారని, దీనిని పాలక మండలి ఆమోదించి దేవదాయ శాఖకు పంపిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ముందుగా మంత్రి ఆనంకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్తలు మన్నెం లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, తుమ్మల సుమన్‌తేజారెడ్డి, ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, పలువురు ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ పాలక మండలి సమావేశంలో మంత్రి ఆనం



కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కళాశాలల ప్రతినిధులు

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం

జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల జిల్లా అధ్యక్షుడిగా ఆర్..కృష్ణారెడ్డి (కృష్ణచైతన్య) ఎంపికయ్యారు. నగరంలోని కృష్ణచైతన్య కళాశాల ప్రాంగణంలో సోమవారం అన్నీ కళాశాలల మేనేజ్‌మెంట్ సభ్యుల ఆధ్వర్యంలో వీఎస్‌యూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక జరిగింది. రాష్ట్రనేతల పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపికలో జిల్లా అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా టీ.మనోహర్‌రెడ్డి(నాయుడుపేట వేమా), కోశాధికారిగా జీ.నారాయణరెడ్డి(పొదలకూరు విజ్ఞాన్)లను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా జీ.రాజకుమార్ చౌదరి, పీ.నిరంజన్‌రెడ్డి, కేఎస్.రాజు, సంయుక్త కార్యదర్శులుగా జే.విజయ్‌బాబు, జీ.రాంగోపాల్, టీ.దినేష్‌వర్ధన్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు గుండారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈఎంపికలో సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎంపిక చేసి, జిల్లాలో డిగ్రీ, పీజీ కళాశాలల ఉన్నతికి కొత్త కమిటీ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధ్యక్షుడితోపాటు సభ్యులందరినీ సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రతినిధులు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.వెంగల్‌రెడ్డి, పీ.జానకిరామ్, వై.శివసాకేత్, ఎం.సుబ్బారెడ్డి, ఎం.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల సంఘం కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(క్రైం), మార్చి (ఆంధ్రజ్యోతి) 24: జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షులుగా మారెళ్ల కృష్ణయ్య, అరిగెల శీనయ్య, (ఒకరు రెండేళ్లు, మరొకరు మూడేళ్లు) అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం కిరణ్‌సింగ్, జనరల్ కార్యదర్శిగా బీ. దయాకర్, ట్రెజరర్‌గా ఏ శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా టీ. సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.అజీజ్‌బాషా, జాయింట్ కార్యదర్శులుగా వై మాల్యాద్రి, ఎం అంకయ్య, ప్రెస్ కార్యదర్శులుగా ఎం. పెంచలయ్య, టీ. శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం రవి, సీహెచ్ శ్రీహరి, పీ. సుబ్బయ్య, బీ. షట్టయ్యలను ఎంపిక చేశారు. కొత్తగా ఎంపికయిన కార్యవర్గ సభ్యులు ఎక్సైజ్ కార్యాలయంలో ఈఎస్ శ్రీనివాసనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.